ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

18·10·50



4 అణాలు

విషయానుక్రమణిక

18 అక్టోబరు 1950

ముఖచిత్రం: అభినేత్రి మాలతి

వ్యాసాలు

నేటి ప్రపంచం—సూర్యనారాయణ 2
మనదేశం—సీతారామ్ 3

సీరియల్స్

దాగిన ద్వేషం (డిటెక్టివ్) 4
రుద్రమదేవి—శ్రీ నోరి నరసింహశాస్త్రి 11

కథలు


ఈ తరం—శ్రీ రవి 5
ఉభయభ్రష్టత్వం—శ్రీ గోవిందరాజు రామకృష్ణారావు 8
వ్యాపారదక్షత—"అంగారకుడు" 14
రెండో పెళ్లి—శ్రీ కొడవటిగంటి కుటుంబరావు 15
పౌరుషం—ం వు 36

సినిమా:

పరమానందయ్య శిష్యులు—చిత్రసమీక్ష 32

బొమ్మరిల్లు:

దసరా పండుగ—"రాజేశ్వర్ 20
టామ్ సాయర్ (సీరియల్)—మార్క్ ట్వేన్ 21
పువ్వులమ్మి—శ్రీ నండూరి రామమోహనరావు 26
నవ్వించే పల్లంగోరు—"మధుశ్రీ 27
ఇటు బంగారం అటు ఎండ—శ్రీమతి సతాదేవి 30
తమాషా ప్రశ్నలు 40



ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతిబుధవారము
ప్రకటింపబడును
Founder: K. NAGESWARA RAO

సంపుటము **43**
సంచిక **6**

విక్రృతి సంవత్సర ఆశ్వయుజ శుద్ధ అష్టమి బుధవారము



ఆకలిగొన్నవారికి ఆహారం:

ఉత్తరకొరియాలో ప్రవేశించిన దక్షిణకొరియన్లు ప్రజాస్వామిక సిద్ధాంతదూతలని సెవూల్ ప్రభుత్వ ప్రధాని సింగ్మన్‌రీ ప్రకటించాడు. —నేషనల్ హెరాల్డ్

మనదేశం

బొంబాయి సమ్మె

బొంబాయిలో బట్టల మిల్లుల కార్మికుల సమ్మె ముగిసింది. సమ్మె విరమించాలని సోషలిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి అశోక మెహతాయే సూచించారు. ఈసందర్భంలో జరగని రైల్వే కార్మికుల సమ్మె జ్ఞప్తికివస్తుంది. ఇప్పుడే కారణాలవల్ల బొంబాయి మిల్లు కార్మికుల సమ్మెను అశోక మెహతా విరమింపచేశారో, అప్పుడు అటువంటికారణాలపైనే జయప్రకాశనారాయణ రైల్వే సమ్మె తలపును మానుకున్నారు. ఇప్పుడు సమ్మెచేసి వీరెంత సాధించారో, అప్పుడు సమ్మె బెదిరించి వారూ అంతే సాధించారు. "మేం ఒకపట్టుని సమ్మెలే చెయ్యం" అని పదేపదేచెప్పుకునే కాంగ్రెస్ పక్షానికి చెందిన జాతీయకార్మిక సంఘాలవారూ ఈపాటిదే సాధించారు. కార్మికులికి ఏమి ఒరిగిందో చూడబోతే ఎవరుసాధించినదైనా ఇప్పటికి సున్నే. కాగా ఒక తెరవాళ్ళ ఇళ్లు కడిగేసినట్టయిపోయింది. కోర్టువారు ఇప్పించే రెండు మాసాల బోనస్, సమ్మె చేసిన 62 రోజులకూ రాని జీతంతో చెల్లు. ఇంతవరకు అది యజమానులికి మిగులు. ఈ రెండుమాసాలూ సమ్మెవల్ల ఉత్పత్తిచేసి అమ్ముకోవలసిన నూలుకీ వస్త్రానికి నష్టం 28 కోట్ల రూపాయలు అయితే 28½ కోట్లగజాల వస్త్రం, 2½ కోట్ల పౌనుల నూలు ఉత్పత్తి కాకపోవడంవల్ల దేశంలో ఈరెండింటికీ వచ్చే కొరతవల్ల పెట్టిన పెట్టుబడిపైన బ్లాక్‌మార్కెట్ లాభాలు ఎంతవస్తాయో ఊహించడం కష్టం. పత్తి కరువు రోజుల్లో మిల్లు యజమానులికి ఇది ఒకవిధంగా మంచిదే (లాభసాటిబేరం)

కాబట్టి ఈసమ్మెవల్ల అపకారం ఎవరికైనా జరిగిందీ అంటే అది కార్మికులికీ, సోషలిస్టుపార్టీకీ కొనబడిదారులికీ మాత్రమే. కోర్టు తీర్పువల్ల సమ్మెకి అర్థంలేకుండాపోయింది. రెండునెల్లూ సమ్మె చెయ్యకపోయినా ఈపాటిదానంతటదే వచ్చేది. కార్మికుల్లో పార్టీ పరపతిమాత్రం పోయింది. సమ్మె ఇంకా కొనసాగించాలని సమ్మె కమిటీ ఆదేశించినా సగంపైగా కార్మికులు వినలేదు. సమ్మె మాని వాళ్లంతట వాళ్ళే పనిలో చేరారు. సమ్మెచేయించి సోషలిస్టులు సాధించగలిగిందేదీ లేదు కాబట్టి, అంతవరకు అది కమ్యూనిస్టుపార్టీకి బలం.

మండల్ రాజీనామా

పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వ మంత్రి జోగీంద్రనాథ మండల్ అనారోగ్యం నిమిత్తం కలకత్తా వచ్చి మంత్రిపదవికి రాజీనామా పంపారు.

1947 లో ముస్లింలీగ్ నెహ్రూ మంత్రివర్గంలో చేరుతూ తమ తరఫున వీరిని వెంటబెట్టుకువచ్చారు. అప్పటికి బెంగాల్‌లో



జరిగిన మతకల్లోలాల్లోనూ, హత్యాకాండలోనూ, మతపరివర్తన కాండలోనూ బాధపడినవారు వీరి తాలూకు షెడ్యూల్డ్ క్లాసులవారే అధికం. వీరు లీగ్ తరఫున మంత్రిగా చేరడంతో హరిజనుల్లో వీరికిగల కాస్త పరపతీ తుడిచిపెట్టుకుపోయింది. తరవాత దేశ విభజన జరిగి పాకిస్తాన్ స్థాపించబడిన తరవాత కరాచీలో మంత్రిగా వెళ్లారు. పాకిస్తాన్ మంత్రివర్గంలో ముస్లిం కానివారు వీరొక్కరే. సింధు, పంజాబ్ సరిహద్దురాష్ట్రాల్లో హరిజనుల్ని వేలాదిగా మతం మార్పిస్తున్నా వీరికి చీమ కుట్టినట్టయినా లేదు. ఉన్నట్టుండి అకస్మాత్తుగా నేటికి వారికి పరిస్థితి దుర్భరంగా కనిపించింది.

ప్రపంచంలో అనేక దేశాల్లో క్రమక్రమంగా దేశాభిమానం, ప్రభుత్వాల అధికార నిరంకుశతత్వం ఎక్కువౌతున్నట్టే పాకిస్తాన్‌లోకూడా మతతత్వం తీవ్రతరమౌతోంది. దీనికి మూలహేతువు లేవైనప్పటికీ, కాశ్మీర్ సమస్య, వ్యాపార ప్రతిష్టంభన తక్షణహేతువులైనాయి.

పాకిస్తాన్‌లో ఈ క్షణానికి మతకలహాలుగాని అరాచకంగాని లేనిమాట నిజమే కాని భారతదేశంపట్లనూ, పాకిస్తాన్ హిందువులపట్లనూ పాకిస్తాన్ నాయకుల అనుమాన ద్వేషాలు పెచ్చు పెరుగుతున్నాయి. హిందువులకు భీతి ఎక్కువౌతున్నది. రాకపోకలు ఎక్కువౌతున్నాయి. భారతదేశంపైన యుద్ధానికి కాలుదువ్వుతున్న పాకిస్తాన్‌కి మండల్ రాజీనామా పిడుగువలె పడింది. పాకిస్తాన్‌లో హిందువులు నిలవడానికి ఆస్కారం లేదని అదినుంచీ పాకిస్తాన్ మంత్రివర్గంలో ఉండిన మండల్ అన్నాడు. పాకిస్తాన్‌లో హిందువులకు మతం మార్చుకోకపోతే భారతదేశానికి పారిపోక గత్యంతరం లేదన్నాడు. ఢిల్లీ ఒప్పందాన్ని పాకిస్తాన్ మనఃపూర్వకంగా అమలు జరపడం లేదన్నాడు.

ఈమాట చెప్పడానికి మండల్ కలకత్తా పారిపోయి వచ్చారు. రాజీనామానిచ్చి పాకిస్తాన్‌లో నేవుండి హిందువుల్ని కాపాడ్డానికి కృషి చెయ్యలేదు. వాళ్లని వాళ్ల కర్మానికి విడిచిపెట్టేసి తన ప్రాణం దక్కించుకుని వచ్చారు.

భారతదేశంనించి తిరిగి స్వగ్రామాలకు వెళ్లే హిందువులందరూ, ఇక్కడ భుక్తి కూడాదొరక్క వెళ్ళిపోయినవారే కాని అక్కడ పరిస్థితులు బాగుపడి వెళ్ళినవారు కారు. అందువల్ల ఎప్పుడో ఒకప్పుడు మళ్లీ త్వరలోనే తూర్పుబెంగాల్ హిందువులకు ముప్పు కనిపెట్టుకునివుందని తెలుసును. అదెప్పుడా అని వారంతా నిరీక్షిస్తున్నారు.

[సీతారామ్]


18-10-50

నేటి ప్రపంచం

అపూర్వ సమావేశం

పచ్చని ఆకైనా కనిపించని ఒక ఎటాలిద్వీపంలో ఈ వారం ఒక అపూర్వ సమావేశం జరిగింది. స్టాలిన్‌తో మాట్లాడాలంటే ప్రపంచ శాంతి సాధనకోసమైనా సరే అమెరికాలోనే సమావేశం జరగాలి కాని అమెరికా విడిచి ఎక్కడికీ వెళ్లరాదని దీక్ష వహించిన ప్రెసిడెంట్ ట్రూమన్ తన క్రింది సైనికాధిపతుల్లో ఒకడైన జనరల్ మెకార్థర్‌తో సంప్రదింపులకోసం 7500 మైళ్లు ప్రయాణంచేసి ప్రశాంత మహాసాగరంలో వేక్ దీవులకు వెళ్ళారు

ఫిలిప్పైన్స్ యుద్ధాలు జరిగినదిమొదలు ఆసియా వాసులకు అమెరికన్ ప్రజా



ట్రూమన్

స్వామ్యతత్వాన్ని బలవంతంగా నైనా సరే మప్పాలని దీక్షపట్టిన జనరల్ మెకార్థర్‌ను వాషింగ్టన్ రావాలని అమెరికన్ కాంగ్రెస్ ఎన్నిమార్లు ఆజ్ఞ ఇచ్చినా అతడు లక్ష్యపెట్టలేదు. చిన్నతనంనుంచీ ఫిలిప్పైన్స్, జపాన్, చీనాల సైనిక వ్యవహారాలతో తన జీవితాన్ని, ఆశయాల్ని ముడిపెట్టుకుని కూర్చున్న మెకార్థర్‌కు ఆసియాలో తాను నిర్వర్తించవలసిన దైవ కార్యం ఒకటున్నదనే భావం నాటుకుపోయింది. అందువల్లనే రెండో ప్రపంచయుద్ధంలోనూ, ఆ తరువాతనూ పసిఫిక్ ప్రాంతదేశాలపై అమెరికన్ సైనిక ప్రాబల్యం ఏర్పడగానే, ఏ సైనికాధిపతికీ లభించని అవకాశం మెకార్థర్‌కు లభించింది. ఈ ప్రాబల్యాన్ని ఆధారం చేసుకొని తన కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి పూనుకున్నాడు.

జపాన్‌లో రాజకీయాలను నిర్వహించడంలో మెకార్థర్ మిత్రరాజ్యాల ప్రాచ్య వ్యవహారాల కంట్రోల్ కమిషన్ కూడా ఒకటున్నదనే మాట మరిచి ప్రవర్తించాడు. ఆ కమిషన్ నామకః మిగిలింది. ప్రాచ్య ఆసియా వ్యవహారాలలో అమెరికాకంటె ఎక్కువ శ్రద్ధవహించవలసిన బ్రిటన్‌ను మెకార్థర్ తిరస్కరించాడు. ఆసియా జాతీయోద్యమాలు అమెరికన్ ప్రజాస్వామ్య తత్వానికి అనువైనవి కావని అతని అభిప్రాయం.

తూర్పు ఆసియా వ్యవహారాలలో ఎన్నడూ సక్రమమైన ఒక విధానాన్ని అవలంబించలేక క్షణక్షణానికీ తప్పులు దిద్దుకుంటూ కూర్చున్న అమెరికన్ ప్రభుత్వ విదేశాంగ శాఖ పట్ల అమెరికన్ ప్రజానీకానికి విశ్వాసం నశించింది. అమెరికన్ వ్యాపారులు తమ ఆశల్ని మెకార్థర్ పైనే నిలిపి అతన్ని బలపరుస్తూ వచ్చారు. అమెరికాలో మెకార్థర్, ఐసెన్‌హోవర్, మార్షల్ ఈ ముగ్గురు సైనిక నాయకులకూ గల పరపతి ఈ నాడు మరే నాయకునికీ లేదు. మెకార్థర్ పట్ల అమెరికన్ ప్రజలకు గల అభిమాన విశ్వాసాల వల్లనే అమెరికన్ కాంగ్రెస్ ఆజ్ఞలను అతడు ధిక్కరించినా, జపాన్ వ్యవహారాలలో అన్యదేశాల ప్రతినిధులను అతడు అవమానపరిచినా, అమెరికన్ రాజకీయ నాయకులు అతని అహంకార పూరిత అధికారిక ప్రవర్తననెంత అసహ్యించుకున్నా జపాన్ నుంచి కదల్పలేక పోయినారు.

తూర్పు ఆసియా రాజకీయాలలో ఈ రెండేళ్ళలో కలిగిన మార్పుల దృష్ట్యా అమెరికా తన విధానాన్ని మార్చుకోవలసి నప్పుడు అమెరికన్ మంత్రులు సర్వసైన్యాధిపతులూ అతనివద్దకే వెళ్ళి సంప్రదించవలసి వచ్చింది. కాని స్వయంగా రాజకీయవిధానాల్ని నిర్ణయించలేక పోయినారు. ఎప్పటి ప్పగు వారే, టోకియో వెళ్ళి అతనితో సంప్రదించేవారు. ఈ సంప్రదింపుల్లో ఇంతవరకూ అమెరికన్ మంత్రులు మెకార్థర్ సలహాలను తీసుకోవడమే కాని, అతనికి సలహాలిచ్చి అతనిచేత అంగీకరింప జేసినది లేదు.

ప్రెసిడెంట్ ట్రూమన్, విదేశాంగ మంత్రి ఎచిసన్ మినహా అమెరికన్ మంత్రులందరూ టోకియో వెళ్ళి మెకార్థర్ సలహాలు పుచ్చుకున్నవారే. విదేశాంగమంత్రి వెళ్లవలసిన అవసరం కలిగినప్పుడు సహాయ మంత్రి డల్లెస్‌ను పంపాడు.

కొరియా సమస్య నానాటికీ తీవ్రతరమై ప్రపంచరాజకీయాలు క్లిష్టస్థితిలో పడిపోతున్నందువల్ల, చీనాతో వైరం యుద్ధం వరకూ పరిణమించగల ప్రమాదం ఉన్నందువల్ల ట్రూమన్‌కు మెకార్థర్‌తో సంప్రదించడం అవసరమయింది. కాని మెకార్థర్ అమెరికా రాగు ప్రెసిడెంట్ ఆజ్ఞా




మెకార్థర్

పించినా పాటించగలడని నమ్మకం లేదు. పసిఫిక్ మహాసాగరంలో అమెరికన్ సైనిక వ్యూహాన్ని గురించి, ఫార్మోజా గురించి మెకార్థర్ అమెరికాలో ఒక సంఘానికి పంపిన సందేశాన్ని ట్రూమన్ ఆజ్ఞపైన ఉపసంహ

(40-వ పేజీ చూడండి)

డిటెక్టివ్ సీరియల్:



3

ఇదమిద్ధమని తెలియరాని ఏదో అమానుష మైన వృత్తాంతాన్ని చాటుతున్న కత్తిని ఇంక ఆట్టే చూడలేక ఎత్తిన తలగడ వదిలేశాడు మాధవరావు. భయంతో గజగజలాడి పోతోంది కమల. ఏదో చెప్పాలని ప్రయత్నం చేస్తున్నది. కాని మాట పెగిలిరాలేదు. "అత్త.." అని మాత్రం రెండుమార్లు అస్పష్టంగా పలికింది. మాధవరావు ఒక్క క్షణం ఆలోచించాడు. "ఇష్" అంటూ చూపుడు వేలితో పెదవులునొక్కుకున్నాడు. కమల మౌనంగాఉండిపోయినా చలించిపోయింది. అప్రయత్నంగా ఇద్దరూ హాల్లోకి వచ్చారు హాల్లో వంటవాడు ఏమీ అర్థంకాకపోయినా ఏదో ఘోరం జరిగి పోయిందని ఇద్దరి ముఖాలూ చూసి కనిపెట్టాడు. నిశ్చేష్టుడై నిలబడి చూస్తున్నాడు.

ఇద్దరూకలిసి వరండాలో కొచ్చి నిలబడ్డారు. కమల ప్రయత్నించి పలికింది. "కత్తితీసి దాచేద్దామా?"

"వొద్దు వొద్దు. అక్కడే ఉండనీ నేవెప్తా. నువ్విక్కడే ఉండు." అన్నాడు. మాధవరావు మెల్లిగా అడుగులేసుకుంటూ తూర్పుగదివైపుకు నడిచాడు. ఒక్కక్షణం అక్కడ నిలిచి ఆలోచించాడు. అక్కడ మడతమంచంమీద పడుకున్నవ్యక్తి ముసుగుతన్ని నిద్రపోతున్నాడు. ఎండ పడుతున్నందువల్ల కాబోలు కొంచెం కదుల్తున్నాడు. మాధవరావు వెనక్కి వచ్చి హాలులో ప్రవేశించాడు. హాలులో నుంచి ద్వారం ఉన్న గది వంక చూశాడు. కమల అతని వెంట హాల్లోకి వచ్చింది. వినపడీ వినపడనట్టు కమలని అడిగాడు "మీ అత్త ఏగదిలో పడుకుంది?"

కమల సమాధాన మివ్వలేదు. తత్తర పడుతూ రెండడుగులు ముందుకువేసి, ఆగది తలుపు నెట్టడానికి చెయ్యి వెయ్య బోయింది. చటుక్కున ఆగింది. వెను తిరిగింది. అక్కడ అన్నట్లు వరండా గది వైపు చేత్తో చూపింది.

"మీఅత్త గది ఇది కాదా?"

"ఇదే. కాని రాత్రి ముందుగదిలో పడుకుంది."

మాధవరావు వరండా ముందు గదివద్ద కెళ్లాడు. సంకోచిస్తూ తలుపు నెట్టాడు. రాలేదు. లోగడియ వేసివుంది. మళ్లీ ఈమారు గట్టిగా నెట్టాడు. చప్పుడయింది. "ఎవరు వారు?" అని లోపలనుంచి ప్రశ్న వచ్చింది. ఒక పురుషుని కంఠం. మాధవరావు నిశ్చేష్టుడైనాడు. జవాబివ్వలేదు.

"ఎవరు?" అని మళ్లీ ప్రశ్న వచ్చింది. మాధవరావు జవాబివ్వలేదు గది తలుపు తెరుచుకుంది. నలభైయేళ్ళ పురుషుడు ఇవతల కొచ్చాడు.

మాధవరావును చూసి "మీరేనా పిలిచారు?" అని అడిగాడు. మాధవరావు సమాధాన మివ్వలేదు. గదిలోకి తొంగి చూశాడు. నేలపైన పరిచిన పక్కవద్ద ఒకామె నిలబడివుంది. మాధవరావు తొంగి చూడగానే పక్కకి ఒత్తిగిలి నిలబడింది. ఇవతల కొచ్చిన పెద్దమనిషి ఈ మారు కొంచెం కోపంతో అడిగాడు "మీకెవరు కావాలండీ? అక్కడెవరున్నారు? మా పార్వతమ్మఉంది. అయినా ఇదేం పెద్దమనిషి తరహా? నేనొచ్చి అడుగుతోంటే మాట్లాడక తొంగి చూస్తారేమిటి?"

"అబ్బే ఏమీ లేదు. మీ కోసమే. మీరేనా దుర్గయ్యగారి బావమరిది?"

"అవును. మీరెవరు?"

"చెప్తాలెండి. మీరు త్వరగా అన్నీ ముగించుకుని వస్తే వ్యవహారం మాట్లాడదాం."

"బాలే. తమాషాగా వుందే?"

ఈ మాటలు అంటుండగానే వినిపించుకోకుండా మాధవరావు కంగారుగా హాల్లోకి వెళ్లాడు. పార్వతమ్మ అన్నగారు రామనాథం గొణుక్కుంటూ హాలువద్దకి వచ్చి మాధవరావుని చూశాడు. మాధవరావు లోపలి గది ద్వారం వంక చూస్తున్నాడు. రామనాథం అనుమానిస్తూ హాలు గడపవద్ద నిలబడి కనిపెడుతున్నాడు. కమలకూడా గది ద్వారం వంకచూస్తోంది.

మాధవరావు అడిగాడు "ఈగదిలో ఎవరేనా పడుకున్నారా?"

"చిన్నమామయ్య" అని తేలిపోతున్న మాటల్తో చెప్పింది కమల.

మాధవరావు మెల్లిగా తలుపు నెట్టాడు. నెట్టగానే తలుపు తెరుచుకుంది. మాధవరావు గడపదాటి ఒక్కడుగు ముందుకు వేశాడు. గిరుక్కున వెనక్కి తిరిగి హాల్లోకి దూకాడు కమలజబ్బ పట్టుకుని దూరంగా తోసి కుర్చీలో కూర్చో పెట్టాడు. గుడ్లు పెద్దవిచేసి రామనాథంవంక చూశాడు. రామనాథానికేమీ అర్థం కాలేదు. మాధవరావు దగ్గరకొచ్చాడు. ఇద్దరూ కలిసి గది గుమ్మందగ్గర నిలబడి చూశారు. గది లోపల మంచంమీద ఎవరో దుప్పటికప్పుకుని పడుకున్నారు దుప్పటిపైన ఒకచోట జానెడు మేర నెత్తురు కనపడింది.

రామనాథం "ఆ...ఆ..." అని మాత్రం అన్నాడు.

మాధవరావడిగాడు "ఎవరు...?"

(34-వ పేజీ చూడండి)



చరమదశలో సుష్టికివచ్చే మనుర స్మృతుల్లా ఆకాశంలో నక్షత్రాలు మిణుకుమిణుకు మంటున్నాయి జోరుగా వీస్తున్న చలిగాలిబాధనుండి తప్పించుకోవడానికై తన చిరిగిన చొక్కాను సర్దుకొంటూ బాటవెంట నడుస్తున్నాడొక శతవృద్ధు బాటకిరుప్రక్కల నున్న మేడల లోనుండి మాటలు, పాటలు వినబడుతున్నాయి అవే అతనికి ఓదుపీడగా నడుస్తున్నాయి ఈ మేడలలో, మిద్దెలలో నున్న వారంతా శాలువలు, రగ్గులు కప్పుకొని కుంపట్లవద్ద కూర్చున్నారు చలిబాధ తప్పించుకోవడానికి కాని ముసలివాడు మాత్రం తన లక్ష్యసాధనకై బాటవెంట కర్రపోటిమీద నడుస్తున్నాడు తెల్లవారింది పార్కు వద్దకు చేరుకున్నాడు మంచు కురుస్తున్నది చలిగాలి జోరుగానే వీస్తున్నది పార్కుకి ఎదురుగా ఒక మేడ వున్నది దాని మూసిన కిటికీలనుండి గ్రుడ్డివెలుతురు బయటకు వస్తున్నది

మేడముందున్న మెట్లు ఎక్కి మూసి వున్న వాకిలివద్దకు చేరి హిమాలయ పర్వతాగ్రాన్ని అధిరోహించినవారు పొందే ఆనందాన్ని పొందాడు ముసలి వాడు మేడ పైభాగంలో రోడ్డువైపుకి

శ్రీ రవి

పోస్టాఫీసు" అనే బోర్డు తగిలించబడి వున్నది వృద్ధుడు తన మామూలుప్రకారం వాకిలిలో తిష్టవేశాడు తనకున్న విశ్వాసం, ఆవేదనలతో చలిని లక్ష్యపెట్టకుండా కూర్చున్నాడు

పోష్టుమాష్టరు ఉత్తరాలను త్వరత్వరగా చదివి జవానుచేతి కిస్తున్నాడు. కమీషనర్ సూపరింటెంటు... రామయ్యా...భీమయ్య దివాన్ సాహెబ్ లైబ్రేరియన్ అంటూ అనుభవమున్నవానిలా త్వరత్వరగా చదివి జవానుచేతి కిస్తున్నాడు మధ్యలో ఎవరో హాస్యానికి లోపలనుండి "కోచివాన్ అలీ" అని చదివారు.

ముసలివాడు లేచి నిలబడ్డాడు ఆతురతతో లోపలకు వెళ్ళి చేయి జాచాడు.

"ఎవరు నీవు?"

"బాబూ! నేనేనండి కోచివాన్ అలీని. తమ రిప్పుడు పిలిచారు కదూ? ఉత్తరం తీసుకోవ ".

"వీడు వట్టి పిచ్చివాడండి రోజూ ఉత్తరం ఉత్తర మంటూ దుంప తెంచుతున్నాడు ఒక్కనాడూ ఒక్క ఉత్తర మొచ్చిన ట్లుండదు" అని జవాను పోష్టుమాష్టరుకు ఫిర్యాదు చేశాడు

నిరాశతో వృద్ధుడు వెనుకకు మరలాడు

ఇలా అయిదు సంవత్సరాలనుండి జరుగుతున్నది.

ఆలీ యౌవనములో వేటంటే మహా సరదాపడేవాడు. ఆకాశాన ఎగిరే పక్షిని గూడా గురిచూచి కొట్టేవాడు. చెట్లమాటున దాగిన కుందేలును గూడా యిట్టే పసికట్టేవాడు. రానురాను అది వ్యసనం క్రింద మారింది.

కొంత వయసు ముదిరినతరువాత తన వెనుకటి దురాచారముల నన్నింటిని విడిచిపుచ్చి సంయమివృత్తి నవలంబించాడు. భార్య గతించింది. ఉన్న ఒక్క కుమార్తెకు పెండ్లి చేశాడు. ఆమెభర్త సైనికోద్యోగి. ఆమెను వెంటబెట్టుకుని పంజాబు వెళ్లాడు. ఇప్పటికి అయిదు సంవత్సరాలు కావచ్చింది. జాబూ, జవాబూ లేదు. అతడు తన జీవితంలో ఎన్నో జీవులకు ఎడబాటు కల్పించాడు. ఎడబాటులో నున్న బాధ యిప్పు డర్థమౌతున్న దతనికి. ఎప్పుడే పక్షి అయినా నోటితో మేత తెచ్చి తన పిల్ల నోటిలో పెడుతుంటే చూచి ఆనందపారవశ్యంలో మునిగిపోతాడు ఆలి.

అతని ప్రతిరక్తకణంలో గూడా వేట అనే నిషా జీర్ణించిపోయినప్పటికీ తన కుమార్తె అత్తవారింటికి పోయినప్పటినుండి అతనికి వేటంటే రోత జనించింది. వియోగదుఃఖ మనివార్యమని తెలిసికొన్నాడు. ప్రేమతో ప్రపంచాన్ని జయింపవచ్చునని అర్థమైం దతని కిప్పుడు. తన కుమార్తె మరియమ్మ గుర్తికి వచ్చినప్పుడల్లా అతని కనులవెంట నీరు తిరుగుతుంది. తన కుమార్తె అత్తవారింటికి వెళ్లినది మొదలు ప్రతిరోజూ వేకువజామునే లేచి ఉత్తర మేమైనా వచ్చినదేమో నని పోస్టాఫీసుకు వెళ్లి రిక్తహస్తాలతో తిరిగిరావడం మామూలు. ఇదొక నిత్యకృత్యమైయిందతనికి అతని జీవితములో అతని కెన్నడూ ఉత్తరమంటూ రాలేదు. అయినా అతడు నిరాశ చెందలేదు. కొండంత ఆశతో, విశ్వాసంతో ప్రతిరోజూ పోస్టాఫీసుకు వెడుతూనే యున్నాడు. పోస్టాఫీసుకు అందరికంటె ముందు హాజరయ్యేది అతడే. అది అతని కొక యాత్రాస్థలమైనది.

లోకం అతనిని చూచి నవ్వేది. పిచ్చివాడని హేళన చేసేది. చులకనగా చూసేది. పోస్టాఫీసులోనున్న గుమాస్తాలకు, జవాన్లకు సైతం అతనొక ఆటవస్తువై పోయాడు. అతని పేరిట ఉత్తరం లేకపోయినా ఎగతాళికి "కోచిమాక్ ఆలి" అంటూ చదివి అతనిని ఉలికించడం మామూలైపోయింది "బాబూ! అంటూ అతను పోస్టుమాస్టరువద్దకు వెళ్లడం ఉత్తచేతులతో తిరిగివెళ్లడం మామూలైపోయింది.

ఆఫీసర్ల జవాన్లంతా ఉత్తరాలు తీసికొనివెళ్ళడానికి రాకముందే ఆలీ వచ్చి వాకిట్లో కూర్చుని వారి సంభాషణంతా వింటూవుండేవాడు. ఇవ్వాళ మా దొరగారు నన్ను నిష్కారణంగా చెప్పుదీసుకు కొట్టాడనో, మా ఆఫీసరు మంచివాడే గాని పెండ్లాము తగండనో వారు చెప్పుకొనే మాటలు విని జాలిపడేవాడు ఆలీ. ఆఫీసు తెరవగానే మాష్టరుగారికి ఎదురయ్యేది ఆలీ ముఖమే. బక్కపలచగా, వీధిబడిపంతులులాగుండే పోస్టుమాష్టరుని చూస్తే గూడా ఆలీకి జాలి వేసేది.

ఒకనాడు ఆఫీసు తెరిచేసరికి మామూలుగా లేచి నిలబడి మాష్టరుగారికి సమస్కరించే ఆలీ నిలబడలే దెందుచేతో.

"పోలీసు కమీషనర్" అని మాష్టరు చదివేసరికి చెప్పుదెబ్బ తిన్నానని చెప్పినతడు వచ్చి ఉత్తరాలు తీసుకొని వెళ్లాడు.

"సూపరింటెండెంటు." అనగానే వారి జవాను వచ్చి ఉత్తరాలు తీసికొన్నాడు. రామయ్య... భీమయ్య వెంకయ్య... ఇలా విష్ణుసహస్రనామాల్లా చదువుకొంటూ పోతున్నాడు మాష్టరు. ఎవరి ఉత్తరాలు వా రందుకొంటున్నారు.

అంతా వెళ్లిపోయారు. ఆలీ లేచి పోస్టాఫీసు కొక దణ్ణంపెట్టి యింటికి మరలాడు. ఈనా డెందుచేతో ఎగతాళికి గూడా అతనిపేరు పిలువలేదు.

"వాడు పిచ్చివాడా?" అని మాష్టరడిగాడు.

"ఎవరండి.? వాడా? వాడు వట్టి పిచ్చివాడండి ఎప్పుడూ ఉత్తరము వచ్చినట్లుండదు. రోజూ ఉత్తరం ఉత్తరమంటూ వేధించుకుతింటున్నాడు." అని గుమాస్తా జవాబు చెప్పాడు.

"వీడికి ఉత్తరాలు వ్రాయడాని కెవరు తీరిగ్గా కూర్చున్నారు.?" అని మాష్టరు వ్యంగ్యంగా అన్నాడు.

"వీ డేదో మహాపాపం చేసివుంటాడండి. దాని ఫలిత మిప్పు డనుభవిస్తున్నాడు"

"పిచ్చివాళ్లు తమాషాగా వుంటారోయ్" అన్నాడు మాష్టరు.

"నిజమేనండి. నే నొక పర్యాయం అలహాబాదులో ఒక పిచ్చివాడిని చూశాను. రోడ్డుమీద నున్న చెత్తా చెదారమంతా పోగుచేస్తుంటాడు." అని వంతపలికాడు జవాను.

"నే నొక పిచ్చివాడిని చూచానండి. వాడు రోజంతా వెనక్కూ, ముందుకూ నడుస్తుంటాడు?" అని అందుకున్నాడు మరొక జవాను

"నిజమేనండి. నే నొక పిచ్చివాడిని చూచాను. అతడు రోడ్డుమీద పారేసిన కాగితంముక్క లన్నింటినీ ఏరి ప్రోగుచేసి త్వరత్వరగా యిలా చదివి అలా పారేస్తుంటాడు!" అన్నా డొక గుమాస్తా.

ఈ మాటకు మాష్టరు ఉలిక్కిపడ్డాడు. ఆఫీసంతా పిచ్చివాళ్ల ననుకరించిన వర్తనలతో నిండిపోయింది అంతా నేను పిచ్చివాడిని చూచానంటే నేను పిచ్చివాడిని చూచాననేవాళ్లే. తనకు తా నొక పిచ్చివాడి నని ఎవరూ తలంచడము లేదు. ఆఖరుకి జవానుచేత చెప్పుదెబ్బ తిన్నానన్న జవానుగూడా నే నొక పిచ్చివాడిని చూచానన్నాడు.

చాలా రోజులనుండి ఆలీ పోస్టాఫీసుకు రావడంలేదు. కారణ మేమిటో తెలిసికోవలెననే ఉత్సాహం అందరిలో రేకెత్తింది. ఒక నెలరోజులతర్వాత ఆలీ తిరిగి ఒకనాడు పోస్టాఫీసుకు వచ్చాడు. అతడు చాలా బలహీనంగా నున్నాడు. మృత్యుదేవత అతని ముఖంమీద తాండవిస్తోంది. కన్నులు లోపలకు పెక్కుపోయాయి.

బలవంతంగా శరీరాన్ని పోస్టుమాష్టరు వద్దకు యీడ్చుకొనిపోయి "బాబూ! మరియమ్మ వద్దనుండి ఉత్తర మేమైనా వచ్చిందా?" అని అడిగాడు.

పోస్టుమాష్టరు జవా బివ్వలేదు.

"అయ్యా! నాపేరు కోచిమాక్ ఆలీ అండి?" అని తిరిగి ప్రశ్నించాడు.

"తెలుసునోయ్! ఆలీ లేదు చూలీ లేదు" అని గుంజుకున్నాడు మాష్టరు.

"క్షమించండి" అంటూ వెనక్కు తిరిగాడు. అతని కన్నులలో నీరు తిరిగింది. నలభై, యాభై సంవత్సరాలు వేటలో గడి

పిన ఆలీ తనకు తన మరియమ్మమీద వుండే ప్రేమ లోకంలో అందరికీ వుండదని ఆనాడు గ్రహించాడు.

పో"నీ వెక్కడో శనిగ్రహంలా గున్నావు. ఆవలకు నీ వుత్తరం మే మేమైనా మ్రింగామనుకొన్నావా?" అని కసరుకొన్నాడు మాష్టరు.

ఆలి మెల్లగా బయటకు వచ్చాడు. అతని హృదయం బాధతో మూలగసాగింది. అయినా అతను పట్టుదలను, విశ్వాసాన్ని, కోల్పోలేదు. అడుగుల చప్పుడై వెనుదిరిగి చూచాడు. జవా నొకడు అతని వెను వెంటనే వస్తున్నాడు.

"మాడు భాయీ!"

జవానుకు ఆశ్చర్యమేసింది. "ఏమిటి?" అన్నాడు

ఆలీ తన బొడ్డునున్న అయిదురూపాయలు తీసి అతని చేతిలో పెట్టి "నీవు నా కొక పని చేసిపెట్టాలి" అన్నాడు.

"ఏమిటి?"

"అదిగో అలా చూడు అక్కడేమి కనిపిస్తున్నది.?" అని ప్రశ్నించాడు.

"ఆకాశము."

"అవును. 'అదే భగవత్స్వరూపము. అదే సాక్షి. దాని యెదుట నేను నీ కీ అయిదు రూపాయ లిస్తున్నాను. మా మరియమ్మ వద్ద నుండి జాబు వస్తే అది వెంటనే నా కందివ్వు." అన్నాడు.

"అయితే నిన్నెక్కడ కలుసుకోమంటావ్?"

"నా సమాధివద్ద"

"ఏమిటి?"

"అవును నా సమాధివద్ద. సత్యం నే నింక ఎక్కువకాలం జీవించను. నాకు అంతిమఘడియలు సమీపించాయి. నే నీ జీవితంలో నా ముద్దుల మరియమ్మను చూడలేకపోయాను. అదంతా నా దురదృష్టం" అంటూ ఆలి తన కన్నుల నీరు నింపాడు.

జవాను నళ్ళిపోయాడు. అతని జేబులో అయిదు రూపాయలు మ్రోగుతున్నాయి

ఆలీ తిరిగి పోస్టాఫీసు ఛాయల ఎన్నడూ కనిపించలేదు. ఇప్పు డతనినిగురించి విచార మెవ్వరికీ లేదు.

పోష్టుమాష్టరుగారి అమ్మాయికి జబ్బు చేసిందని కబురు వచ్చింది. ఆమెను పొరుగూ రిచ్చారు. ఆమె కెలాగున్నదో తెలిసికోవలె ననే ఆదుర్దాతో నున్నాడు మాష్టరు టపా వచ్చింది. ఆదుర్దాతో ఉత్తరాలన్నీ గబగబా చదువుతున్నాడు. అతని దృష్టి ఒక కవరుమీద పడింది. దాని మీద "కోచిమాన్ ఆలీ" అనే అడ్రసున్నది. మాష్టరుకి ఆశ్చర్యమేసింది. ఆఉత్తర మతనిచేతికి ఎలెక్ట్రిక్ షాక్‌లా తగిలింది. నిశ్చేష్టు డైనాడు. ఈ ఉత్తరము కొరకే ఆ ముసలివా డింతకాలాన్నుండి ఎదురుచూస్తున్నదని గ్రహించాడు. ఇది తప్పకుండా అతని కుమార్తెవద్దనుండి వచ్చివుంటుంది.

"లక్ష్మీదాస్?" అని మాష్టరు పిలిచాడు.

"సార్!" (ఇతనే అలీవద్ద అయిదు రూపాయలు పుచ్చుకొన్నది.)——

"ఇదిగో యిది కోచిమాన్ ఆలీఉత్తరం. అత నెక్కడున్నా డిప్పుడు?"

"[illegible]ను. వెదుకుతాను."

ఆ[illegible] పోష్టుమాష్టరు పేర ఉత్తరమేమీ రాలేదు. కుమార్తెను గురించి చాలా ఆదుర్దాగా నున్నాడు. మనస్సంతా చికాకుగా నున్నది. అన్నము సహించలేదు. ఒక్కనాడు తన కుమార్తెవద్దనుండి ఉత్తరము రాకపోయినందున వచ్చిన పరిణామ మిది. మరి పాప మా ముసలివాడో? అయిదు సంవత్సరాలనుండి ఉత్తరముకొరకే యెదురు చూస్తున్నాడు. అత నెప్పుడూ నిరాశ చెందలేదు. ముసలివాని మాట గుర్తుకి రాగానే అతని కన్నులు చెమ్మగిల్లాయి. ఇంతలో గడియారం అయిదుగంటలు కొట్టింది. ఎవరో తలుపు తట్టిన శబ్దమైంది. తప్పకుండా ఆ ముసలివాడే అయివుంటాడని మాష్టరు త్వరగా లేచి తలుపు తెరచాడు. దుఃఖాతిరేకముతో పొంగిపొరలుతున్న పితృహృదయం యితరుల దుఃఖాన్ని వెంటనే గ్రహించగలిగింది.

"ఆలీ లోపలకు రా! నీకు ఉత్తరము వచ్చింది." అన్నాడు.

ఆలీ వంగి కర్రపోటేమీద నిలబడి ఉన్నాడు. అతని కనులవెంట నీరు కారుతోంది. ఆనాడు పోష్టుమాష్టరు కోపపడినప్పుడు కార్చిన కన్నీరులాగున్న దా కన్నీరు. అతనిలో కారిన్య మున్నది. కాని సౌజన్యం దానిని అదిమిపట్టుకొన్నది. అతను మెల్లగా తల పైకెత్తాడు.

అతని కన్నులు చూచేసరికి పోష్టుమాష్టరుకు భయంవేసి కెవ్వన కేక వేశాడు.

ఆ కేకకు ప్రక్కగదిలో నున్న లక్ష్మీదాస్ "సార్!" అంటూ లోపలకు వచ్చాడు

పోష్టుమాష్ట రా మాట వినిపించుకోకుండా ఆలీ మాయమైనచోటు తదేక దృష్టితో చూస్తున్నాడు. కొంతసేపటికి తెప్పరిల్లి "ఆలీ ఏడి?" అని ప్రశ్నించాడు.

"అతను చనిపోయాడు. ఆ ఉత్తరం నాచేతి కివ్వండి" అన్నాడు లక్ష్మీదాస్,

"నిజంగానా?"

"నిజమేనండి. అతను చచ్చిపోయి యిప్పటికి మూడుమాసము లైంది." అంటూ అప్పుడే లోపలనుండి వస్తున్న మరో గుమస్తా బలపరిచాడు.

మాష్టరు గారికి విచారమేసింది. మరియమ్మఉత్తర మింకా డ్రాయరుమీదే వున్నది ఆలీ ఆఖరుపర్యాయంగా లక్ష్మీదాసును కలుసుకొన్న సంగతి మాష్టరు మాటలసందర్భమున తెలిసికొన్నాడు. అతని కింకా ఆలీహీనస్వరం చెవులలో ప్రతిధ్వనిస్తూనే యున్నది. అతనికి గాబరా పుట్టింది. నే నిందాక చూచింది ఎవరు? ఆలీలాగానే యున్నాడే? నా ఊహే నన్ను దగాచేసి వుంటుందని నిశ్చయించుకొన్నాడు.

ఉత్తరాలు రోజూ వస్తూనే ఉన్నవి. రామయ్యా- భీమయ్యా- అని చదువుతూనే యున్నారు. కాని యిప్పు డెవరూగూడా కోచిమాన్ఆలీ అంటూ ఎగతాళికి చదవటం లేదు. ఉత్తరముయొక్క నిజమైన విలువ యిప్పు డర్థమైంది మాష్టరుకు. ఆ సాయంకాలం లక్ష్మీదాస్, పోష్టుమాష్టరూ, యిరువురూ కలిసి ఆ ఉత్తరాన్ని తీసికొని వెళ్ళి ఆలీసమాధిమీద వుంచి వచ్చారు.

"మాడు లక్ష్మీదాస్ ఇవ్వాళ అందరికంటె ముందు నీ వాఫీసుకు వచ్చావా?"

"అవును సార్." అందరికంటె ముందే వచ్చాను.

"అయితే..."

"సెలవివ్వండి."

"ఆఁ ఆఁ ఏమీ లేదు. మాష్టరు గుటకలు మ్రింగాడు.

ఇరువురూ యింటికి వచ్చారు. కాని ఆ రాత్రి మాష్టరుకు నిద్రపట్టలేదు. కన్ను మూసేసరికి ఆలీ నా ఉత్తర మంటూ ప్రత్యక్షమౌతున్నాడు.

[హిందీ మాతృక]

కథానిక:

ఉభయభ్రష్టత్వం

శ్రీ గోవిందరాజు రామకృష్ణరావు

గురునాథం వయస్సుమళ్ళిన బ్రాహ్మణుడు. ఆస్తికొంచెం మో-గొప్పో ఉన్నది. కాని సంతానమాత్రం శూన్యం. తనకయితే ఏలూరిపిల్లవాడ్ని పెంచుకోవాలని ఉంది. కాని భార్య రంగమ్మ, ఊఁ, అన్నా. రంగమ్మకు పూర్తిగా మేనకోడలు శాంతను దగ్గర పెట్టుకోవాలని సంకల్పం. అందుచేత గురునాథంగారి తలపు ఊగులాట



ల్లోకి వచ్చింది. మగపిల్లవాడయితే కొంత తులసీదళం నోట్లో వేస్తాడనీ, కుటుంబం నిలుపుతాడనీ గురునాథంగారి ఆశ. కాని ఆయన రంగమ్మని ఎదిరించి యే పనీ చేయలేదు. లేకపోతే దత్తత మునుపే జరిగిపోయేది. ఎట్లాగయినా ఆమెను ఒప్పించాలని ఆలోచిస్తున్నాడు. శాంతను కూడా చేర్చే పద్ధతుంటే తప్పక అంగీకరిస్తుంది అనుకున్నాడు భోజనసమయంలో-

గురునాథం: ఏమే! చూడు, మీ శాంతకి ఎన్నో యేడు ఇప్పుడు?

రంగమ్మ: అలా అడుగుతున్నారేం? ఎప్పుడూ లేందీ!

గురు: ఆ!-అసలు కనుక్కుందామని.

రంగ: ఆ!-వడ్డీ సంగతి చెప్పండి, చెప్తా.

గురు: మొన్న ఏలూరినుంచి తీసుకొరాలా-అతనికి యీడో, కాదో తెలుసుకుందామని.

రం: ఆ - ఈడే, ఆ ప్రస్తాపనంతా ఎందుకూ?

గురు: చెప్తా. శాంతను ఆ అబ్బాయికిచ్చి చేస్తే బాగుంటుందేమో నని నాకు ఆలోచన. శాంత మనయింటికి రావటం నీకు యిష్టమేగా? ఏమంటావ్?

రం: (ముఖంలో సంతోషం) అలాగే కానివ్వండి.

గురు: ఇది ఖాయమే సంటావా?

రం: ఆ. అయితే ఒక్క విషయం. మిమ్మల్ని ఏదో ఉద్ధరిస్తాడని నా పేర ఉన్న ఆస్తి అంతా ఆయనపేర పెడ్తే మాపని మట్టమవుతుంది. కాబట్టి యీ ఆస్తి పెళ్ళివరకు నాపేరనే ఉండాలి. వివాహకాలమందు ఆస్తిలో సగం పిల్లపేరున, ముందున్న మండువాయిల్లు పిల్లవాడిపేర పెట్టవచ్చు. ఇలాగని చెప్పి వారు ఒప్పుకుంటే పిల్లడ్ని తీసుకురండి. నా అభ్యంతరం లేదు.

గురు: ఇదీ బాగానే ఉంది. మంచిరోజు చూసి సెటిలుచేసుకొస్తా.

* * *

శేషగిరిరావుగారు చాలా పెద్దవాడు. సాధారణకుటుంబీకుడు. భార్య గతించింది. కలెక్టరాఫీసులో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. ఇద్దరు కొడుకుల్లో గోపాలరావు పెద్ద. సత్యం రెండోవాడు. గోపాలరావు అత్తవారిల్లు ఊళ్ళోనే. మామగారు చెప్పిందే మనువాక్యం. శేషగిరిరావుగారికీ గురునాథంగారికీ బాల్యంనుంచి మంచి స్నేహం. ఒకరంటే ఒకరికి గట్టినమ్మకం, ఆప్యాయం. అనుకున్న ప్రకారంగానే గురునాథం ఏలూరు వచ్చి శేషగిరిరావుగార్ని కలుసుకున్నారు. శేషగిరిరావుగారికి

ఉంటే నమ్మకంమూలాన గురునాథంగారు ఆస్తిసంగతి చెప్పినట్లే ఒప్పుకుని, కాగితాల వ్రాతల విషయం కదల్చలేదు. శేషగిరి రావుగారు "అన్నగారూ! సత్యాన్ని మీకు దత్తత యివ్వటం ఖాయం. భారం అంతా మీదే. నాకన్న మీకే ఎక్కువ ప్రేమ, బాధ్యత." అని చెప్పాడు. సరే అనిపించుకుని యింటికి తిరిగి వచ్చాడు గురునాథం.

* * *

దత్తతకోసం తొందరపడుతున్నాడు గురునాథం. పెద్దవాడు, అందులో అస్వస్థత. ఎవ్వరేం చెప్పగలరు, ఏ క్షణంలో ఏమి రానుందో, తలపెట్టిన కార్యం సానుకూలం అయితే దిగులుండదు. వంట్లో అనారోగ్యం మూలంగా వివాహం తర్వాత జరుపుదామని నిశ్చయించారు. దత్తత లగ్నం కూడా త్వరలోనే కుదిరింది. అందరికి లేఖలు పంపారు. బావమరిది పిల్లలు ముందుగానే వచ్చారు పనులు చక్కబెట్టటానికి. దత్తత రెండు దినాలుండనగా శేషగిరిరావుగారు, గోపాలరావు, వాని భార్య, సత్యం, ఇంకొకొందరు బంధువులు వచ్చారు. గురునాథం పని మరీక్షీణంగా ఉంది. దత్తత అని ఏదో మ్రొక్కుబడిలా నెరవేర్చారు. దత్తస్వీకారపత్రం కూడా వ్రాయలేదు. నిమ్మదిమీద వీలునామా అవీ వ్రాయిద్దా మనుకున్నాడు శేషగిరిరావుగారు.

రంగమ్మ తన మేనకోడల్ని క్రొత్త చుట్టాలందరికి చూపించింది. "పిల్లకేం చందనంబొమ్మలా ఉంది. చిలకాగోరింకల్లా ఉంటారు. గురునాథంగారికి కులాసాగా ఉంటే ఆ మూడుముళ్ళు కూడా పడిపోయేవి," అన్నారు అందరూ, ముఖస్తుతిగా. సత్యం రెండో యేడు స్కూలు ఫైనలు ప్యాసయ్యాడు. వయస్సు పద్ధెనిమిది. బస్తీజీవితం బాగా తెలిసినవాడు. చక్కని రూపురేఖలు కలవాడు. పల్లెటూరి పద్ధతినే పిల్లని పిల్లవాడికి చూపెట్టేందుకు అమ్మలక్కలు హంగామా అంతా చేశారు. శాంతకి పదమూడేళ్లు. లావుగా, చామన చాయగా ఉంటుంది. పెద్దబాలశిక్ష చదివింది. ఇంగ్లీషు అక్షరాలు కూడా రావు. రూపురేఖల్లో ఆకర్షణ తక్కువ. తలెత్తి చూచాడు సత్యం తనకు నియమింపబడ్డ వధువును. సత్యంకు ప్రథమదర్శనంలోనే వైముఖ్యం, హేయం కలిగినాయి. మధుర భావాలకు నిలయమైన తన మనస్సుకు, శాంతను తాను స్వీకరించాలా, అనే భావం తగులగానే, బెట్టు గిరవాటుకు తెనె



పట్టునుంచి విజృంభించే తేనెటీగలవలె సత్యాన్ని వివిధ ఆలోచనలు చుట్టుముటాయి. తల వాల్చి ఏమీ మాట్లాడకుండా నే కూర్చున్నాడు. సిగ కొజ్జోలని సమర్థించారు అమ్మలక్కలంతా. క్రమంగా ఎవరి గ్రామాలకు వారు చేరుకున్నారు. శాంత తల్లితండ్రులుకూడా వెళ్ళిపోయారు. సత్యం, గురునాథం, రంగమ్మ మిగిలారు.

● ● *

వేసవికాలం సెలవల తర్వాత సత్యాన్ని కాలేజీలో ప్రవేశపెట్టటానికి గురునాథం నిశ్చయించాడు. సత్యం పెంపుడు తల్లి తండ్రులకు అనుగుణంగానే ఉంటున్నాడు శేషగిరిరావుగారు కాలంచేశారని హఠాత్తుగా కబురు వచ్చింది. సత్యం ఏలూరు వెళ్ళి కర్మఅయిన తర్వాత తిరిగి వచ్చాడు. గోపాలరావు మామగారి సలహాతో ఆస్తి నంతా భార్యపేర పెట్టించేశాడు వెంటనే.

సత్యం కాలేజీలో ప్రవేశించాడు. ప్రతి వారం వచ్చి గురునాథంగార్ని చూస్తూనే ఉన్నాడు. సత్యానికి శాంతవిషయం గుర్తువచ్చినప్పుడల్లా బల్లెపు పోటులా ఉండేది. క్రమక్రమంగా శాంత మీద జుగుప్స ఎక్కువవుతోంది సత్యానికి. ఇష్టంలేదని రంగమ్మపిన్నితో చెపుదామనుకున్నాడు. కాని తగిన ధైర్యం లేదు. అయినా ముందుగా తన అన్నతో చెప్పి చూద్దామనుకున్నాడు. ఒకమారు వెళ్ళినప్పుడు అన్నతో చెప్పాడు. దశరా సెలవలకు ఏలూరు వెళ్ళినప్పుడు గురునాథంగారికి యీ విషయంచెప్పమని అన్నని కోరాడు. గోపాలరావు తను జోక్యం కలుగ చేసుకోవటం మంచిదికాదని జవాబిచ్చాడు. నిరాశతో సత్యం తిరిగి వచ్చాడు.

గురునాథంగారికి ఎక్కువ అనారోగ్యం ఏర్పడింది. స్పృహకూడా తగ్గిపోతోంది. ధారకంకూడా పోవటంలేదు. పరిస్థితి ప్రమాదంగానే ఉన్నది. వెంటనే అన్నకు టెలిగ్రాం యిచ్చాడు. మామ సలహా మీద గోపాలరావు వచ్చాడు. అప్పటికి గురునాథంగారి ప్రాణం అంత్యదశలో ఉంది. ఇక లాభంలేదని గురునాథాన్ని బయటపెట్టారు. సత్యం గ్లాసులో నీళ్లు, తులసీదళం వేసుకొచ్చి ఉద్ధరిణితో మూడు సార్లు పోశాడు. అంతే, గురునాథం యీ లోకాన్ని వీడి పోయాడు. గోపాలరావు కర్మ పూర్తిఅయ్యేవరకు ఉండి తిరిగి ఏలూరు వెళ్ళిపోయాడు.

* ● ●

సత్యానికి అన్ని విధాలా మనోవ్యాకులత ఇనుమడిస్తోంది. తనకు సహాయంగా నిల్చే వారు ఎవరూ లేరని గ్రహించాడు. కాలయాపన నష్టప్రదమనుకొని తనకు భూమి, ఇల్లు సంగతి కాగితా ● వ్రాతకోతల విషయం, శాంత సంబంధవిషయం రంగమ్మపిన్నితో మాట్లాడేందుకు నిశ్చయించుకున్నాడు. ఒకనాడు. ఏలాగో ధైర్యంచేసి—

సత్యం: పిన్నీ! వీలునామావిషయం ఏం చేశారు? దురదృష్టవశాత్తూ బాబాయి చేతుల్తో జరగకుండా పోయింది.

రంగమ్మ: ఆస్తిఅంతా ఎలాగా మీకే గదా నాయినా! నేనూ అదే తొందర పడ్తున్నాను. శాంతపేరో నీపేరో పెట్తాను. ఇదిగో త్వరలో ఆ మూడుముళ్ళు పడితే నా బాధ్యత తగ్గుతుంది. మనలో మాట మన శాంతని చూశావుకదూ?

సత్యం: (ముఖంలో కొంతనిరుత్సాహం) అవును, పిన్నీ అదే నీకు చెప్దామనుకున్నా.

రంగ: మీ బాబాయికి కల్యాణం చూసే భాగ్యం లేకపోయింది.

సత్యం: (ముఖంలో బాధ - అధైర్యం) కాదు, పిన్నీ. ఆ సంబంధం నాకు అంత యిష్టంగా లేదు.

రంగ: (కోపం - ఆశ్చర్యం) ఆఁ! నిజంగా? ఇదెప్పట్నుంచీ? నా ప్రయత్నం బూడిదపాలు చెయ్యదలుచుకున్నావా?

సత్యం: మొదటే చెప్దామనుకున్నా, పిన్నీ.

రంగ: పిన్నీ, పిడుగూ! ఎందుకు మాట విననివాడికి? ఇదుగో, ఆలోచించు! శాంత మనయింట ఉంటేనే ఆస్తి నీతో ఉంటుంది.

సత్యం: అదేం, పిన్నీ? మీకు సగం. నాకు సగం. సగం నాకు వ్రాసియివ్వండి దత్తుణ్ణికాబట్టి.

రంగ: ఎవరికి దత్తుడివి? మేం ముందే చెప్పాం మీ వాళ్ళతో. శాంతని చేసుకోకపోతే నీకు యింట్లోది పూచికపుల్ల కూడా రాదు. బాగా ఆలోచించు.

సత్యం: అలా అంటారేం, పిన్నీ? దత్తయ్యే! కర్మచేస్తినయ్యే! ఇంకా ఎవరికంటారేమి. శాంతని నేను చేసుకోలేని మాట నిజం.

రంగ: నీవు ఏంచేసుకున్నా సరే. శాంతని పెళ్ళిచేసుకుంటేనే ఆస్తి. అంతే. నీకు కాగితాలు, పత్రాలు ఏమీ లేవు. వ్రాసికూడా నే నిప్పుడు ఇవ్వలేను.

సత్యం: అంతేనా? నాకు ఇష్టంకాని శాంతను చేసుకోను.

రంగ: అలాగయితే నీ దారి నీది. మాదారి మాది.

● ● ●

నిస్సహాయి సత్యం. ఎట్టి లిఖితాధారం లేదు. అన్న పిత్రార్జితంలో పీలికకూడా రానివ్వడని తెలుసు. సత్యంతన పెట్టె తీసుకొని రంగమ్మకి నమస్కరించి కృంగిన హృదయంతో విశాలవిశ్వంలోకి పయనమయ్యాడు.

నవల :



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౧౭

(గత సంచిక ౧౬-వ అధ్యాయం తరువాయి)

శ్రీ రుద్రదేవమహారాజులు మహారాష్ట్రసేనలను తరుముకొనుచు పురనిర్గమనము చేసిన యైదుదినములలో ఏకశిలానగరము యథాస్థితికి వచ్చినది. పదునైదు దినములు ఆపట్టణము నిరోధింపబడినది. అందులో కొన్నిదినములు మహారాష్ట్రసేనలు నగరమధ్యముననే ఉన్నవి. ఆంధ్రసేనలకు మహారాష్ట్రసేనలకు మహాయుద్ధము సాగినది. కాని యందులో నొక విశేషము ! ఏకశిలానగరమున గల యన్ని దేవాయతనములందును నిత్యపూజలకు ఒక్కనాడుకూడ విఘ్నము కలుగలేదు. రాచనగరు నంటియున్న కేశవస్వయంభూదేవాలయములందుగూడ నంతే! వాని ప్రాకారమునకు, రాజప్రాసాదము ప్రాకారమునకు మధ్య ఒక పెద్ద రాజవీధియే అడ్డమున్నది. ఆ విశాల రాజవీధియందంతట యుద్ధము భయంకరముగనే సాగుచున్నది. మహారాష్ట్రప్రభువగు మహాదేవరాజు కేశవశ్రీస్వయంభూనికేతనములలోనికి తనవెంట వచ్చిన ఋత్విక్కులను పంపి పరీక్ష చేయించి యచ్చట భటు లెవ్వరూ లేరని నిశ్చయించి, యాపైని ద్వారములయొద్ద మాత్రము భటుల గాపువెట్టెను. మహారాష్ట్రప్రభువే ఆ యాలయములలో తన గోత్రనామములతో పూజలు చేయింప ఋత్విక్కుల నియోగించెను. అతని సామంత దండనాథులుగూడా పూజలు చేయించిరి.

అట్లే అన్నమేశ్వరుని యాలయమునకుగూడ నించుకంతయు ఆటంకము కలుగలేదు. పైగా యథావాక్కుల అన్నమయ్య మహత్త్వము మహారాష్ట్రసైనికులలో కథలుగా ప్రాకినది. అందుచే వారు భయభక్తులతో నాతనికి నమస్కరించి, తాము విన్న యాతని మహత్త్వము ఒకరితో నొకరు చెప్పుకొనుచూ వేనోళ్ళ పొగడుచుండిరి. ప్రత్యేకముగా నప్పు డన్నమయ్యకు సర్వేశ్వరశతకము నుండి యీ పద్యము తరచుగా నోట నావృత్తమగుచుండెను.

"కులశైలంబులు పాదు పెల్లగిలి దిక్కూలంబునం గూలినం
జలధుల్మేరల నాక్రమించి సముదంచద్భంగి నుప్పొంగినన్
జలజాతప్రియశీతభానులు యథాసంచారము ల్దప్పినన్
దలఁకం డుబ్బఁడు చొప్పుఁదప్పఁడు భవద్భక్తుండు సర్వేశ్వరా!"

అన్నమయ్య యుండు ప్రదేశమునకు మిక్కిలి సమీపముననే సిద్ధనంద్యాచార్యులను భటులు చేర్చిరి. జైనవసదిలో జరిగిన దుర్నయముల కా మహానుభావున కెట్టి సంబంధము నుండదని రాజపురుషుల కందరకు తెలియును. పైగా నాతడి నోటిలో గుడ్డలు కుక్కబడి యవశిష్టప్రాణమాత్రుడై యున్న స్థితి చూచినవారికి, వసది వ్యవహర్తల యాగడ మాతడు ప్రతిఘటించి యుండు ననికూడ స్పష్టపడినది. రాజపురుషు లాతని గౌరవముతో నాదరముతో రాజభవనమునకు చేర్చి సమస్తోపచారములు చేయుచుండిరి.

రాజమందిరము చేరినప్పటినుండియు నాతనిలో నొక మార్పు ద్యోతకమయ్యెను ! వసదిలో నకృత్యము లెన్నియో ఆతడు చూచెను. వసది వ్యవహర్తలు ద్రోహియగు వీరభద్రేశ్వరునే జైనసిద్ధవేషముతో వసదిలో దాచి పైపెచ్చు తిరుణాల సాగించిరి. మరియు నచ్చటివారి యకృత్యము లెన్నియో ఆతడు కన్నులార చూచియుండెను. అందుచే ఆ మార్పు వచ్చినదో, మరి పూర్వకర్మానుగుణముగా కలిగినదో, కాక తరచుగా యథావాక్కుల అన్నమయ్యను ప్రత్యక్షముగా చూచుచుండుటచే నేర్పడినదో—

కారణ మేమైనను, ఒక మార్పు సిద్ధనంద్యాచార్యులలో వచ్చినది. ఆతని హృదయమున నేదో యొక శూన్యభావ మావేశించినది. ఆతడు బహుకాలముగా శ్రద్ధాభక్తులతో జైనధర్మ మనుష్ఠించి యుండెను.

"దగ్ధే బీజే యథాత్యంతం ప్రాదుర్భవతి నాంకురః
కర్మబీజే తథా దగ్ధే న రోహతి భవాంకురః"
కర్తాస్తి కశ్చిత్ జగతః సచైకః స సర్వగః స స్వవశః సనిత్యః
ఇమాః కుహేవాకవిడంబనాః స్యుః తేషాం నయేషా మనుశాసక స్త్వమ్"

"కర్మబీజము దగ్ధమైనవారికి భవాంకుర ముండదు. అంతేకాని జగత్తుకు నిత్యుడగు పరమాత్మ యొక డున్నా డనుకొనుట కుబుద్ధికృతము !"— ఈ విధముగా నాతడు విశ్వసించి యనుష్ఠించి యుండెను. కాని యీనాడు సిద్ధనంద్యాచార్య

లకు హృదయములో నావేశించిన శూన్యభావము దుర్భరమైనది. దేవతాప్రతిష్ఠలేని శూన్యాలయమువలెనే యాతనికి తన హృదయము తోచినది. ఎదుట శివార్చనాపరుడై ఆనందతేజస్సుతో కలకలలాడుచున్న అన్నమయ్యరూపము ఆతనిని ఆకర్షించినది. వెంటనే సిద్ధనంది బయలుదేరినాడు!

ఆతడు దిగంబరుడు! దారిలో చీమలుమొదలగువాటికి బాధ కలుగనీయకుండా తన చేతిలోని కుంచె యాడించుచునే ముందుకాతడు సాగెను. ఉచ్ఛ్వాస నిశ్వాసములలో గాలిలోని జీవులకు బాధ కలిగింపకుండుటకు ముఖమునకు పిధానవస్త్రము తగిలించుకొనియే ఆతడు బయలుదేరెను. భుజమున వడపోతగుడ్డయు గలదు. పోయి యాతడు అన్నమేశ్వరుని యాలయముముందు నిలిచెను. అన్నమయ్య పూజ యాపి తన్ను సాక్షాత్తుగా శివుడే వెనుకకు పిలిచినట్లు వచ్చెను. ఆవేశముతో నాతడిట్లు సిద్ధనందిరూపుడగు సర్వేశ్వరుని సంబోధించెను.

“అమరంగా గురుమంత్రకార్ముకమునం దాత్మాస్త్ర మష్టాంగయోగ
మహాముష్టివివేకి రేయుటయుఁ, దత్కాండం బజాండాదిత
త్త్వము వెల్లన్వడి గ్రుచ్చి పాఱి భవదుద్యత్పూత్కృతకైవల్యల
క్ష్యమునం దద్భుతశక్తితోడ గమియంగా నాటు, సర్వేశ్వరా!”

అష్టాంగయోగసాధనలో నిష్ణాతు డగు సిద్ధనంద్యాచార్యుల కది యద్భుతముగా దోచెను. మరుక్షణమున నాతడు తనకు శివదీక్ష నిమ్మని యన్నమారాధ్యుల వేడికొనెను. వెంటనే యథావాక్కుల అన్నమయ్య యాతనికి పంచాక్షరీమంత్రోపదేశ మొనర్చి నిత్యార్చనకు ప్రాణలింగము నొసంగెను.

సిద్ధనంద్యాచార్యులు జంగముడైన వార్త ఏకశిలానగరమునను, చుట్టుప్రక్కలను ప్రాకినమాత్రముననే, వందలు, వేలుగా జైనులు అన్నమయ్య నాశ్రయించి, యాతని యనుగ్రహముచే లింగధారణ మొనర్చి జంగములైరి. అది యొక వేలమువెర్రిగా పరిణమించెను. వారిలో పలువురు సిద్ధనంద్యాచార్యులు మారిరనిన విని నమ్మలేక చూడవచ్చినవారే! చూచినపిమ్మట వారికిని మార్పు వచ్చినది. ఇట్లెన్నో జైనకుటుంబములవారు శివదీక్ష గ్రహించిరి.

* * * *

మరి మహారాష్ట్రమహాదేవరాజు యాదవసైన్యములను తరుముచుపోయిన యాంధ్రసేన లేమి చేసినవి? ఆ యాత్రలో శ్రీరుద్రదేవమహారాజు లేమి చేసిరి? శూలధరులైన యారువేలమంది నూతన బ్రాహ్మణవీరుల నడిపించుకొనిపోయి అన్నమంత్రీశ్వరు డేమి సాధించెను? ఏకశిలానగరము క్లిష్టస్థితిలో నుండగా నుత్సాహముతో తోడుపడిన వీరశైవయోధు లెట్లు పరాక్రమించిరి? గోన గన్నారెడ్డియు, నాతని సేనానులును, సేనలును ఏమొనర్చిరి? తిక్కచమూపతి యనుష్ఠించిన మహత్కార్య మేమి?

అవి యన్నియు నొక్కొక్కటి యొక్క బృహత్కథ కాగలదు. ఒక్కొక్కటి ఒక్కొక్క ఆంధ్రకవి ప్రత్యేకముగా విస్తరించి వర్ణించి గానముచేయదగిన వీరగాథ! ఆ కాలపు కవు లవి గానముచేసియుండిరి. ఆ యుద్ధములో ఆంధ్రవీరులు చూపిన ధైర్యసాహసములు, అన్నమంత్రి యుజ్జ్వల ప్రతిభ, గోనగన్నారెడ్డి పరాక్రమప్రదర్శనము, తిక్కచమూపతి ప్రతాపము, వీరరుద్రమహారాజుల సర్వతోముఖప్రజ్ఞ—ఆ కాలపు కవు లనేకులు అనేకవిధముల గానముచేసిరి. అవి యఱువదియేండ్లపాటు ఆంధ్రదేశమున తిరుమలతిరుపతినుండి సింహాద్రివరకును, కల్యాణకటక శ్రీశైలములనుండి ప్రాక్సముద్రమువరకును, మారుమ్రోగిపోయినవి. అంతే కాదు! ఆ యుద్ధములో పాల్గొనిన రెండులక్షల యేబదివేలమంది యోధుల యింటింటను ఒక్కొక్క యోధుని వీరగాథయు దినదినమును స్మరింపబడుచుండెను. కుమారులు, కుమారికలు, మనుమలు, మనుమరాండ్రు—ఆ యోధవరేణ్యులనోటనే ఆ గాథలు విన నోచికొనిరి. అట్లు అరువదియేండ్లు ప్రతిధ్వనించిన ఆంధ్రవీరుల విజయఘోష, ఆ అరువదియేండ్లపిమ్మట ముంచుకొనివచ్చిన మహాసముద్రప్రవాహములో కలసిపోయి విస్మృతమయినది. జనులు మరచిపోయినారు!

* * *

కాని యీ మహాయుద్ధము కన్నులార జూచిన గోదావరీ నదియు, మంజీరానదియు, ఆ చుట్టుపట్టుల గల పర్వతారణ్యములునుమాత్రము ఇప్పటికిని అది మరువలేదు. మంజీరానది మంజీరమంజుశింజితము పలుమరు నా కథనే స్మరించును. గోదావరీ నదియు మంద్రగంభీరస్వరమున నా కథనే స్మరించును. ఆ రెండు నదులకును ఆంధ్రులును, మహారాష్ట్రులును ఒక్కటే! ఆ రెండు దేశములవారును ఒకరితో నొకరు కలహించుట, యీ రెండు నదులకును ఇష్టము లేదు. వారు ఒకరిపై నొకరు దండెత్తకుండ నా నదులు బహుకాలము వారించుచుండెను. ఆ నదుల యానలు మీరినప్పుడెల్ల అట్లు మీరినవారి నా నదులు శిక్షించుచుండెను. అట్లు శిక్షించుచునే ఆ రెండునదులును విషాదమునొందును. తమ కుమారులు ఒకరితో నొకరు కలహించుచుండుట ఏ తల్లి కిష్ట మగును!

మహారాష్ట్రులకు, ఆంధ్రులకు తల్లులగు మంజీరాగోదావరీ నదులకు విషాదము కలిగించు గాథ మనము మాత్రము త్రవ్వుటేల? కేవలము శుష్కచరిత్రకారులు చెప్పునట్లు ఆ యుద్ధకథ స్మరింతము!

మహారాష్ట్రసేనలు వెనుదిరిగి పోయిపోయి మంజీరానది గోదావరిని కలయుచోట నాగెను. అంతవరకు ఆంధ్రసేనలు వాని వెన్నంటి విడువక తరుముచుండెను. ఇక పారిపోవుటకు వీలు లేదు. రెండు నదీప్రవాహము లడ్డమయినవి. మహారాష్ట్రసేనలు తమ్ము తరుముచున్న ఆంధ్రసేనల నెదుర్కొని పోరాడక తప్పలేదు. మహారాష్ట్రులు మూడు లక్షలున్నారు. ఆంధ్రులును రెండు లక్షల యేబదివే లున్నారు. ఉభయరాజ్యముల ప్రభువులును రెండుసేనలను నడుపుచున్నారు. ఉభయసేనలలోనను సమర్థులగు సేనానులున్నారు. ఉభయసేనలలోనను వీరులున్నారు. ఉభయసేనలును భయంకరముగా పోరాడినవి. రాత్రివరకు పోరాడినవి. ఉభయసేనలందును పలువురు యోధులు ప్రాణములు కోల్పోయినారు. ఆ రాత్రికి మహారాష్ట్రమహాదేవరాజుకు పశ్చాత్తాప మావహించినది.

“అక్రమముగా పరిహద్దు దాటిపోయినది నేనే!”

ప్రక్కనే ప్రవహించుచున్న మంజీరానది యూ నన్నది. ఆ ఓంకారమునే గోదావరీనది దూరమున ప్రతిధ్వనించినది!

ఐన నేమి? మరునాడును యుద్ధము ఉభయసేనలకును మహాభయంకరముగనే సాగెను. అంతవరకును ఒకరిని మించి యొకరు యుద్ధము చేయుచున్నారు. ఉభయుల యుద్ధవిధానములును ఒకటియే! ఉభయుల బలములును ఇంచుమించుగా నొక్కటియే! ఆ మధ్యాహ్నమునకు కోలనిరుద్రుడు, కళింగ సేనలను పారద్రోలిన విజయగర్వముతో, నొక మహాసేన తోడుగా వచ్చి గోదావరి యావలియొడ్డునకు జేరికొని మహారాష్ట్రసేనలను వెనుకవైపున నిరోధించినాడు. ఆ సాయంత్రమునకు కొంతసేనను గోదావ

దాటించి మంజీరానది యావలియొడ్డున రేవులనుగూడ నాతడు నిరోధించినాడు!

"మహారాష్ట్రమహాదేవరాజునకు వెంటనే సంధిచేసికొనుట యుత్తమ మని తోచినది. ఇంకను జననష్టమైనచో కష్టమ్మగుట పర్యవసాన మే మగునో! అతడు శ్రీ రుద్రదేవమహారాజులకు రాయబార మంపెను.

"మహారాష్ట్రులును, ఆంధ్రులును ఒక తల్లి బిడ్డలు. మన మిట్లు కలహించుట యుచితము కాదు. ఉత్తరదేశమున ఉభయులకును శత్రువులు చెలరేగుచున్నారు. మేము సరిహద్దు దాటి వచ్చిన తొందరపనికి నష్టపరిహారముగా కోటిసువర్ణము లర్పించుకొందుము. మన మింతటితో వైరము లుడిగి మనియుందము!"

ఇట్లు మహారాష్ట్రప్రభు వంపిన రాయబారుల వాక్కులు శ్రీ రుద్రదేవమహారాజులు నిండు కొలువుండి యాలకించిరి. వారు తమ మంత్రి, సామంత, దండనాథులను తమకు యుక్తమని తోచినది చెప్పగోరిరి. వారును పరిపరివిధముల తమ తమ యూహలు నివేదించిరి. అంతయు మహారాజులు శ్రద్ధగా నాలకించిరి. తిక్కన సోమయాజులు ఆంధ్రమహాభారతమునుండి వినిపించిన పద్యము లలో నొకటి మహారాజుల చెవులలో ప్రతిధ్వనించెను.

"కడువనిచ్చితకీయు గురువర క్రక్కించు,
నవసరంబు నెఱిఁగి యరిన్పపాలు
నీవు దీరవృత్తి నిడు ద్రాట బోనిమ్ము,
క్రమ్మ కపిల యనగ గ్రమ్మ చెఱవు"

ప్రకృతిజనముల యనుమతితో శ్రీ రుద్రదేవమహారాజులు సంధి కియ్యకొనిరి. దేవగిరి యాదవప్రభునివలన కోటి సువర్ణములను గొని, శ్రీ రుద్రదేవమహారాజు గోదావరీ, మంజీరానదీతీరముల తన విజయస్తంభములు నెలకొల్పజేసి విజయోత్సాహముతో తన సామంత, మంత్రి, దండనాథులతో ఏకశిలానగరమునకు మహావైభవముతో ప్రయాణమయ్యెను. ముందు మహారాష్ట్రులవలన దాను గొన్న కోటిసువర్ణములతో తిక్కచమూపతిని పంపి, మహారాజులును, శీఘ్రప్రయాణముల వసంత నవరాత్రోత్సవములు నిర్వర్తించు వ్యగ్రతతో సాగి వచ్చుచుండిరి.

ఈ యుద్ధములో మారన తీవ్రముగా గాయపడెను. అతనిని అందలముపై శస్త్రవైద్యులు పరివేష్టింప తిక్కచమూపతి సేనలతో పంపివేసిరి.

మహారాష్ట్రులను తరుముకొనిపోవు సమయమునమాత్రము ఒక విషాదసంఘటన జరిగినది. ఆంధ్రరాజ్యములో మహారాష్ట్రసేనలకు ముప్పదియారు జనపదములు ఆశ్రయ మిచ్చెను. అందులో ముఖ్యముగా జైనులు నివసించుచుండిరి. మహారాష్ట్రుల నా జనపదముల నుండి పారద్రోలెడి సమయమున, ఆంధ్రసేనలు వానిపై కఠినచర్య తీసికొనెను. ఆ గ్రామములలోని పెద్దల నందరను దండనాథులు పిలిచి తీవ్రముగా శిక్షించిరి. ఆ రాత్రియే ఆ ముప్పదియారు గ్రామములును పరశురామప్రీతి యయ్యెను. జైనులు తమ గ్రంథములలో మతావేశముచే శైవు లీ రాక్షసకృత్య మొనర్చిరని వ్రాసిరి. పాపము, ఆంధ్రసేనతో వచ్చుచున్న వీరశైవులు తా మేమియు నెరుగ మనియు, శివనింద చేయువారిని శివకోపాగ్నియే దహించు ననియు చెప్పుకొనిరి. ఆ గ్రామములలో నల్లాడుచున్న జనులను బాలురను, వృద్ధులను, స్త్రీలను రక్షించుటకు ఆంధ్రసైనికులు మిక్కిలి పాటుపడిరి.

కాని యపకీర్తిమాత్రము వారికి పోలేదు

* * * *

'ఆంధ్రసేనలు కృతార్థము లైనవి. శ్రీరుద్రదేవమహారాజులను ఏకశిలానగరపౌరులు మహానందముతో ఎదుర్కొని దీవించి, యాదరించి పూజించిరి. ఇంతవరకు శ్రీమహారాజుల సర్వసేనలకు నాధిపత్యము వహించిన అన్నమంత్రీశ్వరు లిప్పుడు సర్వభారమును త్యజించి, మరల తన్ను మహారాజు లుంచిన చెరసాలకు పోయి, అందులో యథాపూర్వముగా వేదాధ్యయనము వేదాంగ వేదాంత శ్రవణములలో నిమగ్నులైనాడు.

* * *

శ్రీ రుద్రదేవమహారాజులు అంతఃపురము చేరగనే కుబ్జ మంగళారార్తికము పట్టినది. దాని వెంటనే ప్రతాపరుద్రకుమారుడు వచ్చి పాదాభివందనము చేసినాడు. రుద్రమ యాతని నాశీర్వదించి చేతులలోనికి తీసికొన్నది. మునుపటివలె నెదుర్కొనుటకు వృద్ధురాలగు కామసాని యీనాడు లేదు.

వెంటనే రుద్రమ కామసాని అంతఃపురరక్షణ చేయుచు ప్రాణము లర్పించిన గదికి బయలుదేరినది. రుద్రమ పెంపుడు నెమలి పింఛము విప్పి యాడుచు క్రేంకారము చేయుచు నెదురు వచ్చెను. పంజరములో రామచిలుక 'జయ రుద్రా! జయ రుద్రా!' అని పలుకసాగెను.

కామసాని ప్రాణములు వదలిన ప్రదేశమునకు సమీపమున కుడ్యమున వీరభద్రపటము వ్రేలాడుచున్నది. ఆ పటము రుద్రమ స్వయముగా చిత్రించినది. దక్షాధ్వరధ్వంస మొనర్చిన వీరభద్రావతార మందులో తాను చిత్రించినది.

ఆ గదిలోకి చేరగనే రుద్రమను ఎదుర్కొన్నది ముమ్మ! గోదావరియాత్ర చేసివచ్చిన దాదిగా ఇంతవరకు రుద్రమకు ముమ్మాంబ కనబడలేదు. దానిని చూచుటకు రుద్రమ తహతహలాడుచుండెను. ఆ తల్లి కూతుండ్రు ఒకరి నొకరు గాఢముగా కౌగిలించుకొనిరి.

సలహాలు:

వ్యాపార దక్షత

"అంగారకుడు"

ఆమధ్య కాన్ఫర్డ్ ఫజిల్‌కి డబ్బు కట్టినప్పటినుంచీ నాకు ఎక్కడలేని ఆరాటమూ పట్టుకున్నది. ఒక్కసారి పాతికవేలు వచ్చిపడితే ఏమి చేయాలా అన్నది ఒక సమస్య అయిపోయింది. ఆ డబ్బును ఎట్లా ఉపయోగిస్తే అది పెరిగి పిల్లల్ని పెడుతుందా, అన్న తొందర తప్పితే మరొకటి లేకపోయింది. అందుకని, బాగా డబ్బుచేసినట్లు పేరు పడ్డవాళ్ళ దగ్గిరికల్లా వెళ్ళి సలహాలు అడిగాను. సంప్రదింపులు జరిపాను.

అందులో ఒకాయన చాలా అద్భుతమయిన ఒక పథకం వేసిపెట్టాడు.

* * *

"ఏమండీ! మీదగ్గరకు ఒక చిన్న సలహాకోసం వచ్చానండీ" అన్నాను.

ఆయన చిన్ననవ్వు నవ్వి చెప్పమన్నట్లుగా తల ఆడించాడు.

"మావాడొకడు పెద్ద ఆస్తికి పెంపకం వెళ్ళి, అంతా జలకడుక్కున్నాడు. బుద్ధి తెచ్చుకుని చూసేటప్పటికి పోయింది పోగా పాతికవేల రూపాయల వరకూ మిగిలి ఉన్నది. దాన్ని ఎట్లాగయినా నిలుపుకుని కాలం వెళ్లదియ్యాలని వాడి కోరికె. మీరు కొంచం దయచేసి వాడికొక మార్గం చూపించాలి."

"మనకు చాతయినట్టు చూద్దాంలేండి... ఇంతకూ మీవాడి ఉద్దేశం ఏమిటి? ఒడుదుడుకులు లేకుండా ఏదో కొంచంగా వస్తుంటే చాలనుకుంటున్నాడా, లేకపోతే—"

"లేదండీ, కొంచం పెద్దమొత్తాలుగానే రావటం అవసరం."

"మరయితే, మనిషి తెలివితేటలు, ధైర్యసాహసాలూ కలవాడేనా?"

"అహా! వాటికేమీ లోపం లేదు. కొంచం బుద్ధి ఇన్నాళ్లూ పెడదోవ పట్టింది కాని."

"అయితే మీవాడిని బ్లాక్‌మార్కెట్‌లోకి దిగమనండి."

ఒక్కసారి గుండె గుభేలు మన్నది.

"ఆఁ బ్లాక్‌మార్కెటా?"

"అవును."

నెహ్రూగారి హెచ్చరికలూ, మెహతాబ్‌గారి ఉద్ఘాటనలూ, పటేల్‌గారి అభిభాషణలూ ఒక్కసారిగా నన్ను కలవరపెట్టటం మొదలుపెట్టినవి.

"అందులోమాత్రమే డబ్బు పుష్కలంగా చేయటం వీలవుతుంది."

దీనితో ధనలక్ష్మి గాజుల గలగల చెవుల్లో ప్రవేశించి హెచ్చరికలకూ, ఉద్ఘాటనలకూ, అభిభాణలకూ ఉద్వాసన చెప్తుంది.

"అందులో ప్రమాదమేమీ లేదుగదా" అని బొంగురు గొంతుతో ప్రశ్నించాను.

ఆయన మళ్ళీ ఇంకో నవ్వు పారేసి, ఇంతమాత్రం దమ్ములు లేవా అన్నట్టు చూశాడు.

ఇంతలోకి ఆయనకొడుకు ఇద్దరికీ కాఫీ ఇచ్చి వెళ్లాడు.

ఆయన మొదలుపెట్టాడు.

"బ్లాక్‌మార్కెట్ అన్న పేరు మిమ్మల్ని గాభరాపెడుతున్నది. కాని అందులో కష్టం కానీ, ప్రమాదం కానీ, కొత్త విషయంగానీ, ఏమీ లేవు. ఇదుగో ఈ కాఫీ చూడండి. బ్లాక్‌మార్కెట్‌ని కాచి వడపోసినసారమే ఇది."

"నిజం?"

"నిజమే. కాఫీపొడిని బ్లాక్‌మార్కెట్‌లో కొనుక్కురావాలి. దాన్ని కాచి వడపోసి పంచదార వెయ్యాలి. ఈ పంచదార రావలసిందికూడా బ్లాక్‌మార్కెట్‌నుంచే, ఇంక పాల విషయం. నీళ్లు కలిపి వెన్న తీసిన బ్లాక్‌మార్కెట్‌పాలు"

"మీరు చెప్పింది నిజమే."

"ఇవన్నీ యథావిధిగా ప్రతినిత్యం జరిగిపోతూ ఉంటయ్. ఇట్లాగే అన్ని రకాల బ్లాక్‌మార్కెట్ కూడా" అని ఆయన ధైర్యం చెప్పాడు.

దీంతో కొంచం మనసు తెరిపిన పడ్డది.

"అయితే పథకం పూర్తిగా సెలవియ్యండి."

"బ్లాక్‌మార్కెట్ చేయదలచుకున్నవాళ్లు ఏకాగ్రతను సాధించాలి. ఆ లక్ష్యం తప్పితే, మనసు వేటినీ అంటకుండా, తామరాకుమీద నీటిబొట్టువలె ఉండాలి. డబ్బు సంపాదించాలన్న మహాలక్ష్యం పాప పుణ్యాలూ, దయా ధర్మాలూ మొదలైన స్వల్పవిషయాలకోసం చలించకూడదు. జనం ఒక సరుకుకోసం అలమటిస్తున్నారనుకోండి. అది కాస్తో, కూస్తో ఎక్కడయినా దొరుకుతుంటే ముందు దాన్ని మాయం చెయ్యాలే కాని 'అయ్యో పాపం' అనుకోకూడదు. సరుకు ఎంత అపరూపంగావుంటే ధర అంత పలుకుతుంది."

నా మనసులో జీర్ణించిపోయిన మధ్యతరగతి సంస్కారం ముఖంలో కొంచం సందేహాన్ని చూపించినది.

"మీరు కొంచం సందేహిస్తున్నట్లున్నారు. కాని అది నిజమైనది కాదు. హోటల్లో ముప్పావలా బిల్లు చేసి బయటికి వస్తూ, ఎముకలు పొడుచుకునివచ్చిన బిచ్చగాడికి, కాని డబ్బయినా పడెయ్యరు. వాడి బాధను చూసికూడా పట్టించుకోరే! ఇంక మీకున్న సందేహం ఎట్లాంటిది?"

వెన్నుపుష్టి లేని నా పాపభీతి ఆ దెబ్బతో తోక ముడిచి పారిపోయింది.

"పాపపుణ్యాల ఆలోచన వదులుకొనుట మన్నది బ్లాక్‌మార్కెట్‌దార్లు నైతికంగా చేయవలసినపని. ఇంక పోతే అసలు పనిని నడపటానికి వేరే హంగు కావాలి.

నేను ఎంతో శ్రద్ధగా వినటం మొదలు పెట్టాను.

"బ్లాక్‌మార్కెట్ చేయదలచుకున్నవాడు దేశంలో ఏ సరుకులు సమృద్ధిగా దొరుకుతున్నదీ, వేటికి కొరతగా ఉన్నదీ జాగ్రత్తగా తెలుసుకోవాలి. కంట్రోళ్ళకు సంబంధించిన రూల్సు యావత్తూ క్షుణ్ణంగా తెలుసుకుని ఉండాలి. అప్పుడే వాటిని తప్పించుకుని తిరగటం వీలవుతుంది. ఆ సన్నాహాలన్నీ అయినతరవాత పర్మిట్ల కోసం బయలుదేరాలి."

అదీ వరస అన్నట్లు ఉత్సాహంతో తల ఊగించాను.

"ఈ పర్మిట్లవేట వెనకటికన్నా ఇప్పుడు కొంచం కష్టమయిన మాట నిజమే. కాని అసాధ్యం మాత్రం కాదు. ఆర్థిక చిక్కుల్లో ఉన్న రాజకీయనాయకులు, ధనాశగల నాయకులు ఇందులో మనకి చాలా ఉపయోగిస్తారు. పర్మిట్లు మన పేరుమీదనే వస్తే సరేసరి. లేకపోయినా అట్టే ఇబ్బంది లేదు. వాటిని తెచ్చినవాళ్ళకు కొంచం చెయ్యి తడిచేస్తే సరి."

"ఎట్లాగయినా అవి అంత సులభంగా దొరకటం లేదండీ" అన్నాను.

"అంతమాత్రంచేత వచ్చే ఇబ్బందేమీ లేదు. పర్మిట్లు దొరక్కపోతే, ఏజన్సీ

(19-వ పేజీ చూడండి)



"ముసలివాడివా, ముతకవాడివా? మళ్ళీ పెళ్ళిచేసుకో, చలపతీ," అన్నాడు అన్నగారు.

"ఇంకేం పెళ్ళిరా? ఇరవై ఏళ్లు పొరపు లేకుండా ఒక పెళ్ళాంతో కాపరంచేశా అందరూ బతికుంటే ఆరుగురుపిల్లల తండ్రిని, ఇవాళో రేపో కాంతంభార్య కాపరానికి రానుంది. ఇంకో ఆడదిక్కుండదన్న బెంగ లేదు చిన్నముండ, లలితకు సవితితల్లి నంటగట్టటానికి, నేను వలభయ్యోయేట పల్లకీలో ఊరేక్కపోతే ఏం?" అన్నాడు చలపతి

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

"రేపు కాంతానికి ఉద్యోగం కావచ్చు, ఊరూరూ తిరగొచ్చు వాళ్ళతోబాటు నువ్వూ, పిల్లా తిరుగుతూఉంటారుట్రా? కాంతాన్ని పెళ్ళాన్ని వాడిలెయ్, చెబుతా. కొత్తజోడు, వాళ్ళమానాన వాళ్ల నుండనీ," అన్నాడు అన్నగారు.

చలపతి నవ్వాడు.

"కాంతం పెళ్ళాం ముచ్చటగురించి అంత ఆలోచనగలవాడివి, నే చేసుకో బోయ్యే పిల్లముచ్చటగురించి ఆలోచించావా?" అన్నాడు చలపతి

"చిన్నపిల్లను చేసుకోమంటున్నానా?,

అన్నగారు అటూ ఇటూ చూసి గొంతు తగ్గించి, "సూర్యనారాయణ చెల్లెలుంది. చూశావూ? ఏనాడో బియ్యే పాసయింది. ఇంతవరకు పెళ్ళి పెటాకులూ లేదు. వయసు ఇరవై ఏడో, ఇరవై ఎనిమిదో ఉంటుంది. నువ్వు చేసుకుంటే అవునని ఉన్నది సూర్యనారాయణకు. బాగా చదువుకున్నదీ, బుద్ధిమంతురాలూనూ. నిక్షేపంగా చేసుకో—సంవత్సరసూతకం వెళ్ళకముందే."

చలపతి అన్నగారి మాటలు చాలా శ్రద్ధగా విని కూడా తల అడ్డంగా తిప్పాడు.

"ఏమైనా లలితకి సవతితల్లిని అంటగట్టను. అది జరిగేపని కాదు," అన్నాడాయన—

2

కాంతంపెళ్లాం కామాక్షి కాపరానికొచ్చింది. ఇంట్లో అడుగుపెట్టిన క్షణం నుంచీ కామాక్షి, ఇంటికి తానే పెత్తందారైనట్టుగా ప్రవర్తించసాగింది. గర్భాదానపు గదిలోనే కాంతం భార్యదగ్గిర విధేయతా ప్రమాణం చేసేశాడు. చాలా ప్రేమకథలు చదివి ఉన్నవాడు కావటం చేత కాంతం, ఆగర్భమైన ప్రణయజీవితానికీ, మొగుడు పెళ్ళాంమీద అధికారం చలాయించటానికీ తూగదని నిర్ణయించుకున్నాడు. ఆ మాటని మొగుడు పెళ్లాలు సమానఘాయాల్లో ఉండటంలోకూడా కాంతానికి శృంగారం కనిపించలేదు. మొగుడు పెళ్లాంపాదదాసుడుగా ఉండటంలోనే భావకవి శృంగారం యావత్తూ ఇమిడి ఉన్నదని కాంతం ఏనాడో గ్రహించాడు. ఈ శృంగారాన్ని అతను కవిత్వం కూడా రాశాడు.

కాంతం కొత్త కాపరం కవిత్వంగాని, శృంగారంగాని ఏమన్నావుంటే అదంతా కాంతమే సప్లయిచేశాడనాలి కామాక్షిలో కవిత్వంగాని, శృంగారంగాని ఏమీ లేవు. సాధ్యమైనంత కొద్దికాలంలో ఆ అమ్మాయి (వయస్సు పదిహేను) కాంతం పొడుగూ వెడల్పూ, లావూ, బరువూ అంచనాకట్టేసి అతని దౌర్బల్యాలన్నీ తెలుసుకుని వాటిని స్వార్థానికి ఎట్లా ఉపయోగించాలో ఆలోచించి పెట్టింది.

కాంతానికి ఉద్యోగం ఎట్లాగో దొరికింది. నెలకు నూటపాతిక తెస్తున్నాడు. భార్య రాకపూర్వం రెండునెల్ల జీతం యథేచ్ఛగా ఖర్చుపెట్టేశాడు. ఇక ముందు ఆ జీతంలోనుంచి కనీసం వందరూపాయలు తనకింద ఖర్చయేటందుకు ఉపాయం ఆలోచించింది.

"కాకపోయినా మీరు డబ్బు మరీ తగలేస్తారు. రెండు నెల్లు రెండొందల యాభై వచ్చాయి గదా, ఏమైనట్టు?" అన్నది కామాక్షి.

"ఏవో ఖర్చయిపోయింది. స్నేహితులతో కాఫీ హోటళ్ళకూ, సినిమాలకూ వెళ్ళాను. బట్టలు కుట్టించుకున్నాను. లలితకి పరికిణీలూ, జాకెట్లూ కుట్టించాను. ఎట్లా అయిపోయిందో అయిపోయింది." అన్నాడు కాంతం తప్పుచేసినవాడల్లే.

"ఇంకా నయం! ఇట్లా అయితే కొంప గుల్లే!... ఏదీ? నెలకు నూటపాతికా? అందులో పదిహేను రూపాయలు, పాపం, మీఖర్చుకింద ఉంచుకోండి మిగిలిన నూటపదీ—"

"నా ఖర్చుకింద పదిహేనేనా?" అన్నాడు కాంతం, తనని భార్య దోచేస్తున్నట్టు.

"రోజుకు అర్ధరూపాయికంటె ఎందుకమ్మా? ఏంఖర్చుందీ? కాఫీ హోటలు లేగా, ఇంటినుంచి టిఫిన్ పట్టుకుపోతే అదీ అక్కర్లేదూ!

"నా సొంతఖర్చు కనీసం పాతిక వుంటుంది. ఉంటుందేమిటి? ఇప్పుడుంటున్నది."

"ఎందుకుంటున్నదీ? ఊళ్ళో అడ్డమైనవాళ్లనీ మేపితే సినిమాలకు తీసుకుపోతే, ఉండక ఏంచేస్తుందీ?... నేనేం డబ్బు తినెయ్యను లెండి. నెలకు నూరు మిగిల్చినా ఏడాదికి—అబ్బో! పన్నెండువందలు మిగులుతుంది. ఎంతలేసి వస్తువులు కొనుక్కున్నా కొనుక్కోవచ్చు, అన్నది కామాక్షి.

"నీకు ఏడాదికో నగ చేయించొచ్చు" అన్నాడు కాంతం. ఈపాటి తన భార్యకు తట్టలేదనుకునీ, ఆమెను సంతోషపెడదామనుకునీమా.

"నా నగల కేమిటి ముష్టివి? నెలకో గాజులజత కొనొచ్చు. లేమా, నెలకో పట్టుచీర కొనొచ్చు, ఏడాదిమీద రవ్వల దుద్దులు కొనొచ్చు, తెలుసా?"

ఏడాదికొక రవ్వల దుద్దుల జత కొని పెట్టే తాహతు తన కున్నదని తెలుసుకుని కాంతం చాలా సంతోషించాడు.

ఇంటి ఖర్చుకింద తండ్రికి సహాయపడవలసిన భారం తనమీద ఉంటుందనీ, తండ్రికూడా తనలాగే ఉద్యోగంమీద ఆధారపడ్డ మనిషి అనీ కాంతానికి తట్టలేదు. కామాక్షికి తట్టిందిగాని, ఎందుచేతో ఆ ప్రశంస ఎత్తలేదు.

3

కామాక్షి వచ్చినతరవాత ఇంటిల్లిపాదికీ తిండి అలవాట్లు మారిపోయాయి. సుష్టుగా తినటంగురించి ఆపిల్లకేవో కొన్ని భ్రమలున్నాయి. రోజూ - ఒక్కొక్కసారి రెండుపూట్లా - బంగాళాదుంపల వేపుడు చేసేది. ప్రతికూరా వేయించేది. పొట్లకాయలూ, బీరకాయలూ, సొరకాయలూ, ఆకుకూరలూ విస్తట్లోకి రానిచ్చేది కాదు. ఎంతసేపూ వంకాయలూ, బంగాళాదుంపలూ, చామదుంపలూ చేసేది. కందిపప్పు చేసేది కాదు. ఎంతసేపూ పెసరపప్పూ, పెసరపప్పు పచ్చడీ చేసేది.

ఒకరోజు మామగారు దోసకాయపప్పు చెయ్యమంటే పెసరపప్పులో వేసి చేసింది.

చలపతీ, లలితా, ఆఖరుకు కాంతం కూడా తమకు తినాలని ఉన్నవస్తువులు చెప్పి చేయించుకోనటానికి ప్రయత్నించి సాగించుకోలేకపోయినాగు. ఈ విషయంలో కామాక్షి, తనదే నోరయినట్టు, "అవి నాకు సయించవు ..అదంటే నాకు భయ్యన డోకు..అటువంటివి అలగావాళ్లు తింటారు ... అవి చెయ్యటం నాకసలు చాతేకాదు .. అది ఉడికేవాసన కొడితే నేనా ఇంట్లోనే ఉండలేను" ఈ ధోరణిలో ప్రతిదానికి అభ్యంతరాలు చెప్పేది.

ఇటువంటి విషయాలలో తగాదాపడటం ఎన్నడూ అలవాటే లేని చలపతి కోడలి వైఖరి చూసి నివ్వెరపోయాడేగాని ఇంకేమీ చెయ్యలేకపోయినాడు.

కాంతంమటుకు కాంతం తన భార్య ప్రవర్తన ఏమాత్రమూ విడ్డూరంగా లేనట్టు నటించటానికి ప్రయత్నించేవాడు.

వంటవిషయంలోకన్న డబ్బు విషయంలో అతను చాలాఇరుకున పడ్డాడు. జీతమంతా పెళ్ళాం పుచ్చేసుకుంటుంది. రోజుకు అర్ధరూపాయిస్తుంది. సాయంత్రం ఇంటికి రాగానే లెక్క అడుగుతుంది. అర్ధరూపాయిలో పావలా పైన ఎంత మిగిలినా సంతోషిస్తుంది. అర్ధరూపాయీ ఇంటికి తెచ్చినరోజున మొగుడి ప్రజ్ఞకు ముద్దు కూడా బహూకరిస్తుంది

"కానీ ఖర్చు కాకుండా ఎట్లా గడిచిందండీ పాపం, హోటలు కెళ్లలా?" అంటుంది భార్యారత్నం ఎంతో ఆపేక్షగా.

"వెళ్ళకేం? బిల్లు స్నేహితుడెవరో ఇచ్చాడు" అంటాడు కాంతం ఆశే ఉత్సాహం లేకుండా ఎందుకంటే రేపు ఆ స్నేహితుడికే తను కాఫీహోటల్లో పెట్టించి

క
ఎ
తే

డబ్బు
పౌడర్లూ
బట్టలో,
"మరీ ఖరీదై
టాని కుండదు
రంగువి కొనుక్కో
వచ్చు," అనేవ
కాంతానికి
రగులుతున్నది
అసంతృప్తి అన్న
స్ఫురించలేదు.

ఒకరోజు చలపతి కొ..., ...క రూపాయలుంటే ఇస్తావుట్రా ?" అని అడిగాడు. కాంతంబిక్క మొహం చూసి," "మళ్లీ జీతం రాగానే ఇస్తాలే," అన్నాడు.

"లేవు, నాన్నా," అన్నాడు కాంతం.

"జీతమంతా ఖర్చు చేస్తున్నావా ?"

"అశ్రద్ధఅయిపోతున్నది. మిగల్చాలి," అన్నాడు కాంతం.

ఆరోజు కాంతానికి తాను దరిద్రుడన్న భావం కలిగింది. అదివరకు తాను ఏమేం ఖర్చులు చేసేవాడో తెలీదు గాని ఇప్పుడు తాను ఏఖర్చు చేద్దామనుకున్నా జేబులో డబ్బుండదు. అనేకసార్లు కిళ్లీకి డబ్బులు లేకపోవటం జరిగింది.

ఈ దారిద్ర్యంమూలంగా కాంతం సాటి ఉద్యోగులతోనూ, స్నేహితులతోనూ సరిగా సంచరించలేకపోవటం కూడా పరిణమించింది.

తన మానసిక దుస్థితికి పెళ్ళామే కారణమన్న ఆలోచన ఎప్పటికైనా కాంతానికి కలగకపోలేదు. అది కలిగిన రోజున కాంతం చాలా నొచ్చుకున్నాడు. అటువంటి ఆలోచన తనకు కలగటమే తనలో కుళ్లు ప్రవేశించటానికి నిదర్శన మనుకున్నాడు.

"కాము ఏం చేస్తున్నది ? డబ్బు వృధా కాకుండా ఉండాలనేదాని ఆరాటం. నగలు కొన్నదంటే నాలుగు కాలాల పాటు ఉంటుంది. పట్టుచీరలైనా ఏళ్ళతరబడి కట్టుకోవచ్చు. పౌడర్లూ, స్నోలూ కొంటుందంటే, ఏడాదికి పన్నెండువందలు వెనక వేసుకునే స్థితిలో నేనుండగా నా పెళ్లాం ఆ మాత్రానికి నోచుకోలేదా ?" అని కాంతం తన అంతరాత్మలో వితర్కించుకుని కామాక్షిమీది కేసు డిస్మిస్ చేశాడు.

కామాక్షి నిర్దోషి అని నిర్ణయించటమే కాదు. అది నిరూపించటానికిగాను,

...మర్నాడో జీతం రాగానే ...రాజాకైన బంగారపుగొలుసు-వరం బరువు గలది- నగల ...కొని పట్టుకెళ్ళాడు కాంతం. ...న్ని ముందుగా తన భార్యకు ...ు.

...క్షి మొహం ఒక్క సారిగా తెరలాగా అయింది. దానిమీద రక ... వెలుగు నీడలు ఒకదానివెంట ... మారాయి. మొదట ఆమెమొహం ...రింది.

"ఎంత నాజూగ్గా ఉందండీ ! ఎంతా ?"

మరుక్షణం కాంతి తగ్గింది.

"ముందు నాకు చెప్పకూడదుటండీ ? నేను కూడా వచ్చి ఇంకా మంచిది ఏరుకునే దాన్నిగా ?"

"నేనూ ఉన్నవాటిల్లోనుంచి చూసే తెచ్చాననుకోరాదూ ? నగల అందం నీకే తెలుసునంటావా ?" అన్నాడు కాంతం, అది లలితకోసం తెచ్చానని బయట పెట్టటం ఎట్లాగో తెలీకుండా.

"అందం తెలిస్తేసరా ? ఇది, చూడండి. మెడ దూరదు. మాటిమాటికి కొక్కెం తీసి పెడితే విరిగిపోతుందాయె. ఏమిటండీ మీరూ ?"

కాంతానికి మెరుపులాటి ఉపాయం తట్టింది.

"పోనీ, నీకు బాగా లేకపోతే మా లలిత పెట్టుకుంటుందిలే," అన్నాడు కాంతం.

వెంటనే కామాక్షి మొహంలో కలిగిన మార్పుకు కాంతంగుండె నీరైపోయింది,

"అయినా నీకు రెండు గొలుసు లుండనే ఉన్నాయిగా ?" అన్నాడు కాంతం, అట్లాగైనా కామాక్షి తృప్తిపడుతుందని.

"అదికూడా అనబోతున్నా నాకు ముందు చెబితే అసలు గొలుసుకే ఒప్పకపోదును. మంచి పలకలగాజులు—" కామాక్షి మాట మధ్య ఆగి భర్తకేసి వింతగా చూసింది. మెరుపులాటి ఆలోచన ఆమెకూ వచ్చింది.

"అయ్యో . నా తెలివి తగలడా ! అసలు కొనటమే ముద్దు ముద్దుగా చెల్లెలికని కొన్నారు గ్రామాలు ! ఇంకా నా కనుకుని సంబరాలు పడ్డా," అన్నది కామాక్షి.

కుక్కిన పేనల్లే, కన్నంలో పట్టుబడ్డ దొంగల్లే అయిపోయినాడు కాంతం.

4

లలిత తన వదినెగారంటే మొదట్లో చాలా ఇష్టం. కామాక్షి జడవేసుకుంటున్నా, పూలు పెట్టుకుంటున్నా, మంచి చీరె కట్టుకుంటున్నా, తనుకూడా దబ్బున పెద్దదై ఆ పనులన్నీ చేయాలని లలిత కుండేది. లోకంలో కామాక్షికన్న అందమైనది లేదనీ, ఆమెమీద అందరికీ

తన కున్నంత ఇష్టమూ ఉంటుందనీ లలితకు దృఢమైన నమ్మకం. కాంతం కామాక్షిని ఎంతో ఇష్టంగా చూడటం లలితనమ్మకాన్ని మరింత బలపరిచింది. కామాక్షిని గురించి తన తండ్రి ఏమనుకుంటున్నదీ లలిత ఎరగదు. ఇంతకూ ఆమె అమాయకురాలు. అయిదో ఏడు వెళ్లి ఆరో ఏడు వచ్చిన పసిది.

లలిత తనను ఆరాధిస్తున్నదని కామాక్షి ఎరుగును. అందుచేత ఆమె తన ఆడబిడ్డను వెంట వెంట తిరగనిచ్చేది. లలితచేత అవీ ఇవీ అందిచ్చుకునేది. కాని ఉన్నట్టుండి, "ఏమిటి, లలితా! నన్ను జలగలాగా పట్టుకున్నావూ! నీ ప్రశ్నలన్నిటికీ నేను సమాధానం చెప్పలేను పో," అని విసుక్కునేది. చిదరించుకునేది.

లలితకు కామాక్షి ఒకరోజు జడవేసేది. ఒకరోజు, "చేతులు నూనె చేసుకోలేను. నువ్వే వేసుకో. చంటిదానివా? జడేసుకోలేవూ? నీ యీడుకు నేనే జడేసుకునేదాన్ని" అనేది. ఒక రోజు లలితకోసం పూలుంచేది. ఒకరోజు అన్నీ తానే పెట్టేసుకుని, "నీసంగతి మరిచిపోయాను. ఇప్పుడేం చెయ్యమంటావు? జడలోవి తీసి నీకి ఇమ్మంటావా? ఒకరోజు పూలులేకపోతే నీ మొగుడు చంపెయ్యడులే,"అనేది.

వదినె తృణీకరించి మాట్లాడినప్పుడల్లా లలితకు లోకమే పోయినట్టయేది. చచ్చిపోబుద్ధి అయేది. ఒక్కొకసారి ఏడిచేది.

"ఏడు! నాకేం భయమా? మీ అన్నయ్యతో చెప్పుకుంటావు! అంతకన్న ఇంకేం చేస్తావు?" అనేది కామాక్షి.

కామాక్షి తనకు లేని నీచపు ఆలోచనలు అంటగట్టినప్పుడు లలిత విచిత్రమైన ఆవేదనకు గురి అయేది. తన వదినెమీద అన్నతో చాడీలు చెప్పాలన్న ఆలోచన లలితకు ఎన్నడూ తట్టనైనా తట్టేదికాదు; కాని కామాక్షి చీటికీ మాటికీ ఆమాట అనేది. "నువ్వు నన్ను చూసి ఏడుచుకుంటున్నావు! కుళ్లుతున్నావు? కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నావు!" అని కామాక్షి అన్నప్పుడల్లా లలిత నివ్వెరపోయేది. కామాక్షిని చూసి గర్వపడటం తప్ప లలిత ఇంకేమీ ఎరగదు.

వదినెగారు తనను నాకరల్లే ఉపయోగించుకున్నా, కుక్కల్లే చూసినా లలిత హృదయం తిరుగుబాటు చెయ్యలేదు. కామాక్షి తన కెంతో దగ్గరమనిషి అనుకుంటున్న లలిత ఆమెనుగురించి, తనకు తానై విరోధభావం ఎట్లాతెచ్చిపెట్టుకోగలదు? కొట్టినా, తిట్టినా సొంత తల్లిపై ద్వేషం తెచ్చిపెట్టుకోవట కష్టమో, కామాక్షిపై ద్వేషం కోవటమూ లలితకు అంతే కష్ట ఈ వూరికి ఆవూ రెంత దూరమో కీవూ రంతే దూరమన్నది మానవప లకు వర్తించదు గనక! కామాక్షి పెంపుడు కుక్క కన్న హీనంగా గలిగింది.

ఒకనాడు చలపతి పొలంవ్యవ: గురించి తమ స్వగ్రామం వెళ్ళాడు. ఆ సాయంకాలం పాసింజర్లో రావలిసి రాలేదు. ఆరోజల్లా, ఇంట్లో మగవాళ్లెె ఆసరా చూసుకుని, కామాక్షి లలితమనస్సును ఎన్నివిధాలనో చెండుకు తిని ఎంత నీచంగా మాడాలో అంత నీచంగా చూసింది. అది లలితకు దుర్దినం. రోజల్లా లలిత కుళ్ళి, కుళ్లి ఏడుస్తూనే ఉంది. తల్లిచేత దెబ్బలు తిన్న పిల్ల తల్లి దగ్గిరికే అనునయానికి వెళ్ళినట్టు తన ఏడుపు కామాక్షికి చూపించి ఆమె హృదయాన్ని మార్చాలని లలిత వదినెగారి కూడా కూడా తిరగసాగింది.

"ఛీ! ఏడుపుగొట్టు మొహమా! నీ మొహం నాకు చూపించకు! ఏడుపు మానేస్తేగాని నాకు కనిపించకు," అని కామాక్షి కసిరికొట్టింది.

ఆరు నెల్లక్రితం లలిత పోయిన తల్లికోసం ఇంతకన్న ఎక్కువే ఏడిచిందేమోగాని, ఆ ఏడుపువల్ల హృదయం తేలికపడితే, ఈ ఏడుపు హృదయాన్ని అంతకంతకూ బరువెక్కిస్తున్నది. చచ్చిపోయి తల్లి దూరం కావటం వేరు, బతికుండే వదినెగారు దూరం కావటం వేరు...ఇక కామాక్షి ఎన్నటికీ తనతో మంచిగా మాట్లాడదు. తన గతేం కావాలి? ఇక కామాక్షిచేత తిట్లు తినటం తన కిష్టంలేదు. తాను ఆమె నేమీ అడగదు. ఆమె కూడా కూడా తిరగదు. కాని ఈ విరోధం నిర్వహించటం తనవల్ల అవుతుందా?

ఆ రాత్రి భోజనాలయినతరవాత కాంతం వెళ్ళి గదిలో పడుకున్నాడు. మిగిలిన పనులన్నీ చేసుకుని కామాక్షి కూడా గదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నది.

ఆపాటికి మామూలుగా లలిత నిద్రపోయేదే. కాని ఆరోజు మనస్సంతా క్షోభపడి ఉండటంలో ఆ పిల్లకు నిద్రపట్టలేదు.

హాలులో దీపం కూడా లేదు. చీకట్లో లలితకు అమితంగా భయంవేసింది. చీకటి తనను మింగేస్తున్నదనిపించింది. తన పక్కలో రోజూ పడుకునే తండ్రి ఇక రాడనిపించింది.

డు
యి
లితకు
కూడా

లిత హీన
మసార్లు పిలి
ఖం ఆపుకో
రోదినా!" అని
టికి భయం గట్లు

ప్పుడయింది. గది
రులో నల్లగా నిల
చే,లలితా?" అన్నాడు.

ల చలికి వొణుకుతున్నట్టు వొణుకుతూ "భయంగా ఉంది." అన్నది, ఏడుపు ఆపుకుంటూ.

"ఏం? దీపం లేదూ?..దీపం పెట్టలేదు లే హాల్లో?" అన్నాడు కాంతం గదిలోపలి పెళ్లాంతో.

"మరిచిపోయినా గామాలు," అన్నది కామాక్షి, అది ఎవరితప్పో అయినట్టు.

"చీకట్లో పసిముండ భయపడదూ?... అన్నాడు కాంతం.

"నన్ను కాల్చుకుతినటానికి భయపడుతూ కూర్చోకపోతే, నిద్రపోరాదూ?" అన్నది కామాక్షి.

"పోలేదుకనక వెళ్ళి దీపం వెలిగించి పెట్టు."

"కాళ్లు తుడుచుకున్నాను. వంటింట్లో నిప్పెట్టె ఉంది. వంటిల్లు కడిగాను, తడిగా ఉంటుంది. ఓపికఉంటే మీరే వెలిగించండి. లేకపోతే గుట్టుచప్పుడు కాకుండా వచ్చి పడుకోండి." అన్నది కామాక్షి.

కాంతం దీపం వెలిగించి గదిలోకి వెళ్ళాడు. తన బల్లదగ్గిర చాలాసేపు ఏదో సర్దుతున్నవాడల్లే నటించాడు కాంతం - గదితలుపు వెయ్యటం ఇష్టం లేక.

"ఏం సర్దుడు? తలుపు గడియపెట్టి వచ్చి పడుకోండి. చెల్లెలికి సేవ చేశారుగా!"

మారుమాటాడకుండా కాంతం గది తలుపు నిశ్శబ్దంగా మూసి,అంతకన్నా నిశ్శబ్దంగా గడియపెట్టి వెళ్ళి మంచంమీద వెల్లకిలా పడుకుని గోడకేసి చూస్తూ ఆత్మపరీక్ష చేసుకోసాగాడు. పాపం, కాంతం చాలా పరీక్షలు పాసయినాడు. గాని ఈ

(88-వ పేజీ చూడండి)

వ్యాపారదక్షత

(14-వ పేజీ తరువాయి)

కోసం ప్రయత్నించాలి. ఈ రెండు పద్ధతులూ అన్నిటిలోకీ శ్రేష్ఠమైనవి. ఇవి సాధ్యపడకపోతే, సొంత తెలివిమీద పని సాగించాలి."

"కొంచం విప్పి చెప్పండి."

"నామటుకు నన్ను చూడండి. నేను రంగంలోకి దిగేటప్పటికి యుద్ధం మొదలయింది. సైన్యానికి కావలసిన వస్తువుల మీద మాత్రం కంట్రోల్లు ఉండేవి. యుద్ధం కొన్నాళ్ళపాటుసాగితే ఏ సరుకుల సప్లయి నిలిచిపోతుందా అని పరిశీలించినమీదట, రంగులనీ, మందులనీ ఊరూరూ గాలించి, కొని, నిలవజేశాను. తరవాత వాటికి కంట్రోలు రావటం, గిరాకీ పెరగటం జరిగి, మనకు ప్రభ ఎత్తుకున్నది. ఆ తరవాత సిమెంటు, ఇనుము, గుడ్డలు, బియ్యం, అగ్గిపెట్టెలు, కిరసనాయిలు, పంచదార మొదలైన సరుకుల్లో ఏజన్సీలనూ, పర్మిట్లనూ సాధించాను.

"అయితే ఇప్పుడు దాదాపు అన్ని వస్తువులూ కంట్రోలుకింద ఉన్నవి కదా: ఆ వ్యాపారంలో చాలామంది ముందు నించే స్థిరపడిఉన్నారేమో నండీ!"

"ఆమాట కూడా నిజమే. బ్లాక్ మార్కెట్ లైన్లో కూడా 'నో-వేకన్సీ' బోర్డు తగిలించాల్సివచ్చేట్లే ఉన్నది. అయితే నేం, ఇంకా ఎన్ని సరుకులు లేవుకనక ? ఉదాహరణకు విలాసవస్తువులు తీసుకోండి. వాటి దిగుమతులమీద విధి నిషేధాలున్నవే కాని దేశంలో అమ్మటానికి ఆటంకాలేమీ లేవు. వాటి హోల్ సేల్ డీలర్లకు మనం నమ్మకం కలిగించి సరుకును సంపాదిస్తే చాలు. ఆ తరవాత కేటలాగు ధరలతో మనకు సంబంధం లేదు. సబ్బులు, బ్లేడ్లు, తలనూనెలు, స్నోలు, పౌడర్లు మొదలైన వాటితో కోలాహలంగా కథ నడపొచ్చు.

"జనందగ్గర డబ్బు తగ్గిపోతున్నది. కదా, విలాసవస్తువులమీద, ఎంతని సంపాదించగలం ?"

"డబ్బు తగ్గినా, విలాసాలు అంత మాత్రంలో తగ్గేవి కావు. అయితేమాత్రమేం ? పిల్లలకు కావలసిన పాలడబ్బాలు మొదలైనవి కలవుకదా! స్కూలు కుర్రాళ్ళకి కావలసిన వస్తువులన్నీ ఉన్నవి కదా ! ఏది ఎట్లా ఉన్నా మీరు సొంత తెలివితేటలు ఉపయోగిస్తే, ఎన్నో అవకాశాలు వాటంతట అవే కనిపిస్తయ్. ఈవిషయం చూడండి. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడ్డదన్నా, కృష్ణానదిలో సుడిగుండం వచ్చినదన్నా, మీకు పెద్ద అవకాశం లభిస్తుంది. అ దేమిటో చెప్పగలరా?"

అది మన బుర్రకి అందలేదు.

"బొంగులండీ, బొంగులు! తుపాన్లు వచ్చినా, వరదలు వచ్చినా మొదట దెబ్బతినేవి పూరిళ్ళే కదా! వాటిని మళ్ళీ కట్టటానికి వెదురుబొంగులూ, తాటాకులు కావాలి. అందువల్ల మనం ముందే జాగ్రత్తపడి వాటన్నిటినీ కొని ఉంచితే సరి. ఇట్లాగే పెంకుటిళ్ళకు కావలసిన పెంకులు, కలపకూడా నిలవ చేయాలి."

'అదీ దెబ్బ' అని నేను హుషారుగా అన్నాను.

"ఒకటి అడుగుతాను చెప్పండి. దక్షిణాదిన అగ్నిగుండాలు చెలరేగితే ఏం చేస్తారు ?"

"చింతపండుగింజల్ని కొని నిలవ చేస్తారు."

"ఎందుకని ?"

"జనం ఎక్కువమంది వాటినే తింటున్నారు కనుక. అగ్ని ప్రమాదాలతో ధాన్యం నాశనం కావచ్చును కనుక."

"భేష్ ! అట్లా ఉండాలి. అయితే మీరు ఇంక వెళ్లి సన్నాహాలు ప్రారంభించవచ్చు."

"కాని...నాకొక సందేహం ఉన్నదండీ! ఇవన్నీ మనం చేస్తుంటే పట్టుబడతామేమో ?"

"ఆ భయం అక్కర్లేదు. ఒకటిమాత్రం చేయండి. అమ్మకాలూ, లావాదేవీలు మాత్రం మీరు స్వయంగా జరపొద్దు. ఏ గుమాస్తాగాడినో పెడితే, వచ్చే దెబ్బ వాడి మీదికే వస్తుంది."

"సోషలిస్టులూ, అసలు గాంధేయులు మొదలైనవాళ్ళు పికెటింగు జరుపుతారటగా !"

"ప్రమాదమేమీ లేదు. మనం నిజంగా బ్లాక్ మార్కెట్ జరుపుతున్నట్లు వాళ్ళకి రుజువు వుంటే సరాసరి రిపోర్టు చేస్తారు. రుజువు లేకుండా పికెటింగు మొదలు పెడితే, మన పరువుకి నష్టం కలిగిస్తున్నట్లు ఆరోపించి, జైళ్లలోకి తోయిస్తాము."

"మారుమూల అడవుల్లో తిరిగే కమ్యూనిస్టుఘటాలే అధికారులను తప్పించుకోలేక పోతున్నారే, అటువంటిది మీ రెవళ్లూ వాళ్లకు చిక్కక పోవటం ఆశ్చర్యంగానే ఉంది."

"స్వయంగా రంగంలోకి దిగిన తరవాత ఆ విషయం మీకే తెలుస్తుంది."

"ఒక సంగతి చూశారూ! వెనకటి మోస్తరుగా తప్పించుకునే అవకాశాలు కనిపించటం లేదు. ఈ మధ్య చాలా చోట్ల బ్లాక్ మార్కెట్ వాళ్ళని అరెస్టు చేయటమే కాక సంకెళ్ళతో రోడ్లవెంబడి నడిపిస్తున్నారట."

"హుం! మేమేనా తక్కువ తిన్నది? బ్లాక్ మార్కెట్ నిరోధం ప్రాథమికహక్కులకే భంగం కలిగిస్తున్నదని సుప్రీంకోర్టుకి వెళ్లబోతున్నాము."

"అది ఎట్లా నిలుస్తుంది?"

"ఎట్లా నేమిటి? రాజ్యాంగంలో ఆస్తి హక్కు, వృత్తిహక్కు ఇవ్వబడ్డవి. ఇష్టం వచ్చిన సమయంలో సరుకును కొని, ఇష్టం వచ్చిన ధరలకు అమ్మటమే వ్యాపారం అంటే. దానిని ఆటంకపరచటం ప్రాథమిక హక్కులను తోసివేయటమే కదా."

"మీరు చెప్పింది బాగానే ఉందండీ, అయినా, సుప్రీంకోర్టు ఎట్లా తీర్పు చెపుతుందో—

"అంతటితో ఆగుతామా? సుప్రీంకోర్టు మాకు వ్యతిరేకిస్తే యు. ఎన్. ఓ. కి— అంటే ఐక్యరాజ్యసమితికే వెడతాం. అంతర్జాతీయ న్యాయసమ్మతమయి. ప్రపంచాభివృద్ధికి మూలకారణమయిన స్వేచ్ఛా వ్యాపారానికి 'బ్లాక్ మార్కెట్' అన్న పేరుతో వర్ణదోషం అంటగట్టి, వాణిజ్య వర్గాన్ని నిర్మూలించటానికి భారత ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపిస్తాం. అంటే జనహత్య, వర్ణవివక్షత, మానవ హక్కుల అపహరణ అనే ఆరోపణలను చేస్తాం. అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్‌లు సమితిలో ఉన్నంత వరకూ మనకు ఢోకా లేదు."

ఆ తెలివితేటలకు నాకు గుక్క తిరగలేదు. ఇటువంటి అహిరావణుడి సహాయం ఉంటే తక్కువేమిటని ఆయనకు ఒక నమస్కారం పడేసి, పజిల్సు వాళ్లదగ్గరనుంచి టెలిగ్రాం వచ్చిందేమో కనుక్కొనేందుకు పోస్టాఫీసుకి పరుగెత్తాను.

కాని ఎవరికయినా మొహాన రాసిపెట్టి ఉంటే పోద్దూ? చివరకు నాకు ప్రైజు హుళక్కి అయింది. ఇంత దివ్యమైన పథకాన్ని ఉపయోగించుకునే సత్తా నాకు లేనే లేదు. కదా, డబ్బు చేతిలో ఆడుతున్నవాళ్లయినా ఉపయోగించుకుంటారేమో నన్న ఉద్దేశంతో ప్రకటిస్తున్నాను.



బొమ్మరిల్లు

<u>పాట:</u>


దసరాపండగ

"రాజేశ్వర్"

★

వచ్చిందమ్మా వచ్చింది
దసరాపండగ వచ్చింది.
అప్పు చేసుకుని, అరువు తెచ్చుకుని,
ఆనందంగా పాటలు పాడుతు,
తింటా మెన్నో పిండివంటలూ,
కడతా మెన్నో కొత్తబట్టలూ.
ఆరౌన్సులకూ రేషన్ తగ్గెను.
పన్నులు బాగా పెరిగిపోయెనూ.
వరదలు వచ్చి, తుపాను లొచ్చి,
పండిన పంటలు మునిగిపోయెనూ,

వచ్చిందమ్మా వచ్చింది,
దసరా పండుగ వచ్చింది,
రైళ్ళకి రైళ్ళూ పడ్డాయీ,
జైళ్ళకి జైళ్ళూ సండాయీ,
పేదలు తిండికి మాడారూ,
పాలడబ్బాల్ మాయంకాగా,
పాపలు పాలకి ఏడ్చారూ,
వచ్చిం దమ్మా వచ్చింది,
దసరా పండగ వచ్చింది.



"టామ్!"

జవాబు లేదు.

"టామ్!"

జవాబు లేదు.

"ఏ డేమైనట్టు? ఒరే, టామ్!"

జవాబు లేదు.

ముసలావిడ కళ్ళజోడు ముక్కు చివరకి లాగి వాటిమీదుగా గది అంతటా కలయచూసింది. తరవాత కళ్ళజోడు పైకి లాగి వాటికిందుగా చూసింది. కుర్రాడంటి చిన్న వస్తువు కోసం కళ్ళజోడులోంచి చూడటం ఆవిడకి అలవాటు లేదు. అయినా అవి అలంకారార్థం కళ్ళజోడు గాని, అవసరానికి కళ్ళజోడు కాదు. దాన్లోంచి చూసినా ఒకటే, రెండు చిల్లపెంకుల్లోంచి చూసినా ఒకటే. ఆవిడ కాస్సేపు విస్తుపోయినట్టు కనబడి, తరవాత, కుర్చీలకీ, బల్లలకీ వినిపించేలాగా, "ఈసారి దొరకవ్వా, అప్పుడు నీపని—"

ఆవిడ మంచంకింద గడచీపురుతో పొడవడంకోసం వంగటం చేత మాట మధ్యలో ఆపవలిసి వచ్చింది. మంచంకిందినుంచి పిల్లి మాత్రమే పైకొచ్చింది.

"ఈ వెధవ అంతు తేలకుండా ఉంది."

ఆవిడ పెరటివాకిలిదగ్గిరికి పోయి దొడ్లో పాదులన్నీ పరీక్షించింది. టామ్ లేడు. అందుకని ఆవిడ గొంతెత్తి, బాగా దూరం వినిపించేలాగ, "ఒరే-ఏ-ఏ, టామ్!" అని కేకపెట్టింది.

తనవెనక అలికిడి కాగా ఆమె వెనక్కు తిరిగి, పారిపోబోతున్న కుర్రాణ్ణి కాస్తా పట్టేసింది.

"అలమారుమాట తట్టనేలేదు, ఏం చేస్తున్నావందులో?"

"ఏం లేదు."

"ఏం లేదూ! నీ చేతులు చూడు. మూతి చూడు. ఏమిటది?"

"నాకు తెలీదు, పెద్దమ్మా."

"నాకు తెలుసు. వెన్న—తెలిసిందా. దానిజోలికి పోతే తాట వొలుస్తానని నలభైసార్లు చెప్పా. ఆ బెత్తం ఇలా తే."

బెత్తం మీదపడటానికి సిద్ధంగా ఉంది.—

"అమ్మో, నీ వెనక ఏమిటి, దొడ్డమ్మోయ్?"

ముసలావిడ కంగారుపడి వెనక్కు తిరిగేసరికి కుర్రాడు ఒక్క పరుగు తీసి, పిట్టగోడ మీదుగా దూకి మాయమైనాడు. ఆవిడ నవ్వింది.

"వీడి కదుపుడకా! నా తెలివి తగలడ్డట్టే ఉంది. ఎన్నిసార్లు వాడు టోకరా ఇచ్చినా మళ్లీ మళ్లీ మోసపోతూనే ఉంటా. అయినా ఒకసారి వేసిన ఎత్తు మరోసారి వెయ్యడుగా. నన్నెట్లా ఏడిపించాలో వాడికి సరిగ్గా తెలుసు. ఒక్క క్షణం ఏమరుపాటున ఉండి నవ్వితినా చెయ్యి చచ్చుపడుతుందాయె. కొట్టకపోతేనేమో మకురుతనం నేర్చి ఎందునా కాకుండా పోతాడాయె. కొడదామన్నా, పిచ్చివెధవ, తల్లిలేనివాడే అనిపిస్తుంది. కొట్టకపోతే రేపు పని చేయించాలి. శనివారంనాడు పిల్లలందరూ ఆడుకుంటూంటే వాడు పని చేస్తాడూ? అసలే పనికి మొండి. చూస్తూ ఊరుకుంటేనేమో

"చెడిపోతాడు," అనుకున్న దావిడ.

టామ్ రోజల్లా ఆడుకుని కులాసాగా గడిపి ఇంటికి వచ్చాడు. వాడింటికి వచ్చేసరికి నీగ్రో కుర్రాడు జిమ్ రేపటికని పేళ్లు పగలేస్తున్నాడు. టామ్ జిమ్‌కు తోడు పడ్డాడు. తోడు పడటమంటే మూడువంతులు పని జిమ్‌ను చెయ్యనిచ్చి తాను రోజల్లా చేసిన పనులనుగురించి వాడికి కబుర్లు చెప్పాడు. టామ్ తమ్ముడు సిడ్ (సొంత తమ్ముడు కాదు) తనవంతు పని పూర్తి చేశాడు. వాడు నెమ్మదైనవాడు.

టామ్ అన్నం తింటూ, వాలు దొరికినప్పుడల్లా పంచదార చాటుగా బొక్కుతూఉన్న సమయంలో పెద్దమ్మ పోలీ, టామ్‌ను పట్టుకోవటానికని ఎంతో యుక్తిగా ప్రశ్నలు వేసింది.

"ఇవాళ బళ్లో చాలా వేడి అనిపించింది కాదూ?"

"అవును, పెద్దమ్మా."

"వడగొట్టింది కాదూ?"

"అవును, పెద్దమ్మా."

"నువ్వు ఈతలకు పోలేదా, టామ్?"

టామే ఉలికిపడ్డాడు.

"లేదు, పెద్దమ్మా."

ముసలావిడ టామ్-షొక్కా ముట్టుకు చూసింది

"నా వొళ్లేమంత వేడిగా లేదే?"

టామ్ తానున్నది ఊహించి, ముందుగానే. "ఒకళ్లమీద ఒకళ్లం నీళ్లు చల్లుకున్నాం. తల చూడు, ఇంకా తడిగానే ఉంది, అన్నాడు.

తల తడిసి ఉండటంవల్ల ముసలావిడ పశ్చాత్తాపపడ్డది. ఆవిడకింకో ఆలోచన తట్టింది.

"ఒకళ్ల నెత్తిన ఒకళ్లు నీళ్లు చల్లుకుంటే చొక్కా ఊడదీయక్కర్లేదుగా? నీ కాలరు అంటగుట్టానే, సరిగా ఉందో లేదో చూపించు!" అన్న దావిడ.

టామ్ చూపించాడు. చొక్కా కాలరు కుట్టేఉన్నది.

"సరే, పద. గొట్టికాయలాడి ఈతలు కొట్టావేమో అనుకున్నా. నీతో చిక్కేమిటంటే నువ్వు పైకి కనపడ్డంత చెడ్డవెధవ్వు కావు-- ఈ తడవ."

టామ్ ఈసారన్నా సరిగా ప్రవర్తించినందు కావిడ కొంత సంతోషించింది.

"నువు తెల్లదారంతో వాడి చొక్కా అంటగుట్టావేమో. ఇప్పుడు నల్లదారం ఉంది; అన్నాడు సిడ్.

"అవును. తెల్లదారంతోనే కుట్టా, టామ్!"

కాని టామ్ అక్కడ నిలవలేదు. వాడు బయటికి పోతూ," ఒరే, సిడ్, నీ తాటఒలుస్తా! అన్నాడు.

టామ్‌దగ్గర రెండు సూదులున్నాయి. ఒకదానికి తెల్లదారమూ, మరోదానికి నల్లదారమూ ఉండనే ఉన్నది. కాని పెద్దమ్మ పోలీ ఎప్పుడే దారం పెట్టికుట్టినదీ వాడికి సరిగా జ్ఞాపకం ఉండదు

టామ్ బుద్ధిమంతుడు కాడు. గ్రామంలో కల్లా బుద్ధిమంతుడనిపించుకున్న కుర్రాణ్ణి చూసి వాడు ఏవగించుకునేవాడు.

పెద్దవాళ్లకు వాళ్ల కష్టాలెటువంటివో, టామ్‌కు వాడి కష్టాలూ అటువంటివే. కాని ఇప్పుడు వాడికొక కొత్త విద్య అభ్యసించవలసి ఉండటంచేత వాటిని మరిచిపోయినాడు. ఆ విద్య ఏమిటంటే ఈల వెయ్యటం. టామ్‌కు ఎవరో నీగ్రోవాడు ఈలవెయ్యటం నేర్పించాడు. ఈ విద్యను టామ్ సావధానంగా అభ్యసించాడు. త్వరలోనే వాడికది పట్టుపడింది. టామ్ వీధివెంట ఈల పాడుకుంటూ వెళ్లాడు.

వేసవికాలం. ఇంకా చీకటిపడలేదు. కొంతదూరం వెళ్లి టామ్ ఈలవెయ్యటం ఆపాడు. వాడి ఎట్టఎదురుగా ఒక కొత్త కుర్రవాడు, వాడికన్న కొంచెం పెద్దవాడు కనిపించాడు. కుగ్రామమైన సెయింట్ పీటర్స్‌బర్గు ప్రజలను కొత్తవాళ్లు వెంటనే ఆకర్షిస్తారు. అందులో ఈ కుర్రవాడు, ఆదివారం కాకపోయినా, మంచి దుస్తులు వేసుకుని ఉన్నాడు. ఈ కుర్రవాడి నెత్తిమీద అందమైన టోపీ ఉన్నది. మెరిసే నీలంకోటూ, పంట్లామూ, కాళ్లకి బూట్లూ వేసుకున్నాడు. అందమైన నెక్‌టై పెట్టుకున్నాడు. వాడి బస్తీవాలకం చూసి టామ్ దహించుకుపోయినాడు. వాణ్ణి చూస్తున్నకొద్దీ తన దుస్తులు చాలా కుళ్లువిగా తోచసాగాయి.

ఇద్దరూ ఒకరి కొకరు ఎదురుగా నిలబడి చాలాసేపు మౌనంగా చూసుకున్నారు.

చివరకు టాం, "నిన్ను పచ్చడి చెయ్యగలను" అన్నాడు.

"చెయ్యి చూద్దాం; అన్నాడు కొత్తకుర్రాడు.

'టామ్‌సాయర్' పిల్లల నవల ఈవారంనుంచి ప్రతివారం బొమ్మరిల్లు శీర్షికక్రింద ప్రచురించబడుతోంది. ప్రపంచవిఖ్యాత హాస్య నవలారచయిత మార్క్‌ట్వేన్ బాల్య మనస్తత్వాలకు సంబంధించి వ్రాసిన ఈ నవల పిన్నలకూ పెద్దలకూ కూడా మనోరంజకంగా ఉండగలదు.

చందు యొక్క సాహసకృత్యములు



"కావాలంటే చెయ్యగలను."

"చెయ్యలేవు."

"నాచాత నవును."

"కాదు."

కొంచెం సేపు ఆగి టామ్, "నీ పేరేమిటి?" అన్నాడు.

"నాపేరుతో నీకేం పని?"

"ఏం పనా? చెబుతా."

"చెప్పు చూద్దాం."

"అలా అన్నావంటే చూపిస్తా."

"అలా-- అలా- అలా! ఏం?"

"చాలా గొప్పవా ణ్ణనుకుంటున్నావే, ఒక్క చేత్తో కిందపడెయ్యగలను. జాగర్త."

"పడెయ్యగల నంటావుగాని పడెయ్యవేం?"

"కోపం తెప్పించావంటే ఊరుకునేది లేదు?"

"ఇటువంటివాళ్లని చాలామందిని చూశాం."

బడాయిఖోర్!"

"నువ్వే బడాయిఖోర్!"

"కొడతాట్ల మొనగాడు."

"పద పద."

"అలా మాట్లాడావంటే పెణత ఊడిపోగల్దు."

"కాదు మరి!"

"అంతపనీ చేస్తా."

"చేస్తానంటావు చెయ్యవేం? పిరికి!"

నే నేం కాదు."

"అవును."

కాదు."

"నువ్విక్కణ్ణుంచి వెళ్లిపో."

"నువ్వే పో."

"నే నేం పోను."

"నూ పోను."

ఇద్దరూ మెల్లిమెల్లిగా దగ్గిరికి వచ్చి భుజానికి భుజం పెట్టి నెట్టుకోవటానికి ప్రయత్నించారు. ఇద్దరూ మళ్లీ కాస్త వెనక్కు తగ్గారు.

"నువ్వు పిరికిపందవి. మా అన్నయ్యతో చెప్పానంటే నిన్ను చిటికెనవేలితో కొట్టేస్తాడు. అన్నాడు టామ్.

"మీ అన్నయ్యయితే భయమనుకున్నావా? నాకు అంతకన్నా పెద్ద అన్నయ్యే ఉన్నాడు. మీ అన్నయ్యను ఎత్తి గోడమీదిగా పారేస్తాడు.

ఇద్దరికీ అన్నలు లేరు.

"వచ్చి అబద్ధం."

"నువ్వనగానే సరా?"

టామ్ నేలమీది మట్టిలో కాలి బొటనవేలితో గీత గీసి, గుండెలుంటే అది దాటి రా. ప్రాణం తీసేస్తాను. గెలవలేని కుక్కా! అన్నాడు.

వెంటనే రెండోవాడు గీత దాటి "ఏం చేస్తావో చెయ్యి. చూద్దాం!

"వొళ్లు జాగర్త, తన్నులు తినగలవు."

"చేస్తానంటావుగాని చెయ్యవేం?

ఇద్దరు కుర్రాళ్లూ కలియబడ్డారు. ఒకరి నొకరు గుద్దుకున్నారు, రక్కుకున్నారు, తన్నుకున్నారు, మట్టిలో పొర్లాడారు. దుమ్ము లేచింది. ఆఖరుకు టామ్ రెండోకుర్రాడి గుండెమీద ఎక్కి కూచుని గుండెల మీద రెండు చేతులా బాదుతూ, "చాలు అను." అన్నాడు.

రెండోవాడు తప్పించుకోవటానికి ప్రయత్నిస్తూ కోపంకొద్దీ ఏడిచాడు

"చాలు అను," అన్నాడు టామ్ గుండెలమీద గుద్దుతూ.

చివరకు రెండో కుర్రాడు "చాలు," అన్నాడు.

టామ్ వాణ్ణి లేవనిచ్చి, జాగర్త ఒళ్లు దగ్గిరపెట్టుకు నుండు ఎవరితో మాట్లాడుతున్నదీ తెలుసుకు మాట్లాడు." అన్నాడు.

రెండోకుర్రాడు లేచి, మన్ను దులుపుకుని, ఏడుస్తూ, మధ్యమధ్య వెనక్కు తిరిగి చూసి, ఈసారి దొరికితే ఏం చేస్తానో చూడమని టామ్‌ను బెదిరిస్తూ వెళ్లిపోయినాడు. టామ్ వాణ్ణి లేవిడీ కొట్టి ఉత్సాహంతో బయలుదేరాడు. టామ్ వీపు కనిపించగానే రెండోకుర్రాడు రాయి తీసి, టామ్‌గూళ్లమధ్య తగిలేటట్టు కొట్టి తోక ముడిచి పరుగు తీశాడు. టామ్ ఆ ద్రోహివెంట పడి వాడి ఇల్లు తెలుసుకున్నాడు. శత్రువు బయటికి వస్తాడేమో నని టామ్ వాకిలి దగ్గిర కొంతసేపు కాపలా కాచాడు. కాని శత్రువు బయటికి రావటానికి బదులు కిటికీలోనుంచి వెక్కిరించసాగాడు. ఇంతలో శత్రువుతల్లి బయటికి వచ్చి టామ్‌ను నానాతిట్లూ తిట్టి వెళ్లిపొమ్మంది.

టామ్ చాలా పొద్దుపోయి ఇంటికి వెళ్ళి కిటికీలోకుండా చలీ చప్పుడూ కాకుండా ఎక్కి, తన కోసం కనిపెట్టకుని ఉన్న పెద్దమ్మకు దొరికిపోయినాడు. అవతారం చూడగానే ఆవిడ మర్నాడు వాడిచేత వెట్టిపని చేయించాలని నిశ్చయించుకున్నది.

2

మర్నాడు శనివారం ఉదయం

బొక్కెన (బాల్చి)లో తెల్లరంగూ, చేతిలో పొడుగుపాటి కర్రగల కుంచే తీసుకుని టామ్ చక్కల గోడకు రంగువెయ్యటానికి హాజరైనాడు. 30 గజాల పొడుగూ, తొమ్మిది అడుగుల ఎత్తూ గల ఆ గోడ చూడగానే టామ్‌గుండె జారిపోయింది జీవితం నిరర్థకమని పించింది. ఒక నిట్టూర్పు విడిచి వాడు కుంచె బొక్కెనలో ముంచి గోడపైవార చెక్కవెంబడి రంగు పూశాడు. ఈవిధంగా నాలుగైదు చక్కలకు రంగు పూశాడు. మొత్తం గోడలో రంగుపూసినమేర చూస్తే సముద్రంలో కాకిరెట్టలాగా ఉన్నది. అది చూసి నిరుత్సాహం చెంది వాడు చతికిలబడ్డాడు.

ఇంతలో జిమ్ వీధిపంపునుంచి నీళ్లు పట్టకురావటానికని జిమ్ బొక్కెనతో పాటపాడుకుంటూ బయటికి వచ్చాడు. పంపునుంచి నీళ్లుపట్టుకురావటంలో ఆనందం ఉన్నదని టామ్ అదివరకెన్నడూ అనుకోలేదుగాని ఇప్పుడనుకున్నాడు. అక్కడ చాలామంది ఆడపిల్లలూ, మగపిల్లలూ ఉంటారు. పిల్లలమధ్య ఆటవస్తువులమారకమూ, ఆటలూ, పోట్లాటలూ, అల్లరీ, అగమూ జరుగుతూంటాయి. పంపు 150 గజాల దూరంలోనే ఉందిగాని, అక్కడికి వెళ్లితే జిమ్ గంటకులోపుగా ఎన్నడూ రాడు.

"ఒరే, జిమ్. నువ్వు కాస్త రంగువేసేట్టయితే నే వెళ్లి నీళ్లు పట్టుకొస్తా," అన్నాడు టామ్.

"లేదు, టామ్‌దొరా. అమ్మగారు నన్నే నీళ్లు తెమ్మంది. నువ్వు తెస్తానంటావని కూడా అన్నది. నన్ను రంగుజోలికి పోవద్దన్నది."

"ఆవిడ అట్లాగే అంటుందిలే జిమ్. బొక్కెన ఇచ్చెయ్యి. క్షణంలో వస్తా. ఆవిడకు తెలీను కూడా తెలియదు."

"అమ్మో, అమ్మగారు గొంతు పిసికేస్తుంది."

"ఆవిడేం కొడుతుందిరా. నెత్తిన మొట్టుతుంది. మొట్టనీ! జిమ్, నీకు భలేదిస్తా. తెల్లగోలీ ఇస్తా."

జిమ్ చలించాడు.

"తెల్లగోలీ, జిమ్! మంచి బిళ్లేర్ గోలీ," అన్నాడు టామ్.

"బిళ్లేర్ గోలీయే, అమ్మో! మరి అమ్మగారంటే భయంగా ఉంటే—"

"నువొప్పుకున్నావంటే నాచిటికిన కాలివేలుకూడా చూడనిస్తా."

జిమ్ లొంగిపోయాడు. బొక్కెన కింద పెట్టి, గోలీ తీసుకుని, టామ్ కాలికట్టు విప్పుతుంటే శ్రద్ధగా చూడసాగాడు. మరుక్షణమే వాడు బొక్కెన తీసుకుని వీధివెంట పరుగెత్తటం మొదలుపెట్టాడు. టామ్ చకచకా చెక్కగోడకు రంగు వెయ్యసాగాడు. పెద్దమ్మ పోలీ

(33-వపేజీ చూడండి)



పువ్వులమ్మా

శ్రీ [illegible]

పువ్వులువ్వాయ్, పువ్వులూ -
పువ్వులమ్మా, పువ్వులూ.
మల్లెపువ్వులు, మొగలిపువ్వులు,
మాలతీ, మందారపువ్వులు,
పువ్వులోయ్ పువ్వులూ -
పువ్వులువ్వాయ్ పువ్వులూ.

ఎవ్వ రెరగని తోటనుంచీ
పువ్వు లెన్నో కోసి తెచ్చా.
పువ్వులోయ్ పువ్వులూ -
పువ్వులమ్మా పువ్వులూ.


బాట చివ్వర కోటలో ఒక
చోట చక్కని తోట వున్నది.
తోటలోపల పూట పూటా
పాట పాడే పిట్ట లున్నయ్.

చెట్టుచెట్టుకు పోయి పిట్టలు
చిట్టి పాటలు పాడగానే
పాటలన్నీ పువ్వులై ఆ
తోటనిండా విరగ బూస్తాయ్.
పువ్వు లువ్వాయ్ పువ్వులూ -
పువ్వులోయ్ పువ్వులూ.

సన్నజాజులు, బొండుమల్లెలు,
సాటి లేని గులాబిగుత్తులు,
ఘుమ్ము ఘుమ్మను బొగడదండలు,
కమ్మ కమ్మని కొమ్మసంపగి,
పువ్వు లున్నయ్ పువ్వులూ -
పువ్వు లువ్వాయ్ పువ్వులూ.



కథల కామయ్య:



ఒకరోజున మా కామయ్య బువ్వ తినొస్తానని యింటికి వెళ్లి చాలా ఆలస్యంగా వచ్చాడు. ఈలోగా మేము మా నాన్నగారిని కథలు చెప్పమన్నాం. మా నాన్నగారు "నాకు కథలు రావురా." అన్నారు. ఏ కథయినా సరే, ఆఖరికి బుల్లికథ యినా చెబితేగాని వీల్లేదన్నాం.

సరే నస, మా నాన్నగారు చెప్పారు. "అనగనగా ఒక రాజు. ఆ రాజుకి ఏడుగురు కొడుకులు. ఏడుగురు కొడుకులూ వేటకి వెళ్లారు... అని చెబుతుండగా మా చెల్లాయి లేచి, "మాకీ కథ తెలుసు. ఏడుగురు కొడుకుల కథ ఎవరికి తెలియ దేమిటి?" అని గుని సింది.

"పోనీ, ముగ్గురుకొడుకుల కథ చెబుతాను వినండి. అనగనగా ఒక రాజుకి ముగ్గురు కొడుకులు. ముగ్గురు కొడుకులూ ఒకరోజున వేటకెళ్లి మూడు చేపలు తెచ్చారు...." ఇంకా చెప్పబోతుండగా చెల్లాయి మళ్లీ లేచి, "ఊ ఆ కథే మార్చి చెబుతున్నావు. మాకీ కథ వద్దు." అంది.

"బాగానే వుందే. ఏడుగురు కొడుకుల కథా వద్దు, ముగ్గురు కొడుకుల కథా వద్దంటే ఇం

కేం చెప్పను?" అన్నారు నాన్న గారు.

"ఇంకేదైనా సరే, మంచి, బుల్లి కథ చెప్పు." అంది చెల్లాయి.

"చీమంత చిన్న కథ చెప్పనా?"

"చెప్పు, చెప్పు." అని చెల్లాయి ఆత్రంగా అంది.

"అనగనగా ఒక చీమ. ఆ చీమకి ఏడు కొడుకుచీమ లున్నాయి. ఆ ఏడు చీమలూ వేటకి వెళ్ళి ఏడు చేపలు తెచ్చాయి. ఆ చేపల్ని ఎండబెట్టాయి. కాని దుబ్బు అడ్డం వచ్చింది...."

ఈసారి చెల్లాయికి కోపం బాగా వచ్చింది. "ఛో, పిచ్చినాన్న! మాకు కథలు చెప్పక్కర్లేదు, ఏమ క్కర్లేదు. అసలు నీకు కథలు వస్తేగా?" అంది.

"ఆ సంగతి నేను మొదటే చెప్పలా?" అన్నారు, నవ్వుతూ నాన్నగారు.

ఇంతలోకే కామయ్య వచ్చాడు. మే మిద్దరం వాడిమీది కెగబడ్డాం "కథలు, కథలు" అంటూ. కామయ్య మా పక్కలదగ్గిరే చతికి లబడి మంచి కథ చెప్పాడు.

"అనగనగా ఒక ఊళ్లో ఒక బీద రైతు వుండేవాడు. ఆ రైతుకి ఒక్కడే కొడుకు. ఆ కొడుకు బాగా పెద్దవా డయ్యాక "నాన్నా!



నాన్నా! మనం ఎన్నాళ్లని ఇల్లా దరిద్రంతో బాధపడతాము. నేను పట్నంపోయి డబ్బు సంపాదించుకువస్తాను అన్నాడు. తండ్రి సరేనని కొడుకుని పంపాడు.

"ఆ అబ్బాయి పేరేమిటి?" అంది చెల్లాయి.

"ఆ అబ్బాయిపేరు..." అని కామయ్య కాస్సేపాలోచించి, "అతని పేరు రాఘవయ్య" అన్నాడు. రాఘవయ్య ఒక పెద్ద పట్నం పోయి అక్కడ ఏడాదిపాటు పనిచేసి డబ్బు సంపాదించాడు. ఇక ఇంటికి వెళ్లి తండ్రినీ, తల్లినీ సుఖపెడదాము, అనుకుని తన వూరికి బయల్దేరాడు. దోవలో ఒకచోట ఒక కాళికాలయం కనిపించింది. సరే, యీ రాత్రికి యిక్కడ బసచేద్దాం, అనుకుని అక్కడ ఆగాడు.

రాత్రిపడింది. రాఘవయ్యకి ఆకలేసి తెచ్చుకున్న అన్నంమూట విప్పి తినబోతున్నాడు. ఆ రోజున కాళికాదేవికి ఎక్కడా ఆహారం దొరకలేదు. ఆకలితో నకనకలాడుతూ గుడికి వచ్చింది. గుళ్లో రాఘవయ్య అన్నంతినబోతూవుండడం చూసి ఒక ముసలిదానివేషంలో వచ్చి, అబ్బాయీ! నాకూడా కాస్త అన్నం పెట్టు." అంది.

రాఘవయ్యదగ్గర అన్నం కొంచెమే వుంది. కాని అతను దయగలవాడవటంచేత "నేను అన్నం మానేస్తాను. నువ్వు తిను యిది." అని కాళికాదేవికి అన్నంపెట్టాడు. కాళికాదేవి రాఘవయ్య మంచితనానికి సంతోషించి, అన్నం తిన్నది. తరవాత నిజరూపంతో రాఘవయ్యకి ప్రత్యక్షమైంది. రాఘవయ్య కాళికి దండంపెట్టాడు. కాళిక "నీ కేం కావాలో కోరుకో- మూడు వరాలిస్తాను." అన్నది.

రాఘవయ్య, "నాకు గురితప్పని విల్లు బాణం, నవ్వించే పిల్లంగోరు, ఎవరూ కాదనలేని మాట" ఇమ్మన్నాడు. కాళికాదేవి ఆ మూడు వరాలు ఇచ్చింది.

రాఘవయ్య ఆ రాత్రి అక్కడే నిద్రపోయి తెల్లవారి బయల్దేరి ఒక వూరు చేరుకున్నాడు. దూరంగా ఒక మేకపిల్ల కనిపించింది. విల్లు, బాణం ఎలా పనిచేస్తాయో చూడాలనుకుని విల్లు లాగి బాణంవేశాడు. వంకరటింకరగా వేసినా బాణం పోయి మేకపిల్లకు గుచ్చుకుని అది చచ్చింది. రాఘవయ్య దగ్గిరికి పోయి మేకపిల్లను చూస్తున్నాడు. ఇంతలోకే గొల్లవాడు పరిగెత్తుకుంటూ వచ్చి,

"అయ్యో, నా మేకపిల్లని చంపేశావు. చూడు నిన్నేం చేస్తానో." అని కలియబడ్డాడు. వెంటనే రాఘవయ్య పిల్లంగోరు వూదటం మొదలుపెట్టాడు. పిల్లంగోరుపాట గొల్లవాడికి కితకితలు పెట్టి, వాడు నవ్వడం ప్రారంభించాడు. ఒకటే నవ్వు. పిల్లంగోరు వూదుతున్నంత సేపూ నవ్వుతూనేవున్నాడు. దగ్గిరికి రాలేడు. పైకీ కిందికీ వంగుతూ, కిందబడి దొర్లుతూ, ఎంత సేపూ నవ్వే. నోరు నొప్పెట్టింది. కడుపు పగిలేటట్టుంది. గొల్లవాడు అలిసిపోయాడు. "బాబో, నన్ను రక్షించు." అని పడిపోయి నవ్వుతున్నాడు.

అప్పటికి రాఘవయ్య పిల్లంగోరు ఆపాడు. గొల్లవాడు లేచి వెనక్కి తిరిగిచూడకుండా ఊళ్లోకి పారిపోయాడు. జరిగిన సంగతంతా మునసబుగారితో చెప్పాడు. మునసబుగారు పదిమంది మనుష్యులను పంపించాడు. వాళ్లు వెనకపాటుగా వచ్చి రాఘవయ్యని వాటేసుకుని పిల్లంగోరు, విల్లు, బాణం ఊడలాక్కుని, చేతులు కట్టేసి మునసబుగారి వద్దకు ఈడ్చుకెళ్లారు.

అన్యాయంగా గొల్లవాడి మేకని చంపినందుకు, వాడిని అంత సేపు నవ్వించి బాధపెట్టినందుకు రాఘవయ్యకు మొత్తం వంద కొరడా దెబ్బలు కొట్టమని మునసబుగారు వెట్టివాళ్లతో చెప్పారు. ఇద్దరు వెట్టివాళ్లు పొడుగాటి కొరడాలు పుచ్చుకుని తయారయ్యారు. చుట్టూ బోలెడుమంది జనం పోగయ్యారు.

రాఘవయ్య నవ్వుతూ నిలబడ్డాడు. "ఒక్కసారి పిల్లంగోరు యిప్పించ" మని అడిగాడు మునసబుని. మునసబుగారు తనదగ్గిరే వున్న పిల్లంగోరుని రాఘవయ్యకివ్వబోయాడు. కాని గొల్లవాడు ఆదరాబాదరా అడ్డం వచ్చి,

"బాబోయ్, మునసబుగారూ! ఆ పిల్లంగోరునుమాత్రం వాడి చేతికివ్వకండి. మనని చచ్చేదాకా నవ్విస్తాడు." అన్నాడు.

రాఘవయ్య "పిల్లంగోరు ఇవ్వవయ్యా, మునసబూ!" అని మళ్లీ అడిగాడు. రాఘవయ్యకి ఎవరూ కాదనలేనిమాట వరం వుందిగా. మునసబుగారికి లోపల ఇష్టం లేకపోయినా వరప్రభావంవల్ల పిల్లంగోరు యివ్వక తప్పిందికాదు.

ఇక చూసుకోండి. రాఘవయ్య పిల్లంగోరు వూదాడు. కితకితలు పుట్టి అందరూ నవ్వటం మొదలెట్టారు. ముందు నెమ్మదిగా, తరవాత జోరుగా పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వాగు. మునసబుగారు మట్టిలో పొర్లాడుతూ కడుపు చేత్తో పట్టుకుని అదే నవ్వు, అదే నవ్వు. రాఘవయ్య ఇంకా బిగ్గిరిగా వాయించాడు. ఊళ్లో ఆ ధ్వని వినిపించిన ప్రతివాడూ ఎందుకో తెలియకుండా నవ్వటం మొదలెట్టారు. నాలుగ్గంటలసేపు రాఘవయ్య పిల్లంగోరు వాయించాడు. ఈలోగా కొందరికి మూర్ఛ వచ్చేసింది. మూర్ఛలోనే నవ్వుతున్నారు.

రాఘవయ్య చివరికి పిల్లంగోరు ఆపాడు. మునసబుగారు నీరసంగా "నీదారిని నువ్వు పో కుర్రాడా!" అన్నాడు. రాఘవయ్య ఊరికే పోతాడా? వెళ్లేటప్పుడు మునసబుగారిదగ్గిర 2వేల రూపాయలు వసూలుచేసి మరీ పోయాడు.

రాఘవయ్య తన వూరు చేరుకున్నాడు. ఊళ్లో తను చిన్నప్పటినుంచీ ఎరిగిన ఒక అందమైన అమ్మాయి కనిపించింది. అదివరకే రాఘవయ్య ఆ అమ్మాయిని ఎన్నో సార్లు పెళ్లిచేసుకోమని అడిగాడు. కాని ఆ పిల్ల "పెళ్ళిచేసుకోను పో" అనేది.

ఇప్పుడు ఊళ్లోకి వచ్చీరాగానే రాఘవయ్యకి ఆ అమ్మాయి కనిపించింది. "పిల్లా! నన్ను పెళ్లిచేసుకోవూ?" అని అడిగాడు. రాఘవయ్యకి మాటవరం వున్నది. ఆ అమ్మాయి ఇంకేమంటుంది? "ఓ, తప్పకుండా పెళ్లిచేసుకుంటా." అన్నది. రాఘవయ్య ఎగిరి గంతేసి ఇంటికి వెళ్లాడు. ఒకరోజున రాఘవయ్య మహావైభవంగా ఆ పిల్లని పెళ్లిచేసుకుని సుఖంగా వున్నాడు."

ఇటు బంగారం అటు వెండి



ఒక నగరం బయట ఎత్తయిన దిమ్మ మీద ఆ నగరాన్ని పరిపాలించే రాజుగారి విగ్రహం వుంది. అది పాలరాతితో చేసిన విగ్రహం. దాని పక్కన ఒక పెద్ద డాలు నిలబెట్టి వున్నది. అది ఏ లోహంతో చేసిన డాలో ఎవ్వరూ చెప్పలేరు. పొద్దున ఒకమాదిరిగా, మధ్యాహ్నం ఇంకోమాదిరిగా, సాయంత్రం మరోమాదిరిగా ఆ డాలు మెరిసేది.

ఒక రోజున సూర్యుడు ఉదయిస్తున్న వేళ తూర్పుదేశంనుంచి ఒక వీరుడు రాజుగారి కొలువులో ఉద్యోగం సంపాదించాలని ఆనగరం వచ్చాడు. సూర్యుడి లేత గులాబీ పువ్వులాంటి కాంతి డాలు మీదపడుతూ, డాలు బంగారు వర్ణంలో మెరిసిపోతోంది.

"విగ్రహం చాలా బావుంది. కాని ఆ డాలు అంతకంటే బావుంది. ఎంత బంగారం పోతపోసి ఆ డాలు తయారు చేశారో?" అని అనుకున్నాడు వీరుడు.

అదే సమయానికి పడమటి దేశంనుంచి మరొక వీరుడు రాజుగారిదగ్గిర ఉద్యోగం సంపాదించాలని ఆ నగరం చేరుకున్నాడు. అతనూ ఆ విగ్రహంవద్దకే వచ్చి ఆగి, "ఆహా! ఎంత బావుంది యీ విగ్రహం! కాని ఆ డాలు అంతకంటే బావుంది. ఎంత వెండి పోతపోసి దాన్ని తయారుచేశారో?" అని బిగ్గిరగా అనుకున్నాడు.

ఈ మాటలు మొదటి వీరుడు విన్నాడు. "ఏమిటయ్యా, అల్లాగంటావు? డాలు బంగారంతో చేసినట్టు కనపించటంలా?" అని దురుసుగా అన్నాడు.

రెండో వీరుడు, "ఏమయ్యోవ్. కాస్త తగ్గు. ఏది బంగారమో, ఏది వెండో నాకు తెలియదనుకున్నావేమిటి? శుభ్రంగా కనిపిస్తోంది, అది వెండితో చేసిన డాలు అని." అన్నాడు కొంచెం విసురుగా.

శ్రీమతి సీతాదేవి

"ఏమిటి నీ వుద్దేశ్యం? నాకు బంగారమంటే ఏమిటో తెలియదనా?" అన్నాడు మొదటి పెద్దమనిషి.

"నీ వుద్దేశమేమిటి? నేను వెండిని చూడని బైతుననా? అన్నాడు రెండో ఆసామీ.

నేను గుడ్డివాడినని అనుకుంటున్నావా?"

"నాకు కళ్లు లేవనుకుంటున్నావా?"

"ఆ, లేనట్టే వుంది."

"అయితే నువ్వు గుడ్డివాడివే."

"మాటలు జాగ్రత్తగా రానీ."

"వీపు జాగ్రత్త పెట్టుకో."

వాదం ముదిరింది. ఇద్దరూ కత్తులు తీసి కలబడ్డారు. ఖణేల్ మని మోగాయి కత్తులు. 'చూసుకో' నీ పని అంటే 'కాసుకో ఈ దెబ్బ' అంటూ పోట్లాడారు.

ఇంతలోకే రాజుగారు ఊరిబయటకు షికారు వచ్చారు. హోరాహోరిగా పోరాడుతున్న వీరుల నిద్దరినీచూశారు. వాళ్లిద్దర్నీ విడదీసి సంగతేమిటని అడిగారు.

చూడండి మహాప్రభో! ఈ వీరుడు నేను గుడ్డివాడి నన్నాడు." అన్నాడొకడు.

"నాకు కళ్లు లేవంటున్నాడు మహారాజా!" అని రెండోవాడు.

"అసలు సంగతి చెప్పండయ్యా! మీ కీ పోట్లాట ఎందుకు వచ్చింది?" అని రాజుగారు నిగ్గదీసి అడిగారు.

"ఏమీ లేదండి. ఈ డాలు బంగారంతో చేసిందికదా. ఆ పెద్దమనిషి వెండితో చేసిందంటాడు

చూడండి." అని మొదటి వీరు డన్నాడు.

"చూశారా, మహారాజా! పట్టపగలు వెండిని బంగారమంటాడు. ఇతనికి కళ్లున్నాయంటారా?" అని రెండోవీరు డన్నాడు.

"అదిగో మళ్లీ అదేమాటా? నువ్వే గుడ్డివాడివి."

"మళ్లీ అదే కూతా? అదే కూతా అంట." అని ఇద్దరూ మళ్లీ కలబడ్డారు. రాజుగారు ఇద్దరినీ కోప్పడి విడదీసి ఇల్లా గన్నారు.

"మీ రిద్దరూ గుడ్డివాళ్లే. మీకు కళ్లున్నాయి కాని, ఆలోచన, నిదానం లేవు. అవి లేకపోతే కళ్లున్నప్పటికీ గుడ్డివాళ్లే."

ఇద్దరూ తెల్లబోయారు. "అదేమండీ, మీరూ అల్లాగే అంటారు? అని ఇద్దరూ అడిగారు.

"పిచ్చివాళ్లల్లారా! ఈ డాలు బంగారందీ కాదు, వెండిదీ కాదు. ఏ లోహంతో శిల్పి తయారుచేశాడో ఎవ్వరికీ తెలియదు. తూర్పున సూర్యుడు ఉదయిస్తున్నాడు కదా! సూర్యుడి లేత ఎరుపుకాంతి డాలుమీద పడి డాలు బంగారంగా కనిపిస్తున్నది. ఓ రెండో పెద్దమనిషీ! కావలిస్తే ఇటొచ్చి చూడు." అన్నారు రాజుగారు.

రెండో వీరుడు తూర్పువేపుకి వచ్చి చూశాడు. డాలు అచ్చంగా బంగారంలాగ మెరుస్తోంది. అతడు సిగ్గుపడి తలవంచుకున్నాడు. మొదటి వీరుడు గర్వంగా మీసం మెలేశాడు. రాజుగారు అతడిని పిలిచి,

"సూర్యుడు ఉదయిస్తూ కిందగా ఉండటం చేత, ఆ కాంతి డాలు రెండోవేపు పడటంలేదు. అందుకని అటువేపు మామూలుగా తెల్లగానే వుంది. కావలిస్తే ఇటొచ్చి చూడు." అన్నారు.

మొదటివీరుడు పడమటివేపు వెళ్లి చూశాడు. అటువేపు అచ్చంగా వెండిలాగానే వుంది. సిగ్గుపడి తలవంచుకున్నాడు. రాజుగారు ఇద్దరితోనూ ఇల్లాగన్నారు.

"తొందరపడి ఏ విషయాన్నీ నిశ్చయం చెయ్యకండి. ఎందుకంటే ఏవిషయమైనా ఒకవేపు నుంచి చూస్తే నిజంలాగా, మరోవేపు నుంచి చూస్తే అబద్ధంలాగా కనిపిస్తుంది. ఏది నిజమో నిలకడ మీద గాని తెలియదు."

, ఈలోగా సూర్యుడు పైకొచ్చేశాడు. తూర్పు వేపున డాలుకి ఇందాకటి బంగారపురంగూ పోయింది. పడమటివేపున ఉన్న వెండిరంగూ పోయింది.

ఇద్దరు వీరులూ స్నేహితులయ్యారు. "ఏమన్నా, నాతో పోట్లాడేముందు కాస్త ఇటొచ్చి, చూస్తే, ఈ పోట్లాట వుండేది కాదు గదా." అన్నాడు మొదటాయన.

"నువ్వూ పెద్దమనిషివి గదా. కాస్త ఇటొచ్చి చూస్తే ఏం పోయేదీ అంట." అన్నాడు రెండో ఆయన,

రాజుగారు నవ్వుకుని ఇద్దరీని కొలువులోకి తీసుకున్నారు.

18-10-50

చిత్రసమీక్ష

ఎలైడ్ ప్రొడక్షన్స్‌వారి

పరమానందయ్యశిష్యులు

పాటలు, మాటలు తాపీ ధర్మారావునాయుడు.
సంగీతం ఓగిరాల, దక్షిణామూర్తి.
నిర్మాణం, దర్శకత్వం కె. శివరావు.
నటులు: సి. యస్. ఆర్., రేలంగి, రామమూర్తి, కనకం, డి. హేమలత, శివరావు, నాగేశ్వరరావు, లక్ష్మీరాజ్యం ఇమి టేషన్ ఆచారివగైరా.

ఎలైడ్ ప్రొడక్షన్సువారి "పరమానందాయశిష్యులు" 13 వ తేదీన మద్రాసు రాజకుమారీటాకీస్‌లో ప్రత్యేక ప్రదర్శనం ఇవ్వబడింది. ఈ చిత్రం ఇంతకుపూర్వమే విడుదల అయి, బాగా నడుస్తున్నట్టు తెలుస్తున్నది.

"పరమానందాయశిష్యులు" హాస్య చిత్రం. హాస్యనటుడుగా పేరు పొందిన శివరావు స్వయంగా డైరెక్టుచేసి, తయారుచేసిన చిత్రం హాస్య చిత్రం కావటంలో వింతఏమీ లేదు. కాని ఈ చిత్రంలో హాస్యానికి తోడు కొంత సాంఘికతత్వం కూడా జత చేయబడింది. పరమానందాయ శిష్యులు తంత్రాలెరగయని అమాయికులు. అజ్ఞానంచేత అనేక అవకతవకలు చేస్తుంటారు. ఇటువంటి పరమానందాయ శిష్యులు ఈ చిత్రంలో సామాన్యప్రజలకు ప్రతినిధులుగా ఉపయోగించుకోబడ్డారు. వీళ్లకు ప్రతిగా అవతల రాజకీయ కుట్రలూ, నిరంకుశపరిపాలనా, ప్రజాపీడనా చూపబడ్డాయి. ఆ ప్రపంచంలో మంచికి తావు లేదు ఈ పరమానందాయప్రపంచంలో చెడ్డకుతావులేదు పరమానందాయశిష్యులలో అనేక భాషలవారూ, మతాలవారూ కూడా ఉన్నారు పరమానందస్వామి స్వయంగా రామానుజమతం వాడుగా చూపబడ్డాడు.

ప్రేక్షకులను ఆకర్షించేది అచ్చగా పరమానందాయశిష్యులే కాదు; "పరపీడనమే పాపం," "ఇంకొకరిని దోచి తిండితినడం కంటె పస్తులుండి మరణించడం మేలు' మొదలైన నినాదాలు కూడా ఉన్నాయి చిత్రంలో రాజకీయాలను గురించిన ప్రచారమూ, సిద్ధాంతాలూ లేకపోయినా పరమానందస్వామిశిష్యులు ప్రజల నాకర్షించటంలో సందేహం లేదు.

సి. యస్. ఆర్., రేలంగి, శివరావు, రామమూర్తి; కనకం మొదలైనవారు తమతమ పాత్రలను చాలా చక్కగా నటించారు. నాగేశ్వరరావు, లక్ష్మీరాజ్యం నామమాత్రంగా నాయకుడి పాత్రా, నాయికా పాత్రా ధరించినప్పటికీ ఆ పాత్రలకు చిత్రంలో ప్రాముఖ్యం లేదు. వారుకూడా బాగానే నటించారు.

రాజుగారి కొలువులో మల్లుల కొరడా ప్రదర్శనమూ, పరమానందాయశిష్యులు గురువుగారి భార్య చేసిన లడ్లు విషమనుకుని తినటమూ మొదలైన కొన్ని సన్నివేశాలు చాలా నేర్పుతో నడిపింపబడ్డాయి.

ఈ చిత్రంలో పెద్ద లోపం—ఫోటోగ్రఫీగాని, దర్శకత్వంగాని, కథగాని ఒక్కస్థాయిలో నడవకపోవటం. అన్ని హంగులూ లేక అనేక చిక్కులకులోనై తీసిన చిత్రాలలోనే తరుచు ఈ లోపం కనిపిస్తూ ఉంటుంది. ఎలైడ్ ప్రొడక్షన్స్ వారు ఇకముందు తాము తీసే చిత్రాలలో ఈ లోపం రానివ్వరాదు. మంచి అభిరుచులు కలవారికి జుగుప్స కలిగించకుండా, తలనొప్పి కలిగించకుండా, అందరూ చూసి ఆనందించగల చిత్రం తీసినందుకు వారు అభినందనీయులు. "పరమానందాయ శిష్యులు" ప్రజాదరణకు పాత్రమైన చిత్రం.



'ఆట్ల సయ్యాల్లో' నాయిక సగిరె సుష్త్రానా



ప్రతిభావారి "స్వప్నసుందరి"లో జి. వరలక్ష్మి.

దాగిన ద్వేషం

(4-వ పేజీ తరువాయి)

రామనాథం తడబడుతూ చెప్పాడు "సున్నేశ్వర్రావు."

మాధవరావు భయపడుతూ భయపడుతూ మెల్లిగా గదిలో మంచం దగ్గర కెళ్ళాడు. దుప్పటి కంఠంవరకూ కప్పబడివుంది. మనిషి గుడ్లు వెళ్లబెట్టి అలా చూడ్డానికి ఘోరంగా ఉన్నాడు. కత్తి పోటుకి కదల్లేదు మెదల్లేదు ప్రాణాలువిడిచేశాడు కాబోలు. మాధవరావు ఇవతలకొచ్చి తలుపులు చేరవేశాడు, మాట్లాడకుండా కుర్చీలో కూలబడ్డాడు. కమల చేతుల్లో ముఖం దాచుకుంది. రామనాథం క్షణం సేపు నిలబడి ఏదో ఆలోచించి గబగబా వరండా ముందు గదిలోకి వెళ్ళిపోయాడు. చెల్లెలితో గుసగుసలాడి వచ్చి మడత మంచంమీద పడుకున్న సత్యవతిని లేపాడు. గదిలో మరి కొంచెంసేపు గుసగుసలు నడిచాయి. కట్టుబట్టల్తో ముగ్గురూ ప్రయాణమైనారు.

మాధవరావు పిలిచాడు. "ఆగండి. మీతో ఒకమాట చెప్పాలి."

"ఏమో నాకేమీ తెలియదు, మేమీ కొంపలో ఒక్క క్షణం నిలిచేది లేదు. ఇదంతా ఏదో మాయగా జాలంలాగుంది. మేం ఇక్కడుంటే దబ్బుకోలేము. పోతున్నాం" అన్నాడు రామనాథం.

"అలాగే వెళ్ళవచ్చును. కాని కొంచెం సేపు ఓపిక పట్టండి. పోలీసుస్టేషన్‌కి కబురు పంపుదాం."

"మాకదేం తెలీదు. మేమే తిన్నగా పోలీసుస్టేషన్‌కి పోతున్నాం."

"మీరు వెళ్ళనవసరం లేదు. పోలీసు లెలాగూ ఇక్కడికొస్తారు. కొంచెం సేపు మీరుండాలి."

మేం ఉంటే దబ్బుకోలేమండీ."

"అయితే పదండి మేం కూడా వస్తున్నాం" అని లేచాడు మాధవరావు. కమల బిక్క ముఖంతో చూసింది మాధవరావు వంక.

"మాతో మీకనవసరం. మా కూడా మీరు రానవసరం లేదు. మీ గొడవ నాకు అయోమయంగా ఉంది. మీరు నగలు వెతికడాలూ, తొంగి చూడ్డాలూ ఎందుకో అర్థమయింది కాదు. మీకు జరిగినసంగతి ముందే తెలుసునట్లేవుంది. ఇంట్లోఎక్కడున్నాడో బావకూడా కనిపించడు. ఇదంతా మాస్తీ పెద్ద పన్నాగం పన్నినట్లు కనిపిస్తుంది. మాదారి మేం చూసుకుంటాం మీతో మాకు పనిలేదు."

పార్వతమ్మ అందుకుంది "అది కాదర్రా, ఆ చచ్చిపోయింది నేననుకున్నట్టున్నారు."

"ఇక్ - నువ్వుండు మాట్లాడకు. అసలిక్కడ మనం ఒక్క క్షణం ఉండకూడదు. నడు" అని అదిలించాడు రామనాథం.

సత్యవతి సత్యనారాయణ పార్వతమ్మతో "రాత్రే అనుకున్నానండీ ఏదో మూడింది..." అని అంటున్నంతలోనే రామనాథం కసిరాడు: "ఇప్పుడిదంతా ఎందుకు? మన మిప్పుడిక్కడేం నోరెత్తకు. పదండి తొరగా."

"ఉండండి ఉండండి. మీరు నావెగ్గెలం చెప్పవద్దు లెండి. కాని పోలీసులొచ్చే వరకూ మీరిక్కడుండక తప్పదు. మీ మంచికోసమే చెప్తున్నా వినండి. ఇప్పుడే పోలీసులకి కబురు పంపుదాం. ఆలస్యం చెయ్యకూడదు. ఆలస్యమైతే మనందరి మీదికీ కూడా వస్తుంది. మీరు తొందర పడకండి."

"సరే. అయితే ఎవరో వొకరు. నేనే వెళ్ళి పిలుచుకొస్తాను." అంటూ పార్వతమ్మ వంక తిరిగి "నే వెళ్ళొస్తా మీరిద్దరూ ఇక్కడే ఉండండి. ఆ గదిలో కూచోండి. మీరెవ్వరూ ఒక్కమాట పెగలద్దు. జాగ్రత్త" అని చెప్పి వెళ్ళిపోయాడు రామనాథం.

* * *

హాల్లో మాధవరావు, కమల నిశ్శబ్దంగా కూచున్నారు. కమల ముఖం ఎర్రబడి కందగడ్డలా వుంది.

"బావగారూ, ఏమిటిది దారి? మామయ్యని అరెస్ట్ చేస్తారా?"

"చేస్తారేమో. మధ్యాహ్నంవరకూ మీ మామ ఇక్కడికి రాకుండావుంటే బాగుండును."

"రామచంద్రరావేనా లేడు, కబురు పంపుదామనుకుంటే"

"అతనిల్లు ఈపక్కనేగా?"

"ఇక్కడలేదు. పాలివుర్లో ఉన్నాడు. అంకరాజు ఇంటిదగ్గర."

"ఇప్పుడు పోలీసులొస్తారు. మీ మామయ్య ఎక్కడికెళ్ళాడని అడుగుతారు. నాకు తెలీదని చెప్పు. ఇది మినహా ఇంక వాళ్లేది అడిగినా దాచక ఉన్నది ఉన్నట్టు, జరిగింది జరిగినట్టూ చెప్పు."

"బావగారూ ఇందులో మా మామ తరఫున మీరు పనిచెయ్యాలి. ఇక్కడ మా స్థితిగతుల్ని పూర్తిగా తెలిసిన వాళ్లెవ్వరూ లేరు. అందరికీ మామయ్యంటే కక్ష. నా మామయ్యే [illegible] అనేస్తారు. బైటపడ్డానికి దారిలేదు. ఎంత దక్కేనా కానివ్వండి మీరే కాపాడాలి."

"నేనెలాగూ కొంత చిక్కుకున్నాను. నన్ను సాక్ష్యానికి పిలిపిస్తారు. అయితే ఒక్కటుంది. నేను కొన్ని విషయాలడుగుతాను. దాపరికం లేకుండా నాకు నిజం చెప్తావా?"

"తప్పకుండా చెప్తాను అడగండి. కాని మీరు మాకు సాయంచేస్తారా?"

"నేను చేతనైనంతవరకు సహాయం చేస్తాను. నిజంగా ఇది మీమామ చెయ్యాలని చేసినపనే అయితే నేరం ఒప్పుకోవలసి ఉంటుంది. అదే మేలు. లేక తనకి తెలియక నిద్రలో ఈ పని చేసివుంటే కాపాడ్డానికి నా చేతనైనట్లా ప్రయత్నం చేస్తాను."

"మీకు మామయ్య మీద అనుమానం ఉందా?"

"అదే ముందు తేలాలి. నేనడిగినవాటికి ఉన్నదున్నట్లు చెప్పు. మీఅత్తగది ఇదయితే, ముందుగదిలో ఎందుకు పడుకుంది?"

"ప్రారబ్ధం!"

"అంటే?"

"రాత్రి మీరు డాక్టరుగారింటికి వెళ్లారు. మీరూ అలా వెళ్ళగానే వాళ్లూ ఇలా వచ్చారు. రాజీ కోసం ఏం చెయ్యవలసి వచ్చినా సిద్ధమే నన్నాడు మామయ్య. రామచంద్రరావు వాళ్ళతో నచ్చచెప్పి తీసుకొచ్చాడు. అత్త, ఆవిడఅన్నగారూ, సత్యవతీ వచ్చారు. ఇక్కడికి రావడానికి మొదట ఒప్పుకోలేదుట. కాని బతిమాలితే ఎలాగో వచ్చారు. వచ్చింతరవాత రామనాథం సణగడం మొదలెట్టాడు. వ్యవహారాలు మాట్లాడి ఎంత రాత్రి అయినా సరే పాత వూరు వెళ్ళిపోవాలన్నాడు. ఇద్దరం బతిమాలాం. భయం లేదన్నాం. నాకే ఈ దిక్కుమాలిన ఆలోచన తట్టింది. చిన్నమామయ్య లేడుకదా అని అతనిగదిలో అత్తని పడుకోమన్నాను. ఈవిషయం మామయ్యకి తెలియనివ్వకుండా ఉంచితే చాలు భయంలేదని చెప్పాను. అత్త సరే నంది. రామనాథం తన చెల్లెలికి కాపలాగా ఆ గదిలోనే పడుకుంటా నన్నాడు. ఆగదిలో మంచం మీద ఒక పక్క, కిందొక పక్క వేయించాను. వరండాలో మడత మంచం వేయించాను సత్యనారాయణ కోసం. వాళ్లు పడుకున్న కాస్సేపట్లోనే చిన్నమామయ్య వచ్చాడు. నేనే సంగతి చెప్పాను. అతను అత్త గదిలో పడుకున్నాడు."

"మీ అత్త గదిమారినట్టు మీ మామయ్యకి తెలియదన్నమాట"

"తెలియదు. మామయ్య రాగానే మామూలుగా చెప్పాను. రాత్రి వ్యవహారం

మాట్లాడ్డానికి వీలుండేదు కాబట్టి అత్త పెళ్ళి వస్తుకుందని మాత్రం చెప్పాను."

"దుర్గయ్యగారి మొదటి భార్య ఏ జబ్బువల్ల చనిపోయింది ?"

"గొంతుకుగుప్పు వేస్తే ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ జరిగిన మర్నాడే పోయింది."

"అప్పటి నుంచీ మీ మామయ్యంటే ఇలా భయపడేదా ?"

"లేదు. అప్పుడు మామయ్యకి నిద్రలో నడిచే అలవాటు లేదు."

"మీ చిన్నమామయ్యకీ, పెద్దమామయ్యకీ పడేదా ?"

"పడకపోవడం లేదు. ఇద్దరూ చాదస్తులే. అసలు మాట్లాడుకోవడమే తక్కువ. తరుచు స్నేహితుల ఇళ్ళల్లో తిరుగుతూ ఉంటాడు. డబ్బు దుబారా చేసేవాడు. మామయ్య కోప్పడినా ఇబ్బిచ్చేవాడు."

"ఊళ్ళో ఎవ్వరూ మీకు నమ్మకస్తులు లేరంటున్నావుకదా కారణం ఏమిటి?"

"ఏముంటుంది? పచ్చగిట్టక పోవడం, అదీకాక మా మామయ్య కావలసిన వాళ్ళనైనా సరే దూరంగా ఉంచుతాడు. పీనాసి అని పేరు. నిజానికి పీనాసీ కాదు."

"ఆయనపట్ల మంచి పలికే వాళ్ళెవరూ ఉండేరా?"

"నా ఉద్దేశం అట్టే మంచీ పలకరు చెడ్డా చెప్పరని."

"గట్టి చిక్కే. సాయంచేసే డాక్టరు లేడా?"

"ఏమో తెలీదు. నిన్న రాత్రి మీరు మాట్లాడారుకదా. డాక్టర్ మూర్తిగా రేమన్నారు?"

"ఆయన కూడా ఏమీ చెప్పలేదు."

"మీరు మా మామయ్యని ఇందాకనే చూశారుకదా. అనుమానానికి ఆస్కారం ఏమైనా వుందా?"

"లేదు మరి. కొంచెం తేరుకున్నట్టు కూడా కనిపించారు."

ఇంతలో మేడమెట్లదగ్గర జనం వస్తున్న అలికిడయింది. పోలీసుఇన్స్పెక్టర్ కొందరు పోలీసుల్నీ ఒక సబిన్స్పెక్టర్నీ, నలుగురు ఇరుగు పొరుగు పెద్దమనుషుల్నీ తీసుకుని వస్తున్నాడు. "మాధవరావు మెల్లిగా అన్నాడు. నువ్వేమీ కంగారు పడకూడదు. జాగ్రత్త. వాళ్ళడిగే వాటికి అన్నీ నిజం చెప్పు."

"మరి ఆకత్తి ?"

"అక్కడే ఉండనీ, భయంలేదు."

ఇంతలోకే అంతా మేడమీద హాల్లో కొచ్చారు. ఇన్స్పెక్టర్ నరసయ్యతో రామనాథం చెప్పాడు "వీరే ప్లీడరు మాధవరావుగారు."

"ఆ గదెక్కడ ?"

"అదే."

"మీరంతా ఇక్కడే ఉండండి." అని చెప్పి వచ్చిన డాక్టర్నీ, ఇద్దరు పెద్ద మనుషుల్నీ, రామనాథాన్నీ, మాధవరావునీ మాత్రం గదిలోకి తీసుకెళ్ళాడు.

(సశేషం)

గల్పిక:

పౌరుషం

"హనుమాయమ్మగారూ, మా మరిదివాళ్లు వచ్చారు. పాపం, పిల్లలు డడడా పాట వినాలని ఏడుస్తున్నారు. ఒక్కసారి మీ గ్రాంఫో నిప్పిద్దురూ!" అన్నది రామాయమ్మగారు.

"మా అబ్బాయి ఇంట్లో లేడండీ. వచ్చిన తరవాత చెబుతా లెండి," అన్నది హనుమాయమ్మగారు.

"అందాకా ఎందుకండీ? ఇప్పుడు, అయిదు నిమిషాల్లో పనివాడిచేత పంపించనూ? ఆ ఒక్క పాటే పెట్టుకు వింటారు. పాపం, పసివాళ్ళు."

"మా వాడికి తెలీకుండా ఇస్తే చంపెయ్యడూ? ఇంకేమన్నా ఉందా? వాడూ భోజనానికి వచ్చే వేళ అయిందిలెండి."

"ఇంతలో గ్రాంఫోన్ పాడవదు లెండీ. మా మరిదిగారింట్లో ఇంతకన్న చాలా పెద్ద గ్రాంఫోనే ఉంది. వాళ్ళేం గ్రాంఫోన్ మొహం ఎరగనివాళ్ళు కారు," అన్నది రామాయమ్మ నిష్ఠురంగా, తను వచ్చిన పని కూడా మరిచిపోయినట్టు.

"గ్రాంఫోన్ మొహం మేమే ఎరుగుదుమన్నానా, అమ్మా? మా వాడు మా రాజినికూడా గ్రాంఫోన్ ముట్టుకోనివ్వడు. అరిగిపోయిన పిన్‌లు పెట్టి రికార్డులు చెడగొడతారని వాడి భయం," అన్నది హనుమాయమ్మ.

రామాయమ్మకు లోపల మండిపోతున్నది. వెధవగ్రాంఫోనుకని ఇంత బతిమాలించుకుంటారా? తన అంతర మెక్కడ ఈ హనుమాయమ్మ అంతర మెక్కడ? తమది రెండంతస్తుల మేడా, వాళ్లది మామూలు పెంకుటిల్లానూ. ఈ హనుమాయమ్మ ఇంటి ఖర్చంతా కలిపి తమ పాల ఖర్చంత ఉండదు. దేహీ అని తను అడగవలిసి వచ్చేసరికి హనుమాయమ్మ ఇన్ని మాటలు మాట్లాడుతుందా? తలుచుకుంటే ఇటువంటి గ్రాంఫోన్లు అరడజను కొనెయ్యగలడు తన ఇంటాయన. ఆయనకు ఉద్యోగం మీద నెలకు నాలుగొందలూ, పొలాల మీద సాలుకు నాలుగువేలూ వస్తాయన్న సంగతి ఈ హనుమాయమ్మ మరుస్తూ ఉంటుంది.

రామాయమ్మగారు ఘాటైనమాట తగిలిద్దా మనుకుంటుండగా హనుమాయమ్మ కొడుకు రానే వచ్చాడు. ఆ ఇల్లాలు తన ఆగ్రహం కట్టిపెట్టి మళ్లీ యాచనాకంఠస్వరంతో, "నాయిన్నాయన! మీ గ్రాంఫోన్ ఓసారి ఇప్పిద్దూ మా మరిది పిల్లలూ వాళ్లూ వచ్చారు, డడడా పాట వినాలని ఏడుస్తున్నారు! మంచివాడివి!" అన్నది.

"గ్రాంఫోన్‌కేం గానండి. పిన్లు అయిపోయాయండీ. పదికూడా లేవు," అన్నాడు హనుమాయమ్మగారి అబ్బాయి.

"పదికూడా ఎందుకూ? ఒక్కసారి విని ఇప్పుడే పంపిస్తాగా?" అన్నది రామాయమ్మ.

మరో అయిదు నిమిషాలకు రామాయమ్మగారి నౌకరు వచ్చి గ్రామఫోనూ, రికార్డులూ, పిన్నుల డబ్బా పట్టుకెళ్లాడు. మరి కాస్సేపటికి గోడ అవతలినుంచి డడడా పాట వినిపించింది.

హనుమాయమ్మగారి అబ్బాయి ఆఫీసు వేళ అయి బయిల్దేరేలోపల "అబ్ తేరెసివా" పాట రెండుసార్లూ, "పియాఘర్ ఆజా" పాట నాలుగుసార్లూ, డడడాపాట ఎనిమిదిసార్లూ మోగింది.

అతను సాయంకాలం ఇంటికి వచ్చేసరికి డడడా మారుమోగుతున్నది.

"వీళ్లకు పిన్లు ఎక్కడివి? కొత్తడబ్బా కొన్నారేమో! అప్పుడే తెచ్చిస్తామన్న గ్రామఫోను ఇంకా ఇవ్వలేదేమో?" అనుకుని అతను రామాయమ్మగారింటికి వెళ్లాడు. రామాయమ్మగారి మరిదికూతురు కాబోలు నాలుగేళ్ల పిల్ల రికార్డులు పెడుతున్నది. ఆ పిల్ల తండ్రికాబోలు పడక కుర్చీలో కూచుని తాళంప్రకారం కాలు ఆడిస్తున్నాడు.

"కొత్తపిన్లు కొన్నారా ఏం?" అన్నాడు హనుమాయమ్మగారబ్బాయి. లేదు. కొత్తపిన్లు కొనలేదు. వాడినపిన్నులు అరలోనుంచి తీసి మళ్లా వాడి కొత్త పిన్నుల డబ్బాలో పోస్తున్నారు.

హనుమాయమ్మగారబ్బాయి మండిపడ్డాడు. గ్రామఫోన్ వాడటం చాతకాని వాళ్లు ఇతర్లది అరువు పట్టుకురాగూడదన్నాడు. ఇస్తామన్న టైముకు గ్రామఫోన్లు తిరిగివ్వకపోవటం చాలా పొడు అలవాటన్నాడు. రామాయమ్మగారి నౌకరు హాజర్లో లేనికారణంచేత తనే గ్రామఫోనూ, రికార్డులూ పట్టుకుని ఇంటికి వెళ్లిపోయినాడు.

రామాయమ్మగారు విజృంభించింది.

"ముండమోపి గ్రామఫోను. ఇవాళ, ఇప్పుడే, తక్షణం మీరు బజారు వెళ్ళి అంతకంటె మంచి గ్రామఫోను తెస్తారా, తీసుకురారా?" అన్నది హనుమాయమ్మ భర్తతో.

మరో వారంరోజుల్లో గ్రామఫోనూ, అయిదారు రికార్డులూ ఇంటికి వచ్చాయి. అందులో డడడాపాట కూడా ఉంది. ఆ పాట మూడురోజులపాటు పొద్దస్తమానమూ మోగింది. ఆతరవాత గ్రామఫోను చరీ చప్పుడూ లేదు.

కొన్ని నెల్లు గడిచాయి.

"ఇంట్లో గ్రాంఫో నుండి ఏం లాభం? వినీ వినీ పాటలు విసుగెత్తాయి," అన్నది రామాయమ్మ.

"ఎందు కొక్కనమన్నావ్? రోజు కో కొత్త రికార్డు కొనాలి. గ్రామఫోనంటే కొనిపారేశాగాని నిత్యమూ రికార్డు లెవరు కొంటారు? అందులో మంచివేవో నాకు తెలిసి చావదాయె."

నాకుమాత్రం తెలిసేడుచు కనకనా!" అంది రామాయమ్మ.

"అయితే మరి ఊరుకో!" అన్నాడు భర్త. మరొక నెల గడిచింది.

ఒకరోజు రామాయమ్మ హనుమాయమ్మగారిదగ్గిరికి ఆదరా బాదరా వచ్చి, "హనుమాయమ్మగారూ, మా చెల్లెలూ వాళ్లూ వచ్చారు. పిల్లలు లారాలప్పా పాట వినాలని ఏడుస్తున్నారు. కాస్త ఆ రికార్డిప్పిద్దురూ ఒక్కసారి పెట్టుకుని ఇప్పుడే పంపిస్తానూ," అన్నది.

వంశమర్యాద

శేఖరం తండ్రి గావుకేక వేస్తున్నాడు.

పక్కవాళ్లు చెప్పవచ్చే మాటలు వినకుండా ఆయనకు, కోపమొస్తే కుప్పిగంతులు మొదలు పెడతాడు. పెద్దగా గొంతెత్తి అరుస్తాడు. నోటికొచ్చిన కూతల్లా కూస్తాడు. ఆవేశంతో-ఏమాత్రం వివేచన లేకుండా. వచ్చిన చిక్కేమిటంటే, కొడుకు పాడైపోతున్నాడని ఆయన బెంగ. బాగేపడుతున్నానని శేఖరం అనుకోటం. వీడి బాగు వాడికి చెడ్డగా తోస్తుంది.

తండ్రికోపం శేఖరానికి పరిచయమే. ఆయనది ప్రాచుపగ. ఒకపని పనికట్టాడంటే, దాని అంతు కనుగొంటేగాని విడవడు. ఇదేదో తెగతెంపులుకే వచ్చిందనుకుంటున్నాడు శేఖరం.

'పెంచి పెద్ద చేసినందుకు పేరయినా నిల్పరా! తండ్రీ' అని కామయ్యగారు (శేఖరం తండ్రి) బ్రతిమాలుతున్నాడు. ఇప్పుడింతా, పేరు నిల్పటానికే నని శేఖరం అంటాడు. వీడి సమాధానం ఏం పని చేస్తుంది ?-అదీ, యీ ఘనాపాఠిముందు!

శేఖరానికి చిన్నప్పటినించీ వున్న పిచ్చే అది. మొదట్లో నాటకాల్లో వేషం వేసి, ఊరూరా తిరిగి,-రావటం!

కామయ్యగారి ఎదుటే ఇద్దరు ముగ్గురు శేఖరం నటనాచాతుర్యం పొగడేటప్పటికి, ఆయన వుబ్బి తబ్బిబ్బయి, కొంత సహాయం గూడా చేశాడు ఆర్థికంగా—అదనంగా. తీరా ఒక నాటకం తాను స్వంతంగా చూచేసరికి ఆయన బుర్ర తిరిగి పోయింది.

"...ఎంత నాటకమయితే మట్టుకు,-ఆడది వస్తూన్నది అంటే దూరంగా తొలగి పొమ్మని చెప్పక, కాళ్లమీదబడి ప్రార్థనలా ? వీడి శ్రాద్ధం - 'వంశమర్యాద' ఏం నిలిపి యేడుస్తాడు యిల్లా ? అడ్డమయిన వాళ్ళ కాళ్లూ పట్టుకుని..." అంటూ రుస రుస లాడాడు. శేఖరం ఎంత ఓదార్చినా, తప్పుకొనక-నాటకాల్లో వేషాలు వెయ్యటానికి కట్టడిచేశాడు. చిన్నతనం అవటంవల్ల అప్పట్లో తండ్రి నిర్బంధానికి లొంగాడు. గాని, యిప్పుడు పాతికేళ్ల వాడు—ఎల్లా లొంగుతాడు ? 'నీకు, స్వతంత్రమయిన వూహాలు వుండగూడదు. నే చెప్పేది విని ఆ ప్రకారం నడువు-' అని అంటే ఎట్లా మరి ?

ఎదురుగా మేడమీద కూర్చున్నవాళ్లం మొదట, కామయ్య కేకలు విని రేడియో అనుకున్నాం. నేను మేడ దిగి కామయ్యగారి యింటికి వచ్చేటప్పటికి శేఖరం కుక్కిన పేనల్లే కుర్చీలో కూర్చుని సిగరెట్టు పీలుస్తున్నాడు, తండ్రిని యిష్టమొచ్చినట్లు ఎగరనిస్తూ.

నా రాక గమనించి కామయ్యగారు, 'రా, నాయనా' అన్నారు లోపలికి దుఃఖం దిగమింగుతున్న వాడిలాగా.

ఆయనలో వున్న విశేషం అదే. ఎంత గంభీరంగా మాట్లాడుతూన్నా, మూడో వాడు, తెలిసినవాడు - కంట బడేసరికి - గాంభీర్యం నిర్వీర్యమై ఏడుపు తగులుకుంటుంది.

నే నెందుకు వచ్చానో, యిద్దరికీ

'ఏరించిశ్రీ'

తెలుసు. మామూలుగా వారానికోసారి తండ్రికొడుకులపోరాటంలో, నేను మధ్యవర్తిత్వం వహిస్తూవుంటాను.

నేను స్థిమితంగా కుర్చీలో కూర్చున్నాక కామయ్యగారు గ్రంథం మొదలుపెట్టాడు. చిన్నప్పుడు తల్లిలేనిపిల్లడిని ఎల్లా పెంచింది-చదువుకొనేరోజుల్లో ఏ లోపమూ లేకుండా చేసిందీ, పెండ్లిగొడవలూ-అన్నీ!

ఆయన వాగ్ధోరణిలో కొట్టుకుపోతూ, ఏదన్నా ఆధారం దొరికితే బ్రతికి బయట బడదామనే ఆతృతతో అప్పుడప్పుడు గడియారంవయిపు గమనిస్తూ, అమూల్య కాలం యిట్లా దుర్వినియోగం అయిపోతూన్నందుకు ఒకమూల సణుగుకొంటూ, అయినా యివాళ్టి పోట్లాట తీరిస్తే, లోకానికి కొంత వుపకారం చేసినవాడి నవుతానని సంతోషిస్తూ-అల్లానే కూర్చున్నాను కుర్చీలో.

ఆయన చెబుతూన్న విషయాలు అనేక పర్యాయాలు నేను విన్నవే, ఆయన నోటినించి. అయినా మళ్లీ చెపుతూవున్నాడు. ఊకొట్టుతూ వున్నాను. ఆయన్ను యీ విషయంనించి, అసలు విషయానికి మార్చటం చాలా కష్టమయిన పని. పైగా ఆయనకు కోపమూ రావచ్చు. అల్లా జరిగితే మనమందరం ఆయన దృష్టిలో కృతఘ్నులుగా తయారవుతాం. అయినా ధైర్యం చేసి, ఒక్క ముక్క విసిరాను; ఆయనకు కోపం రాకుండా వుండే సమయం గమనించి.

'ఆ-ఏమున్నది నాయనా; అంతా మామూలేగా' అన్నాడు కళ్లనీళ్లు తుడుచుకొంటూ.

మళ్లీ ఆయనే మొదలు పెట్టాడు.

'మీ కుటుంబం, మా కుటుంబం ఏమీ సంబంధం లేకపోయినా, ఎంత ఆత్మీయంగా వున్నాం చూడండి.

వీడు వొక్కడూ-నా వంశమర్యాద నిల్పుతానన్నాడు. నేనూ అదే ఆశించాను సరా?'

'నిలపక యేం చేశాడు?' అన్నాను. ఆయనలో కొంత తీవ్రత కలిగించటానికి, ఎఫెక్టుకోసం శేఖరంముఖంవైపు చూచాను. 'ఏమీ లేదు రాద్ధాంతం' అన్నట్లుగా గుడ్లు తిప్పాడు శేఖరం. 'ఏం జరగటమేమిటి-' కామయ్యగారి గొంతు అనంతాన్ని చీల్చుకుంటూ బయలుదేరింది- 'కొంపేమునిగిందిట్టి'

ఒక్క ముక్కతో చుట్టూ చేరిన వాళ్లను. ఏ రసంలో కావాలంటే ఆ రసంలో ముంచెయ్యగల శక్తి అదుగో, ఆయన కొక్కడికే వుంది. ఆతృతచూపుతూ ముఖం ఆయనవేపు సాగదీశాను.

'సుఖంగా యింటిపట్టున వుండి, హాయిగా పొద్దుపుచ్చక ఏమిటి చెప్పండి యీ ఆలోచనలు. చిన్నప్పుడే నాటకాల్లో వెయ్యాలని యీ బుద్ధి పుట్టింది. అక్కడికీ అపాయమని, తెలిసినచోటల్లా వారిస్తూ వచ్చాను.

వెండితెరమీద ఎగరాలనా ఆశ! సినిమావాళ్లకు నీతి నియమాలు వుంటాయా చెప్పండి. వాళ్లకు వుత్తరాలా ?—

అప్రయత్నంగా ఆయన గొంతు నిల్చిపోయింది, కారణం ?

గడియారం పదకొండు గంటలూ కొట్టింది.

తొందరగా డ్రెస్సు చేసుకొంటూ నన్ను పిల్చి రహస్యంగా, 'చూడండి, వీడి పని యిది. ఎంత అవమర్యాద! నలుగుర్లో. మీరన్నా నాలుగు చివాట్లు తగిలించి- చెప్పిచూడండి-' అని మరీరహస్యంగా చెవిలో రెండుముక్కలు చెప్పి వెళ్ళిపోయాడు- కామయ్యగారు. ఆయనకు హామీ యిచ్చి సాగనంపి, శేఖరంవైపు తిరిగాను.

'ఏమిటోయ్ యిది?'

'ఎక్కడ, ఏముందండి?'

'ఇదుగో, వున్న రహస్యం అంతా మీ నాన్న బయలు పెట్టారు. నాకు, నువ్వు చెప్పే రెండు ముక్కలూ చెప్పెయ్యి. నే నీ విషయం పరిష్కారం చేసేస్తాను.' అన్నాను.

మాట్లాడకుండా ఒక కాగితం మాత్రం నా కందించాడు—ఏదో ఫిలింకంపెనీ డైరెక్టరునుంచి శేఖరానికి వుత్తరం!

నేను వుత్తరం చదివి తల పైకెత్తాక శేఖరం మొదలెట్టాడు.

'వచ్చిన ఛాన్సు పోగొట్టుకోమ్మంటారా?'

శేఖరాన్ని స్టూడియోవాళ్ళు ఇంటర్వ్యూకు పిల్చారు. అతని నటనాచాతుర్యం నాకు తెలుసు. అసలా స్టూడియోకు అప్లికేషన్ పెట్టమన్నదీ నేనే.

ఇంతవరకూ వచ్చి, జారవిడవటం- నాకూ యిష్టంగాని పని.

ఏదన్నా అంతర్జాతీయసిన్మా దొరుకుతుందేమో, రంజింపచేద్దాం అని ఆలోచిస్తున్నాను,

'చెప్పకుండా, రహస్యంగా వెళ్ళితేఏం' అన్నాడు,

అప్పు, ఆందోళనకు కారణం అవుతుంది. పైగా పెద్దమనిషితరహాగాదు.

ఆలోచనలు పూర్తిఅయింతర్వాత నేనతని చెవిలో రెండు ముక్కలు వూది, మాయింటికి వెళ్ళిపోయాను.

నే గుమ్మం ఎక్కుతూండగా శేఖరం తమ్ముడు 'మర్చిపోయారండీ' అంటూ నా స్టెతస్కోప్ తెచ్చియిచ్చాడు.

తరువాత వుత్సాహంగా శేఖరం రెండు సినిమాపాటలు పాడటం, మా మేడమీదకి వినిపించింది.

* * *

రెండురోజులయింతర్వాత,—

మేం వేసిన ప్లాను పనిచేసింది, బాగా. రెండు రోజుల తరువాత 'నీ చెల్లెలికి సంబంధం చూడమని' కొంత డబ్బు యిచ్చి, శేఖరాన్ని పంపించాడు కామయ్యగారు. పదిరోజుల తర్వాత, మద్రాసు నుంచి వుత్తరం వచ్చింది-

తనను సినిమావాళ్లు పిల్చుకువెళ్ళి పదివేలరూపాయలకు బుక్ చేసుకున్నారనీ, అర్నెల్లు పట్నంలోనే వుండవలసి వస్తుందనీ- రాశాడు శేఖరం.

ఆనాడే అతను పంపించిన మూడు వేల రూపాయలూ కామయ్యగారి చేతిలో పడినై.

కొడుకుదగ్గర్నించి డబ్బు బాగా వచ్చేటప్పటికి, ఆయన శేఖరాన్ని విమర్శించటం మానివేశాడు.

ఆర్నెల్ల తర్వాత- కొడుకు, బావగార్ని వెంటబెట్టుకు వచ్చేటప్పటికి-మరీ సంతోషపడ్డాడు.

ఇప్పుడు కొడుకు రాబడి చూచి-

'వంశమర్యాద నిలిపావురా', అంటాడు కామయ్యగారు. 'వంశమర్యాద కర్థం వాగుతూవుంటుంద'ని శేఖరం నాకు ధన్యవాదా లర్పించాడు.

రెండో పెళ్లి

(18-వ పేజీ తరువాయి)

పరీక్ష ఎంత కాలానికీ పాసుకాలేకుండా ఉన్నాడు...

చలపతిగారు మెయిల్లో వచ్చాడు. అంతకుముందే కొత్త కునుకు పట్టిన లలిత బయటి తలుపుచప్పుడుకు లేచి కూర్చున్నది.

"అన్నయ్యా, అన్నయ్యా!......నాన్నొచ్చాడు."

కొంతం నిద్రమత్తుతో ధోవతి సరిచేసుకుంటూ లేచివచ్చి మధ్యవాకిలి తెరిచి బయటికి వెళ్ళాడు.

"ఇంకా నిద్రపోలేదుటే, అమ్మా?" అంటూ చలపతి, పక్కమధ్య కూర్చుని ఉన్న తన కూతుర్ని చూసి ఆశ్చర్యపడ్డాడు. ఆయన కాళ్లూచేతులూ కడుక్కుని, బట్టలు మార్చుకుని వచ్చి కూతురిపక్కన నడుము వాల్చేసరికి దిండు చల్లగా, తడిగా తగిలింది.

"ఏడిచావా, తల్లీ?" అన్నాడు చలపతి కూతురితో.

"భయంవేసింది, చీకట్లో ఒక్కదాన్ని పడుకుంటే! అన్నయ్యొచ్చి దీపం వెలిగించాడు." అన్నది లలిత.

"గదిలో అన్నయ్య వదినా ఉన్నారుగా భయం దేనికీ?"

"వాళ్లు తలుపు గడియ వేసుకున్నారు."

* * *

మర్నాడు చలపతి తన అన్నగారిదగ్గిరికి వెళ్లాడు.

"ఏంరా? నేను మళ్లీ పెళ్లిచేసుకోవటానికి నిశ్చయించా. పిల్లకు దిక్కూ, మొక్కూ లేకుండా ఉంది," అన్నాడు చలపతి.

గ్రంథ సమీక్ష

సోవియట్‌భూమి (తెలుగు)

న్యూఢిల్లీనుంచి టాస్ వార్తాసంస్థవారు నూతనంగా తెలుగులో ప్రచురిస్తున్న "సోవియట్‌భూమి" తొలిసంచిక మాకార్యాలయం చేరింది. అట్టమీద అందమైన వర్ణచిత్రాలున్నవి. సోవియట్ దేశాన్నిగురించి తెలుసుకోదగిన విషయాలకు చెందిన వ్యాసాలూ. వాటికి సంబంధించిన ఛాయాచిత్రాలూ అనేకం ఉన్నవి. ఇట్టి ప్రచురణలు సోవియట్‌యూనియనుకూ, ఇతర దేశ ప్రజలకూ సన్నిహిత సంబంధాలు కలిగించి, ఒకరిని గురించి మరొకరికి తెలియడానికి తోడ్పడగలవు. సంచిక వెల 2 అణాలు

సంధ్య

అతినవ్య సాహిత్య పక్షపత్రిక. సంపాదకులు: శ్రీ అని శెట్టి, శ్రీ గంగినేని. ప్రకాశకులు: సర్వోదయాప్రెస్, నరసరావుపేట. సంవత్సరచందా: రు 9 లు; విడిప్రతి 6 అణాలు. నవీనభావాలతో, అభ్యుదయ ధోరణిలో నడువడే ఈ పక్షపత్రిక అనేక కొత్తశీర్షికలతో కూడి ఉన్నది. శాంతి ఉద్యమం దీని ప్రత్యేకలక్ష్యం. ఈ పత్రిక ప్రజలలో నవచైతన్యాన్ని కలిగించటానికి పాటుపడుతుందని ఆశిస్తున్నాము.

పొట్టిబావ

పిల్లలకథల మాసపత్రిక. సంపాదకుడు: శ్రీ కే. బాలగంగారావు. ప్రకాశకులు: బొమ్మరిల్లు పబ్లికేషన్స్, "లిటిల్‌హౌస్," కాశీనాథ.

సంవత్సరచందా: రు 2-4,0 లు. విడికాపి 3 అణాలు.

విజ్ఞానవిషయాలు. కథలు, పజిల్సు, నవ్వులు. మొదలైన అనేక శీర్షికలు గల పై పత్రిక తొలిసంచిక మాకార్యాలయం చేరింది. చిన్నపిల్లలు ఆనందించగల పత్రిక.

టామ్ సాయర్

(25-వ పేజీ తరువాయి)

మళ్లీ ఇంట్లోకి వెళ్లిపోయింది.

టామ్ ఉత్సాహం ఎంతో కాలం దక్కలేదు. ఆటవిడుపు పిల్లలందరూ హాయిగా తిరుగుతారు. పని చేస్తున్నందుకు తనని చూసి నవ్వుతారు. ఏ కుర్రాడికన్నా లంచం పెట్టి వాడిచేత తనపని చేయిద్దామన్నా తనదగ్గిర ఏమీ లేదు. కాని ఇంతలో వాడికొక గొప్ప ఆలోచన తట్టింది. ఈ ఆలోచన మనసులో పెట్టుకుని టామ్ ప్రశాంతంగా రంగు పూయసాగాడు.

కొద్దిసేపట్లో గెంతుకుంటూ బెన్ రోజర్స్ అటు వచ్చాడు. వాడు ఆపిల్ పండొకటి తింటూ స్టీమరు ఆట ఆడుతూ, మధ్యమధ్య స్టీమరుకూత వేస్తూ వచ్చాడు. వాడే పడవా, వాడే సరంగూ, వాడే గంటలూను.

"పడవ ఆపండో హోయ్! టింగ్, టింగ్, టింగ్!...కాస్త వెనక్కి మళ్లించండి! టింగ్, టింగ్, టింగ్! ... ఎడంపక్కకి. భుక్కు, భుక్కు, భుక్కు! ... తాడు భద్రం!" అంటూ బెన్ ఆడుతున్నాడు.

ఈ స్టీమరును లక్ష్యపెట్టకుండా టామ్ తదేకధ్యానంతో రంగు వేస్తున్నాడు. బెన్ వాడికేసి కాస్సేపు చూసి, "హీ, హీ! అణిగిందీ అబ్బాయిగారి తిక్క?" అన్నాడు.

జవాబు లేదు. టామ్ తాను అప్పుడే వేసిన రంగుకేసి పరీక్షగా చూసి, ఇంకో పాము పామి మళ్లీ అట్లాగే చూశాడు. బెన్ వచ్చి టామ్ సరసనే నిలబడ్డాడు. ఆపిల్ కోసం టామ్ నోరూరుతున్నది, కాని వాడు పని మానలేదు.

"చాకిరి తగిలిందిరా, అబ్బి?" అన్నాడు బెన్.

టామ్ గిర్రున తిరిగి, "నువ్వట్రా, బెన్. నే చూళ్లేదే?" అన్నాడు.

"ఏయ్, నేను ఈత కొట్టటానికి పోతున్నా. నిజం! నీకూ కూడా రావాలని లేదూ? అయినా నీకు పని చెయ్యాలనుందేమో లే."

"పనేమిటి?" అన్నాడు టామ్.

"అది పని కాదూ?"

"ఒకవేళ అవునేమో! రంగు వేసే అవకాశం రమ్మన్నప్పుడల్లా వస్తుందా?"

ఈమాట అనేసరికి బెన్ అభిప్రాయం మారింది. టామ్ రంగు వెయ్యటమూ, వెనక్కు అడుగు వేసి చూసుకోవటమూ, అక్కడక్కడా రంగు సర్దటమూ చూస్తున్న కొద్దీ బెన్‌కు ఉత్సాహం హెచ్చింది.

"ఒకే, టాం. నన్నుకూడా కాస్త రంగు వెయ్యనివ్వరా."

"అమ్మో, పెద్దమ్మ ఒప్పుకోదు. వీధివేపున్న భాగం కూడానూ. అదే వెనకభాగమైతే ఫరవా లేదు. దీనికి సరిగా రంగు వెయ్యటం అందరివల్లా అవుతుందనుకున్నావా?"

"అట్లాగా? పోనీ కొంచెం వెయ్యనీ. ఒక్క రవ్వ!"

"నాకేం అభ్యంతరం లేదురా. దొడ్డమ్మ ఒప్పుకోదు. జిమ్ రంగు వేస్తానంటే ఆవిడ ఒప్పుకోలా. సిడ్ వేస్తానన్నా ఒప్పుకోలా. నువ్వు దీన్ని పాడుచేశావంటే—"

"ఓయబ్బ, నే జాగ్రత్తగా నే చేస్తాలే. ఒక్కసారి చూడనీ. పోనీ, నా ఆపిల్‌లో కొంత ఇస్తాలే.

"నువ్వు పాడు చేస్తావు, బెన్."

"ఆపిల్ అంతా తీసుకోలే!"

అయిష్టం నటిస్తూ టామ్ కుంచె బెన్ చేతికిచ్చి, హాయిగా నీడలో పడుకుని కాళ్లాడిస్తూ ఆపిల్ తినసాగాడు. బెన్‌లాటి కుర్రవాళ్లు టామ్‌కు చాలామంది దొరికారు. బెన్ అలిసిపోయే సమయానికి బిలీ ఫిషర్ వచ్చాడు. వాడితరవాత జానీమిలర్ వచ్చాడు. అందరూ టామ్‌కు లంచాలు పెట్టి వాడి పని చేసిపెట్టారు. టామ్ చెయ్యి కదిలించకుండా చెక్కలగోడకు మూడు పూతల రంగు పడింది. రంగు అయిపోబట్టే గాని, లేకపోతే టామ్ ఊళ్లో ఉన్న కుర్రాళ్లందరినీ దోచేసేవాడే.

(ఇంకా వుంది)

★

కిందటి వారం ప్రశ్నలకి జవాబులు

అసలు ఆ రెండు పిల్లులు మొదటినుంచీ ఎదురు బదురుగానే ఒకటి ఉత్తరం వేపు, మరొకటి దక్షిణం వేపు చూస్తూనుంచున్నాయి,

బేడాకి 3 జామపళ్లు. అన్నే అరటిపళ్లు కొన్నాడనుకుందాం. 3 అరటిపళ్ల ఖరీదు మూడర్థణాలు 0-1-6 అవుతుంది. కనుక 0-3-6 కి 3 జామపళ్లు. 3 అరటిపళ్లు వచ్చాయి. 7 అణాలకి అంతకి రెట్టింపు— 6 జామపళ్లు, 6 అరటిపళ్లు వస్తాయి.

పెద్దబస్తాలో ఉన్నవన్నీ 30 మానికలు.

★

ఏ పొలం పెద్దది?

ఇద్దరన్నదమ్ములున్నారు. అన్నకి 4 చదరపు మైళ్ల పొలం వున్నది. తమ్ముడు పొలం 3 మైళ్ల చదరంగా ఉంటుంది. అన్నదమ్ముల పొలాలలో ఏది పెద్దదో చెప్పండి.

ఎన్ని బాతులు?

ఒక చెరువులో కొన్ని బాతులు ఒకదాని వెంట ఒకటి వరసగా ఈదుతున్నాయి. ఒక బాతుకి ముందు రెండున్నాయి మరొక బాతుకి వెనక రెండున్నాయి. మధ్యలో ఒక బాతుంది. మొత్తం ఎంత తక్కువ బాతులు ఆ వరసలో ఉండటానికి వీలవుతుందో చెప్పండి.

కాలవ నెలా దాటారు?

ఒక కాలవలో మనుషులను దాటవేసే చిన్న బల్లకట్టు వుంది. వాంట్లో రాముడు, భీముడు అనే చిన్నదమ్ములూ, వాళ్ల తండ్రీ, ఒక పోస్టుబంట్రోతు దాటవలసివచ్చింది. రాముడు 70 పౌనులు, భీముడు 70 పౌనుల బరువున్నారు. వాళ్ల తండ్రి బరువు 140 పౌనులు, పోస్టుబంట్రోతు బరువు 140 పౌనులు. కాని ఆ బల్లకట్టు ఒక్కసారి 140 పౌనులు కంటె ఎక్కువ మొయ్యలేదు మరి అంతా కాలవ అవతలి గట్టుకి ఎల్లా చేరుకున్నారో చెప్పండి.

నేటి ప్రపంచం

(3-వ పేజీ తరువాయి)

రించుకున్నాడు కాని అది ప్రచురించబడకుండా ఎవరూ ఆపలేకపోయారు అంతే కాదు మెకార్థర్ వ్యూహం అమెరికన్ ప్రజానీకానికీ, రిపబ్లికన్ పార్టీకీ, నౌకా బలాధిపతులికీ నచ్చింది ప్రభుత్వవిధానానికి పలుకుబడిలేదు విదేశాంగ శాఖలో శాశ్వతోద్యోగులుకూడా మెకార్థర్, విధానాన్నే బలపరుస్తారు

ఆసియాలో అమెరికాపట్ల నానాటికీ పెరుగుతున్న నిరసన, విమర్శ, అనుమానాలను నివారించడానికి ట్రూమన్ యత్నిస్తున్నాడు కాని మెకార్థర్ వీటిని లక్ష్యపెట్టడు వాస్తవానికి ఉభయుల ఆశయాలు భిన్నం కావు కాని ఒకరు లక్ష్యాన్ని పైకి తెలియపరచకుండా దయాగుణాన్ని ప్రకటించి ఆసియా దేశాల్ని మభ్యపుచ్చ యత్నిస్తారు మెకార్థర్ తన లక్ష్యాన్ని దాచుకోడు ఆసియావాసుల పట్లగల నిరసన భావాన్ని దాచుకోడు సైనికబలంతోనే రాజకీయాల్ని నడపాలనే తన ఉద్దేశాన్ని దాచుకోడు ఇంతే తేడా

మెకార్థర్ వ్యవహారవిధానంవల్ల ఆసియా దేశాలతో పైరం తప్పదని ట్రూమన్‌కు, ఎచిసన్‌కు తెలుసును ఫార్మోజా సమస్యపై చీనాతో యుద్ధం కూడా సంభవించవచ్చునని తెలుసును కాబట్టి ఆరీతిని మార్చవలసిన అగత్యం కలిగింది

కొరియాలో అమెరికన్ సేనల దండయాత్ర సందర్భంలో ఇది కనపడుతుంది భద్రతామండలి ఆదేశం కోసంగాని, ట్రూమన్ ఆజ్ఞకోసంగాని మెకార్థర్ నిరీక్షించలేదు కమ్యూనిస్టులదాడి ప్రారంభమైన మూడోరోజుకల్లా మెకార్థర్ తన సైన్యాలను పంపాడు. తీరాపంపిన తరవాత ప్రతిష్ఠకాపాడుకోడంకోసం ట్రూమన్ తానాజ్ఞ ఇచ్చినట్లు ప్రకటించవలసివచ్చిన మాట అందరికీ తెలిసినదే

ఇదేరీతిగా కొరియా భవిష్యద్రాజ్యాంగ స్వరూప నిర్ణయంలో కాని, సైనిక క్రమశిక్షణ కాలంలో పరిపాలనలో కాని ఐక్యరాజ్య సమితి నియమించిన కమిషన్‌తో మెకార్థర్ సవ్యంగా ప్రవర్తించగలడనే నమ్మిక ట్రూమన్‌కు లేదు కమిషన్ ఆజ్ఞలను కాని, అమెరికన్ ప్రభుత్వ ఆజ్ఞలను కాని మెకార్థర్ పాలించేవాడు కాదు తనకు అవి అతనికి నచ్చాలి లేదా స్వతంత్రించి వ్యవహరించగలడు ఇది వరకే అలా జరిగింది ఈ కారణాల వల్లనే ఆసియాలో తన సామ్రాజ్యాన్ని తానే నెలకొల్పుకున్న మెకార్థర్‌తో సంప్రదించటానికి ట్రూమన్ 7500 మైళ్లు ప్రయాణంచేసి పసిఫిక్ ద్వీపాలకు వెళ్ళాడు

సమావేశం ఒక్కపూట జరిగింది ఇదివరలో అమెరికన్ పరిపాలకులు టోకియోలో కలుసుకున్నప్పుడల్లా వారే అతని భావాలను అంగీకరించి అతని భక్తులైనారు ఈమారు ట్రూమన్ మెకార్థర్ చేత ఆజ్ఞలను పాలింపచేస్తాడో, లేక ఇతరులవలెనే తానూ అతని విశిష్టతను సామర్థ్యాన్నికి లొంగి పరివర్తన చెందుతాడో కనిపెట్టదగిన విషయం అయితే ఎవరు ఏరీతిగా పరివర్తన చెందినా, అది అప్పుడే తెలియదు ఎవరిమట్టుకు వారు మామూలుగానే మాట్లాడతారు పరివర్తన ఎవరిలోనైనా ఉంటే అది చేతలలో వ్యక్తం కావలసిందే.


[సూర్యనారాయణ]



చిత్తూర్‌లోని భక్తవిహారా మందిరం —శ్రీ పి. వి. పతి

Regd. No. M. 4479

శ్రీమద్భగవద్గీత



వ్యాఖ్యాత: శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు

ఐదవ ముద్రణము

సంస్కృతమూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.



★

ఖద్దరు బైండు

వెల రు 4-0-0 లు.

తపాలాఖర్చు రు. 0-9-0.

★

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు 212, మదరాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras.